
'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 114

సోమవారం 15-7-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




## జయహో జొకోవిచ్..

దాదాపు ఐదు గంటలపాటు నువ్వా నేనా అన్నట్లు సాగిన వింబుల్డన్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో టాప్‌సీడ్ జొకోవిచ్ పైచేయి సాధించాడు. తుది సమరంలో ఈ సెర్బియా స్టార్ 7–6 (7/5), 1–6, 7–6 (7/4), 4–6, 13–12 (7/3)తో రెండో సీడ్ ఫెడరర్ (స్విట్జర్లాండ్)పై గెలిచి ఐదోసారి విజేతగా నిలిచాడు. జొకోవిచ్‌కు రూ. 20 కోట్ల 26 లక్షలు, రన్నరప్ ఫెడరర్‌కు రూ. 10 కోట్ల 13 లక్షలు ప్రైజ్‌మనీగా లభించాయి.

– స్పోర్ట్స్‌లో

సూపర్ విక్టరీ..




# జగజ్జేత ఇంగ్లండ్


## ఫలించిన 44 ఏళ్ల వన్డే వరల్డ్ కప్ స్వప్నం

### హోరాహోరీగా జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్‌పై విజయం

### మ్యాచ్, సూపర్ ఓవర్ టై.. బౌండరీల ఆధారంగా గెలిచిన ఇంగ్లండ్

'ఇట్స్ కమింగ్ హోమ్' అంటూ ఉర్రూతలూగిన ఇంగ్లండ్ అభిమానుల కల నెరవేరింది. క్రికెట్ పుట్టిన దేశంలో, ప్రపంచ కప్ అడుగులు మొదలైన వేదికపై ఎట్టకేలకు సొంత టీమ్ స్వప్నం నెరవేరింది. లార్డ్స్ మైదానంలో అత్యంత రసవత్తరంగా సాగిన ఫైనల్ పోరులో మోర్గాన్ సేన న్యూజిలాండ్‌ను ఓడించి తొలిసారి వన్డే ప్రపంచ కప్ విజేతగా అవతరించింది. గతంలో మూడు సార్లు ఫైనల్లో పరాజయం పాలైన ఇంగ్లండ్ ఈసారి కూడా ఓటమికి చేరువలో నిలిచినా... అనూహ్య మలుపు, అదృష్టం కలిసొచ్చి తొలిసారి చాంపియన్‌గా నిలిచింది. ముందుగా న్యూజిలాండ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 241 పరుగులు చేయగా... ఇంగ్లండ్ కూడా సరిగ్గా 241 పరుగులకే ఆలౌట్ కావడంతో స్కోర్లు 'టై'గా ముగిశాయి. దాంతో వన్డే చరిత్రలో తొలిసారి 'సూపర్ ఓవర్'ను ఉపయోగించగా... అక్కడా రెండు జట్లు 15 పరుగులతో సమంగా నిలిచాయి. అయితే నిబంధనల ప్రకారం అత్యధిక బౌండరీలు సాధించిన జట్టు విశ్వవిజేతగా తమ పేరును లిఖించుకుంది. కివీస్ 17 బౌండరీలు బాదగా, ఇంగ్లండ్ ఖాతాలో 26 బౌండరీలు ఉన్నాయి. దాంతో వరుసగా రెండో ప్రపంచ కప్ ఫైనల్లోనూ ఓడి కివీస్ కన్నీటిపర్యంతమైంది.

- వివరాలు స్పోర్ట్స్‌లో


శ్రీహరికోటలో ప్రయోగానికి సిద్ధంగా ఉన్న జీఎస్‌ఎల్వీ మార్క్3-ఎం1 రాకెట్

## హలో.. హలో..

# చందమామ

### నిర్విఘ్నంగా కొనసాగుతున్న కౌంట్‌డౌన్

- ఇస్రో చేపట్టిన చంద్రయాన్–2 ప్రయోగానికి సంబంధించి కడపటి వార్తలు అందేసరికి కౌంట్‌డౌన్ నిర్విఘ్నంగా కొనసాగుతోంది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్‌ఎల్వీ మార్క్3–ఎం1 రాకెట్‌ను ప్రయోగించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కౌంట్‌డౌన్‌లో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాకెట్‌కు రెండో దశలో 110 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపారు. గ్రహాంతర ప్రయోగాల్లో భారత్‌కు ఇది మూడోది. చంద్రునిపై పరిశోధనలు చేయడానికి చేస్తున్న రెండో ప్రయోగం ఇది. షార్ నుంచి 75వ ప్రయోగం కావడం కూడా విశేషం. ఇది చరిత్రలో అతిపెద్ద మైలురాయిగా నిలిచిపోనుంది.

- వివరాలు 2లో



మేఘసందేశం = ఆగస్టు, సెప్టెంబర్‌లో భారీ వర్షాలు

# ఉందిలే మంచికాలం

### బలహీనపడుతున్న ఎల్ నినో

- రానున్న రోజుల్లో తటస్థ స్థితిలోకి వెళ్తుందని వాతావరణ నిపుణుల అంచనా
- పసిఫిక్ మహాసముద్రంలో తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- హిమాలయాల నుంచి వస్తున్న రుతుపవన ద్రోణి
- ఫలితంగా నెలాఖరు నుంచి ఆగస్టు, సెప్టెంబర్‌లలో తెలంగాణ, ఏపీకి భారీ వర్షసూచన

సాక్షి, హైదరాబాద్

'నైరుతి' నిస్తేజంతో దిగాలుపడుతున్న తెలుగు రాష్ట్రాల రైతులకు వాతావరణ నిపుణులు తీపి కబురు అందించారు. ప్రపంచ వాతావరణంపై ప్రత్యేకించి మన దేశంలో రుతుపవనాల కదలికలపై ప్రతికూల ప్రభావం చూపుతున్న ఎల్ నినో స్థితి క్రమంగా బలహీనపడుతోందని తాజా అధ్యయనంలో తేల్చారు. ఇది ఒకటి, రెండు నెలల్లో తటస్థ స్థితికి చేరుకుంటుందని, దీని ప్రభావంతో ఆగస్టు, సెప్టెంబర్‌లలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు బలహీనంగా మారడంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు

మిగతా 4వ పేజీలో ▶

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో

## 37.76 శాతం పాస్

- వివరాలు 3లో

## కర్తార్‌పూర్ కారిడార్‌పై జాగ్రత్త

### పాకిస్తాన్‌ను అప్రమత్తం చేసిన భారత్

- కర్తార్‌పూర్ సాహిబ్ తీర్థయాత్ర భగ్నానికి కొన్ని శక్తులు ప్రయత్నించొచ్చని పాకిస్తాన్‌ను భారత్ హెచ్చరించింది. సిక్కుల పవిత్ర యాత్రా స్థలాలైన పాక్‌లోని దర్బార్ సాహిబ్‌ను భారత్‌లోని డేరా బాబా నానక్ మందిరంతో కలిపే కర్తార్‌పూర్ కారిడార్‌పై ఇరు దేశాలు ఆదివారం చర్చించాయి.

- 4లో

## పెద్దలకూ హెల్త్ పాలసీ

- ప్రీమియం మాత్రం ఖరీదు
- అయినా సరే తీసుకోవడమే సురక్షితం
- అప్పటికే ఉన్న వ్యాధులకూ కవరేజీ
- కాకపోతే పరిమితులు ఎక్కువ
- కోపేమెంట్, రూమ్‌రెంట్ క్యాప్ గమనించాలి
- పాలసీ లేకపోతే ఆర్థికంగా బోలెడు భారం



- బిజినెస్‌లో

## ఇంటర్‌తోనే ఐటీ కొలువు!

- హెచ్‌సీఎల్ వినూత్న ప్రోగ్రాం 'టెక్ బీ'
- ఇంటర్ అర్హతతో ఏడాది శిక్షణ అనంతరం ఉద్యోగం
- శిక్షణలో చేరిన విద్యార్థులకు నెలకు రూ.10 వేల స్టైపెండ్
- శిక్షణ పూర్తయ్యాక రూ. 2.2 లక్షల వరకు వార్షిక వేతనం
- ఏడాది శిక్షణకు రూ.2 లక్షల ఫీజు, విద్యార్థులకు రుణ సౌకర్యం
- బిట్స్, శాస్త్ర నుంచి డిగ్రీలు పొందే అవకాశం

- భవితలో













ఆదివారం బెంగళూరులోని ఓ హోటల్‌లో పార్టీ ఎమ్మెల్యేలతో సిద్ధరామయ్య భేటీ

## సంకీర్ణానికి ఝలక్

- తొలుత రాజీనామా ఉపసంహరించుకుంటానని రెబెల్ ఎమ్మెల్యే నాగరాజ్ హామీ.. ముంబైలోని రెబెల్స్ క్యాంప్‌కు చేరుకోగానే రాజీనామా వెనక్కి తీసుకోనని స్పష్టీకరణ
- తిరుగుబాటు నేత రామలింగారెడ్డికి కాంగ్రెస్ నేతల బుజ్జగింపులు
- కుమారస్వామి నిజాయితీపరుడైతే రాజీనామా చేయాలి: యడ్యూరప్ప

- వివరాలు 4లో



## కేబినెట్ నుంచి సిద్ధూ నిష్క్రమణ

- పంజాబ్ మంత్రివర్గం నుంచి మాజీ క్రికెటర్ నవ్‌జ్యోత్ సింగ్ సిద్ధూ వైదొలిగారు. గత నెలలోనే ఆయన రాజీనామా చేసినా తాజాగా వెలుగులోకి వచ్చింది. సీఎం అమరీందర్ సింగ్‌తో విభేదాలు, కేబినెట్‌లో కీలక శాఖల నుంచి తప్పించిన నేపథ్యంలో జూన్‌లోనే రాజీనామా చేసినట్లు ఆదివారం ఆయన ట్విట్టర్‌లో ప్రకటించారు.

- 4లో






ఇదం జగత్



# 3 వేల వైద్య పోస్టుల భర్తీ

- తాత్కాలికంగా భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- డాక్టర్లు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది కొరతను అధిగమించేందుకే..
- ప్రతిపాదనలు పంపాలని ఉన్నతాధికారులకు మంత్రి ఈటల ఆదేశం




సాక్షి, హైదరాబాద్


ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీలను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సుమారు 3వేల వైద్యులు, నర్సులు, పారామెడికల్ సహా ఇతర పోస్టులను భర్తీ చేయాలని భావిస్తోంది. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అధికారులకు సూచించారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ ఉద్యోగుల కొరత విపరీతంగా ఉంది. నర్సుల సమస్య ఎక్కువగా ఉంది. సరిపడా నర్సులు లేకపోవడంతో, ఉన్న వారిపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. దీంతో నియామకాలు చేపట్టాలని ప్రభుత్వంపై అధికారులు, డాక్టర్ల సంఘాలు ఒత్తిడి తీసుకొస్తున్నాయి. 2017–18లో సుమారు 4వేల పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో స్టాఫ్‌నర్సు, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ సహా పలు పారామెడికల్ పోస్టులున్నాయి. ఈ నియామకాలపై హైకోర్టులో పిటిషన్లు దాఖలవడంతో భర్తీ ప్రక్రియ రెండేళ్ల నుంచి సాగుతూనే ఉంది. ఆ ప్రక్రియ పూర్తవుతుందా? రద్దవుతుందా? అన్న దానిపై ఇంతవరకు స్పష్టతలేదు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీలను తాత్కాలిక ఉద్యోగులతో నింపాలని ప్రభుత్వం నిర్ణయానికొచ్చింది. ఈ అంశంపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి ఈటల ఇటీవల సుదీర్ఘంగా చర్చించారు. ఖాళీల భర్తీ ఆవశ్యకతను అధికారులు మంత్రికి వివరించారు. కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీకి ఉన్న అడ్డంకులు, జీతాల భారం తదితర సమస్యలను పరిగణనలోకి తీసుకుని ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రతిపాదనలను ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నివేదించాక, అక్కడి నుంచి అనుమతి వచ్చాక భర్తీకి నోటిఫికేషన్ వేస్తారు.

# అల్లంత దూరాన.. అంతరిక్షంలో.. ఏం జరుగుతుందంటే..

చంద్రయాన్-2.. దీని గురించి ఇప్పటికే మనం చాలా కబుర్లు చెప్పుకున్నాం..
ఇప్పటివరకూ జరిగింది కూడా మనకు తెలుసు..
మరి ఈ రోజు తెల్లవారుజామున మన బాహుబలి రాకెట్ జీఎస్ఎల్వీ మార్క్-3
నిప్పులు చిమ్ముకుంటూ నింగికి దూసుకెళ్లాక ఏం జరగనుంది?
చాలా రోజుల ప్రయాణం అంటున్నారు.. ఏం జరుగుతుంది?
ఈసారి మాత్రం కబుర్లు చెప్పకోవద్దు.. గ్రాఫిక్స్ రూపంలో చూసేద్దాం..
ఎలా.. ఇదిగో ఇలా..

సాక్షి సెంట్రల్ డెస్క్






## చంద్రయాన్-2లో మనోడు..

- సిద్దిపేట ముద్దుబిడ్డకు అపూర్వ గౌరవం
- సామాన్య కుటుంబం నుంచి శాస్త్రవేత్తగా..
- 20 ఏళ్లుగా షార్‌లోని పలు విభాగాల్లో విధుల నిర్వహణ

**సిద్దిపేట జోన్/సిద్దిపేట రూరల్:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రయోగిస్తున్న చంద్రయాన్-2 ప్రాజెక్టులో సిద్దిపేట జిల్లా వాసి వీరబత్తిని సురేందర్ పాత్ర ఉండటం తెలంగాణకు గర్వకారణం. సురేందర్ గత 20 ఏళ్లుగా నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లో స్పేస్ వెహికిల్స్ రాడార్ కమ్యూనికేషన్, టెలి కమాండ్ సిస్టం, ఎలక్ట్రికల్ సిస్టంతో పాటు పలు విభాగాల్లో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సిద్దిపేటలోని చేనేత కుటుంబంలో జన్మించిన సురేందర్ కష్టాలను సహవాసంగా స్వీకరిస్తూ అంచెలంచెలుగా శాస్త్రవేత్తగా ఎదిగారు. తల్లిదండ్రులు వీరబత్తిని సత్తయ్య, రాజమణిలకు ఉన్న ముగ్గురు కుమారుల్లో రెండో వాడు సురేందర్. తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు, తల్లి రాజమణి బీడీ కార్మికురాలిగా పనిచేస్తూ కుమారులను ప్రయోజకులుగా చేశారు. సురేందర్ విద్యార్థి దశ నుంచే గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో ఆసక్తి ఎక్కువగా ఉండేది. ఆయన విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే కొనసాగింది. 10వ తరగతి అనంతరం నిజామాబాద్ పాలిటెక్నిక్ కళాశాలలో చదివారు. తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ పూర్తి చేసి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ (రాంచీ)లో మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. శాస్త్రవేత్తగా ఎదగాలన్న ఆశయంతో కొత్తగూడెం ఏపీ జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా, పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్ ఉద్యోగాన్ని వదులుకున్నారు.

**20 ఏళ్ళుగా...**

ఈసీఐఎస్‌లో పనిచేస్తున్న క్రమంలోనే సురేందర్‌కు శ్రీహరికోట స్పేస్ సెంటర్‌లో ఉద్యోగం వచ్చింది. 2000లో షార్‌లో చేరిన సురేందర్ అంతరిక్షంలో ఉపగ్రహాలను పంపే ప్రతి ప్రక్రియలో భాగస్వాముడిగా మారారు. పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ లాంటి ప్రయోగాల్లో కూడా తనవంతు పాత్ర నిర్వర్తించారు.

**చాలా ఆనందంగా ఉంది..**

'నా బిడ్డ సురేందర్ మొండివాడు.. ఏదైనా సాధించాలి అనుకుంటే దాన్ని కచ్చితంగా చేస్తాడు. ఆర్థిక ఇబ్బందుల వల్ల చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాం. కష్టపడి చదువుకునే మనస్తత్వం కలిగిన నా కొడుకు గురించి ఇప్పుడు పేపర్లో, టీవీల్లో వస్తుంటే చాలా ఆనందంగా ఉంది. తల్లిదండ్రులుగా మాకు ఇంతకంటే ఏమి కావాలి. దేశం కోసం సేవ చేస్తున్న కుమారుడుని చూస్తే కడుపు నిండుతోంది'అంటూ సురేందర్ తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

# హలో హలో చందమామ

## నిర్విఘ్నంగా కొనసాగుతున్న కౌంట్‌డౌన్

**శ్రీహరికోట (సూళ్లూరుపేట):** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన చంద్రయాన్-2 ప్రయోగానికి సంబంధించి కడపటి వార్తలు అందేసరికి(అర్ధరాత్రి ఒంటిగంట) కౌంట్‌డౌన్ నిర్విఘ్నంగా కొనసాగుతోంది. సోమవారం వేకువజామున 2.51 గంటలకు సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ మార్క్3-ఎం1 రాకెట్‌ను ప్రయోగించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పదేళ్లపాటు ఇస్రో శాస్త్రవేత్తలు శ్రమించి రూపొందించిన 3,850 కిలోల చంద్రయాన్-2 ప్రయోగానికి సంబంధించి ఆదివారం ఉదయం 6.51 గంటలకు 20 గంటల కౌంట్‌డౌన్ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించారు. గ్రహాంతర ప్రయోగాల్లో భారత్‌కు ఇది మూడోది. చంద్రునిపై పరిశోధనలు చేయడానికి చేస్తున్న రెండో ప్రయోగం ఇది. షార్ నుంచి 75వ ప్రయోగం కావడం కూడా విశేషం. ఇది చరిత్రలో అతిపెద్ద మైలురాయిగా నిలిచిపోనుంది. ఇంత పెద్ద రాకెట్‌ను, ఇంత పెద్ద ఉపగ్రహాన్ని ప్రయోగించడం ఇస్రో చరిత్రలో రికార్డుగా చెబుతున్నారు. 20 గంటల కౌంట్‌డౌన్ సమయంలో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాకెట్‌కు రెండో దశలో 110 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపే ప్రక్రియను పూర్తిచేశారు. ద్రవ ఇంధనం నింపిన అనంతరం రాకెట్‌కు పలు పరీక్షలు నిర్వహించారు. ప్రయోగానికి అతికొద్ది సమయమే ఉండటంతో రాకెట్‌లో హీలియం గ్యాస్ నింపడం, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వ్యవస్థలను అప్రమత్తం చేస్తున్నారు. ఈ ప్రయోగం కోసం ప్రపంచ దేశాలన్నీ ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.

**భారత్ త్రీ-ఇన్-వన్ ప్రయోగం ఇలా..**

చంద్రయాన్-2 ప్రాజెక్టును ఇస్రో శాస్త్రవేత్తలు త్రీ ఇన్ వన్ ప్రయోగంగా పిలుస్తున్నారు. ఈ మిషన్‌లో ఆర్బిటర్, ల్యాండర్ (విక్రమ్), రోవర్‌లను ఒకటిగా అమర్చి పంపుతున్న ప్రయోగం కాబట్టి దీన్ని త్రీ ఇన్ వన్ ప్రయోగమని సంబోధిస్తున్నారు. జీఎస్ఎల్వీ మార్క్3-ఎం1 ద్వారా ప్రయోగించే చంద్రయాన్-2 కాంపోజిట్ మాడ్యూల్స్‌లో ఆర్బిటర్, ల్యాండర్, రోవర్‌లు వుంటాయి. అయితే వీటిలో ఆర్బిటర్ చంద్రుని కక్ష్యలో పరిభ్రమిస్తూ అక్కడి నుంచి సమాచారాన్ని చేరవేస్తుంది. ల్యాండర్ చంద్రుని ఉపరితలంపై దిగుతుంది. దీని నుంచి రోవర్ బయటకు వచ్చి చంద్రుడి ఉపరితలంపై పరిశోధనలు చేస్తుంది. ఈ మూడు ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉంటాయి.




ఇదిగో ఇదే చంద్రునిపై దక్షిణ ధ్రువ ప్రాంతంలో ఇస్రో ల్యాండర్ దిగే ప్రదేశం. మిగిలినవి గతంలో అమెరికా, రష్యా ల్యాండర్లు దిగిన ప్రదేశాలు..

**60 ఏళ్లుగా చంద్రుడిపై పరిశోధనలు..**

చంద్రుడి గురించి తెలుసుకోవడానికి గత 60 ఏళ్ల నుంచి పరిశోధనలు జరుగుతూనే వున్నాయి. ప్రపంచంలో అంతరిక్ష ప్రయోగాలు చేసే దేశాలు ఇప్పటివరకు 125 ప్రయోగాలు చంద్రుడిపైనే చేశాయని ఐక్యరాజ్య సమితి వెల్లడిస్తోంది.

- 1958 నుంచి అమెరికా చంద్రుడిపై పరిశోధనలను ప్రారంభించింది. 12 ప్రయోగాలు చేసిన తరువాత 13వ ప్రయోగంలో చంద్రుని కక్ష్యలోకి చేరుకుంది. అలా ఇప్పటి దాకా 58 ప్రయోగాలు చేసి 41 ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించింది. 1969లో అపోలో రాకెట్ ద్వారా నీల్ ఆమ్‌స్ట్రాంగ్, ఎడ్విన్ ఆల్డ్రిన్, మైఖేల్ పోలీన్స్ అనే వ్యోమగాములను చంద్రుడిపైకి పంపించిన ఘనత అమెరికా పేరు మీదే వుంది.
- రష్యా కూడా 1958 నుంచి 53 ప్రయోగాలు చంద్రునిపైకి చేసింది. అందులో 35 మాత్రమే విజయవంతమయ్యాయి.
- జపాన్ అయితే 1990 నుంచి ఆరు ప్రయోగాలు సొంతంగా, ఒక ప్రయోగం నాసాతో కలసి చేసింది. ఇందులో ఐదు ప్రయోగాలు విజయవంతమయ్యాయి.
- 2010 నుంచి చైనా కూడా ఏడు ప్రయోగాలు చేయగా ఒక్క ప్రయోగం ద్వారా మాత్రమే చంద్రుని దాకా వెళ్లగలిగింది.
- ఇజ్రాయెల్ ఈ ఏడాది ఫిబ్రవరిలో చంద్రునిపైకి ల్యాండర్‌ను పంపించినా అది విజయవంతం కాలేదు.
- జర్మనీ 2003లో చంద్రుని మీదకు ఆర్బిటర్‌ను విజయవంతంగా పంపించింది.
- భారత్ 2008లో చంద్రుడి మీదకు ఆర్బిటర్‌ను ప్రయోగించి విజయం సాధించడమే కాకుండా చంద్రుడిపై నీటి జాడలున్నాయని కనుగొంది.

## 'షార్' చేరుకున్న రాష్ట్రపతి

రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ చంద్రయాన్-2 ప్రయోగాన్ని వీక్షించేందుకు రేణిగుంట నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆదివారం సాయంత్రం 4.53 గంటలకు 'షార్' కేంద్రానికి చేరుకున్నారు. షార్‌లోని హెలీప్యాడ్ వద్ద ఇస్రో చైర్మన్ డాక్టర్ కె. శివన్, షార్ డైరెక్టర్ ఎ. రాజరాజన్, జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు, ఎస్పీ ఐశ్వర్య రస్తోగి తదితరులు రాష్ట్రపతికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాత్రి 7 గంటలకు చంద్రయాన్-2 ప్రయోగానికి సంబంధించిన రెండో ప్రయోగ వేదిక వద్దకు చేరుకొని జీఎస్ఎల్వీ మార్క్3-ఎం1 రాకెట్‌ను సందర్శించారు. ఆ తరువాత షార్‌లో సుమారు రూ. 650 కోట్లతో నిర్మించిన రెండో వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌ను లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. రాష్ట్రపతి రాత్రి 12 గంటలకు మిషన్ కంట్రోల్ సెంటర్‌కు చేరుకొని ప్రయోగాన్ని వీక్షించారు.

## బెజవాడ దుర్గమ్మకు బోనం

**ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ):** హైదరాబాద్‌లోని భాగ్యనగర్ శ్రీ మహంకాళీ జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు బోనాలను సమర్పించారు. ప్రతి ఏటా ఆషాడ మాసంలో తెలంగాణ నుంచి అమ్మవారికి బోనాలను సమర్పించడం ఆనవాయితీగా జరుగుతుంది. ఆదివారం ఉదయం బ్రాహ్మణ వీధిలోని దేవస్థాన పరిపాలనా భవనంలోని జమ్మిచెట్టు వద్ద అమ్మవారికి, బోనాలకు దేవాదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ఆలయ ఈవో వి.కోటేశ్వరమ్మ, బోనాల కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బ్రాహ్మణ వీధి, రథం సెంటర్, ఘాట్‌రోడ్డు మీదగా ఊరేగింపు ఆలయ ప్రాంగణానికి చేరుకుంది. బోనాలకు ఈవో సాదరంగా స్వాగతం పలికారు. బోనాలను సమర్పించేందుకు హైదరాబాద్ నుంచి విచ్చేసిన సుమారు వెయ్యి మంది కళాకారులు, బోనాల కమిటీ సభ్యులు నిర్వహించిన ఊరేగింపు ఎంతో అకట్టుకుంది.



బంగారు బోనం ఊరేగింపును ప్రారంభించిన ఏపీ దేవాదాయ శాఖ మంత్రి వెలంపల్లి

## నేపాల్ వరదలు; 59కి చేరిన మృతులు

**కఠ్మాండు:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నేపాల్ అతలాకుతలం అవుతోంది. వర్షాల ధాటికి మృతి చెందుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. వరదలు, కొండ చరియలు విరిగి పడటం వంటి ఘటనల్లో ఇప్పటి వరకు 59 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 38 మంది గాయపడ్డారు. దేశవ్యాప్తంగా మధ్య, తూర్పు ప్రాంతాల్లో కురిసిన వర్షం ధాటికి 35 మంది గల్లంతైనట్లు సమాచారం. నేపాల్ ఆర్మీ, పోలీసు సిబ్బంది ఇప్పటి వరకు దేశంలోని పలు చోట్ల నుంచి 1,104 మందిని రక్షించగా, అందులో ఒక్క కఠ్మాండు నుంచే 185 మంది ఉన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి

తిరుమల

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆదివారం తిరుమలలో శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సతీమణి సవితా కోవింద్, కుమార్తె స్వాతి, కుటుంబ సభ్యులతో కలసి విశ్రాంతి భవనం నుంచి కోవింద్ ఉదయం 6 గంటలకు ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం శ్రీవారి పుష్కరిణిని దర్శించారు. క్షేత్ర సంప్రదాయం ప్రకారం భూ వరాహస్వామివారిని దర్శించుకున్న అనంతరం మహద్వారం వద్ద టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల ప్రత్యేకాధికారి ధర్మారెడ్డి, అర్చకులతో కలసి రాష్ట్రపతికి ఇస్తికఫాల్ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి ఆలయంలోకి ప్రవేశించిన రాష్ట్రపతి తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. అనంతరం సన్నిధిలో పచ్చ కర్పూరపు వెలుగులో శ్రీవేంకటేశ్వర స్వామివారి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకున్నారు. స్వామివారి పాదాల వద్ద ఉంచిన పట్టుశేషవస్త్రాన్ని ఆలయ ప్రధాన అర్చకులు రాష్ట్రపతికి బహూకరించారు. తర్వాత వకుళ మాతను దర్శించుకుని, హుండీలో కానుకలు సమర్పించారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు రాష్ట్రపతికి ఆశీర్వాదం చేయగా, టీటీడీ చైర్మన్, ఈవో, ప్రత్యేకాధికారి.. శ్రీవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు ఆయనకు అందజేశారు. రాష్ట్రపతితో పాటు గవర్నర్ నరసింహన్ దంపతులు కూడా శ్రీవారిని దర్శించుకుని, ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ విశిష్టత గురించి రాష్ట్రపతికి ఈవో వివరించారు. టీటీడీ భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలతో పాటు వేదిక్ యూనివర్సిటీ ప్రత్యేకతల గురించి కూడా తెలియజేశారు. శ్రీవారి దర్శనం తర్వాత కుటుంబ సభ్యులతో కలసి ఉదయం 7.25 గంటలకు రాష్ట్రపతి అతిథిగృహానికి చేరుకుని అల్పాహారం స్వీకరించారు. అన్నప్రసాద విభాగం వంటకాలు వడ్డించారు. అతిథి మర్యాదలపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ టీటీడీ చైర్మన్, ఈవో, ప్రత్యేక అధికారిని అభినందించారు. రాష్ట్రపతితో పాటు ఎంపీ విజయసాయిరెడ్డి, ఏపీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, టీటీడీ సీవీఎస్ఓ గోపీనాథ్‌జెట్టి ఉన్నారు.

**కుటుంబ సభ్యులతో కలసి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న కోవింద్**

**ఇస్తికఫాల్ మర్యాదలతో స్వాగతం పలికిన టీటీడీ చైర్మన్, అధికారులు, అర్చకులు**

**రాష్ట్రపతి వెంట స్వామిని దర్శించుకున్న గవర్నర్ నరసింహన్ దంపతులు**



రాష్ట్రపతి కోవింద్ దంపతులకు శ్రీవారి చిత్రపటం అందిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు, ఈఓ అనిల్ సింఘాల్, ప్రత్యేకాధికారి ధర్మారెడ్డి

## శ్రీవారి దర్శన పద్ధతుల్లో ప్రక్షాళన

### టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

**తిరుపతి రూరల్:** శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు సత్వర దర్శనం కల్పించేందుకు ప్రస్తుతం ఉన్న దర్శన పద్ధతులను ప్రక్షాళన చేయనున్నట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. కొందరు అధికారుల స్వార్థ ప్రయోజనాల కోసం 2012లో ఎల్1,ఎల్2, ఎల్3 దర్శనాలను ప్రవేశ పెట్టారన్నారు. దీనివల్ల స్వామి వారి దర్శనం కోసం సామాన్య భక్తులు క్యూలైన్‌లోనే 16 నుంచి 20 గంటల వరకు వేచి ఉండాల్సి వచ్చిందన్నారు. ఎల్1,ఎల్2,ఎల్3 దర్శనాలను రద్దు చేస్తామని దీనివల్ల సామాన్యభక్తులు కేవలం 5,6 గంటల్లోనే స్వామి వారి దర్శనం చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు.

**సిఫారసు లేఖలకు సెలవు**

తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల రద్దీ కొనసాగుతుండడంతో ఆగస్టు 18వ తేదీ వరకు శుక్ర, శని, ఆదివారాల్లో బ్రేక్ దర్శనాలు ప్రొటోకాల్ ప్రముఖులకు మాత్రమే పరిమితమని, సిఫారసు లేఖలు స్వీకరించేది లేదని టీటీడీ తెలిపింది. గతేడాది తరహాలోనే ఏప్రిల్ 15 నుంచి జూలై 15వ తేదీ వరకు శుక్ర, శని, ఆదివారాల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను ప్రొటోకాల్ ప్రముఖులకు మాత్రమే పరిమితం చేసిన విషయం విదితమే.

# అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో 37.76% పాస్

- వెబ్‌సైట్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాలు
- నేటి నుంచి ఆన్‌లైన్ ద్వారా మెమోల జారీ
- ఫలితాలు విడుదల చేసిన ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి అశోక్
- ఐఐటీల్లో సీట్లు పొందిన విద్యార్థులు నష్టపోకుండా చర్యలు
- వారం రోజుల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫలితాలు
- సమస్యలుంటే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులకు అవకాశం
- జిల్లా కార్యాలయాల్లోనూ వినతుల స్వీకరణ, 24 గంటల్లో పరిష్కారం

**సాక్షి, హైదరాబాద్:** ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ద్వితీయ సంవత్సర ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్ ఆదివారం తమ కార్యాలయంలో విడుదల చేశారు. గత నెల 7 నుంచి 14వ తేదీ వరకు జరిగిన ఈ పరీక్షలకు 1,60,487 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు హాజరుకాగా, అందులో 60,600 మంది (37.76%) ఉత్తీర్ణులయ్యారు. జనరల్ విద్యార్థులు 1,52,359 మంది పరీక్షలకు హాజరు కాగా అందులో 56,431 మంది, వొకేషనల్‌లో 8,128 మంది హా జరు కాగా 4,169 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలికలు 61,264 మంది పరీక్షలకు హాజరు కాగా 24,979 మంది (41%) పాసవ్వగా, 91,095 మంది బాలురు పరీక్షలకు హాజరు కాగా 31,452 మంది (35%) ఉత్తీర్ణులయ్యారు.

### పొరపాట్లకు ఎక్కడికక్కడే పరిష్కారం

విద్యార్థులు తమ ఫలితాల్లో ఏమైనా పొరపాట్లు ఉంటే ఎక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు చేపట్టినట్లు బోర్డు కార్యదర్శి అశోక్ వివరించారు. జిల్లా ఇంటర్ విద్యా శాఖాధికారి కార్యాలయాల్లో సంప్రదించి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అలాగే 040–24600110 ఫోన్ నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేస్తే 24 గంటల్లో పరిష్కరించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే ఆన్‌లైన్‌లోనూ విద్యార్థులు తమ విజ్ఞప్తులను నమోదు చేసేలా ఆన్‌లైన్ లింకును (**bie.telangana.gov.in/TSBIEExams/results/Home. html**) తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఇక ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ఫలితాలను మరో వారం రోజుల్లో వెల్లడిస్తామని అశోక్ తెలిపారు.



ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ ఫలితాలను విడుదల చేస్తోన్న బోర్డు కార్యదర్శి అశోక్ కుమార్. చిత్రంలో ఖలీఖ్, సుశీల్, భీమ్‌సింగ్

### మూడు సంస్థలతో పరిశీలన

ఇంటర్మీడియట్ వార్షిక ఫలితాల్లో పొరపాట్లు దొర్లిన నేపథ్యంలో నిపుణుల కమిటీ సిఫారసుల మేరకు ప్రాసెస్ చేసిన సంస్థలతోపాటు మరో మూడు సంస్థలతో పరిశీలన జరిపించినట్లు అశోక్ వెల్లడించారు. గ్లోబరీనా సంస్థ ప్రాసెస్ చేసిన ఫలితాలను డా టాటెక్, జేఎన్‌టీయూ, మ్యాగ్నటిక్ సంస్థలతో పరిశీలన చేయించామని వివరించారు. సున్నా మార్కులు వచ్చిన విద్యార్థులకు ఒకటికి రెండుసార్లు పరిశీలన జరిపించామని, ఎక్కడా పొరపాట్లు దొర్లకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలను తీసుకొని ఫలితాలను వెల్లడించినట్లు తెలిపారు.

### ఆన్‌లైన్‌లో మెమోలు

ఐఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాయింట్ సీట్ అలోకేషన్ అథారిటీ (జోసా) కౌన్సెలింగ్‌లో భాగంగా సీట్లు పొందిన విద్యార్థులు కాలేజీల్లో చేరేందుకు ఇబ్బందులు లేకుండా ఆదివారమే ఈ ఫలితాలను వెల్లడించామని అశోక్ పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా తమ మెమోలను డౌన్‌లోడ్ చేసుకొని ప్రవేశాలు పొందవచ్చని సూచించారు. వెబ్‌సైట్‌లో ఫలితాలను ఆదివారమే అందుబాటులో ఉంచినప్పటికీ లాంగ్ మెమోలను పీడీఎఫ్ రూపంలో విద్యార్థుల కోసం అందుబాటులో ఉంచామని, వాటిని అనుమతించాలని జోసాకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసిందని వివరించారు.

| ద్వితీయ సంవత్సరం జనరల్‌లో గ్రేడ్‌ల వారీగా ఉత్తీర్ణులు | |
|---|---|
| ఏ గ్రేడ్‌లో | 32 |
| బీ గ్రేడ్‌లో | 71 |
| సీ గ్రేడ్‌లో | 60 |
| డీ గ్రేడ్‌లో | 54 |
| కంపార్ట్‌మెంట్‌లో | 56,214 |
| మొత్తం | 56,431 |

### రేపటి నుంచి రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తులు

విద్యార్థులు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్, జవాబు పత్రాలకోసం ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ( http://tsbie. cgg. gov. in) లాగిన్ అయి దరఖాస్తు చేసుకునేలా బోర్డు చర్యలు చేపట్టింది. రీకౌంటింగ్ కోసం ఒక్కో పేపరుకు రూ.100 చెల్లించాలని, రీవెరిఫికేషన్ కోసం ఒక్కో పేపరుకు రూ.600 చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించింది. ఈనెల 20 తరువాత చేసుకునే దరఖాస్తులను స్వీకరించబోమని స్పష్టం చేసింది.

## 21న పోలింగ్ కేంద్రాల తుది జాబితా

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా 129 మున్సిపాలిటీలు, నిజామాబాద్, కరీంనగర్, రామగుండం కార్పొరేషన్లలో వార్డుల వారీగా పోలింగ్ స్టేషన్లు సిద్ధం చేయడంతో వీటికి సంబంధించిన తుది జాబితా ప్రచురణ తేదీని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్‌ఈసీ) మరోసారి సవరించింది. 16వ తేదీన వార్డుల వారీగా ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా రూపొందించి, 21వ తేదీన తుది జాబితాను ప్రకటించాలని ఆదివారం ఎస్‌ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపాలిటీలకు సంబంధించి 16వ తేదీన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా తయారీ, 17న ముసాయిదా జాబితా ప్రచురణ, అదేరోజు సాయంత్రం 3 గంటలకు మున్సిపాలిటీల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. 19న సాయంత్రం 5 వరకు అభ్యంతరాలు, సలహాల స్వీకరణ, అదేరోజు వాటి పరిష్కారం, 19వ తేదీన పోలింగ్ స్టేషన్ల తుది జాబితా జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు సమర్పిస్తారు. 21న తుది జాబితానుప్రచురిస్తారు. ఇక మూడు మున్సిపల్ కార్పొరేషన్ల విషయానికొస్తే.. 16న ముసాయిదా పోలింగ్ కేంద్రాల తయారీ, 17న ముసాయిదా జాబితా ప్రచురణ, అదేరోజు సాయంత్రం 3 గంటలకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. 19న సాయంత్రం 5 వరకు అభ్యంతరాలు, సలహాలు స్వీకరిస్తారు. 20న వాటి పరిష్కారం, అదేరోజు పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు సమర్పిస్తారు. 21న తుది జాబితాను ప్రచురిస్తారు.

### 16న వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితా

రాష్ట్రంలోని 129 మున్సిపాలిటీలు, 3 మున్సిపల్ కార్పొరేషన్ల (నిజామాబాద్, కరీంనగర్, రామగుండం)లో వార్డుల వారీగా ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితా ప్రచురణ తేదీని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్‌ఈసీ) ఈ నెల 16కు పొడిగించింది. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14న ప్రచురించాల్సి ఉండగా, కొన్ని చోట్ల తప్పులు దొర్లడంతో కొన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు చేసిన విజ్ఞప్తి మేరకు పొడిగించినట్టు ఎస్‌ఈసీ తెలిపింది.

## సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

- బీజేపీ సభ్యత్వ నమోదు ప్రముఖ్ శివరాజ్‌సింగ్ చౌహాన్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ జాతీయ సభ్యత్వ నమోదు ప్రముఖ్, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రాష్ట్ర నేతలకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వెళ్తున్న ఆయన ఆదివారం హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో రాష్ట్ర నేతలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని, ప్రతి ఐదు పోలింగ్ బూత్‌లకు ఒక శక్తి కేంద్రం ఏర్పాటు చేసి ఒక విస్తరాక్‌ను నియమించాలని సూచించారు. ఆయా శక్తి కేంద్రాల పరిధిలో వారంతా వారం రోజుల పాటు ఉండి నూతన సభ్యత్వాన్ని చేపట్టాలని స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న పార్టీ నూతన సభ్యత్వం పురోగతిపై రాష్ట్ర బీజేపీ నేతలతో చర్చించారు. శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో భేటీ అయిన వారిలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చింతా సాంబమూర్తి, జి.ప్రేమేందర్ రెడ్డి, డాక్టర్ జి.మనోహర్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ సభ్యత్వ ప్రముఖ్ ఎం.ధర్మా రావు ఉన్నారు.

# కృష్ణా బే'సీన్' మారుతోంది..!

- ఆల్మట్టి ప్రాజెక్టుకు 1.14 లక్షల క్యూసెక్కుల వరద
- నారాయణపూర్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో...కాల్వలకు నీటి విడుదల

**సాక్షి, హైదరాబాద్:** ఎగువన వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. బొట్టుబొట్టు క్యూ కట్టి క్యూసెక్కులై పారుతోంది. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. కృష్ణా బేసిన్ పరవశిస్తోంది. వరద ఉధృతంగా వస్తోంది. ప్రాజెక్టుల నిల్వలు పెరుగుతున్నాయి. దీంతో కృష్ణా బే'సిన్'మారుతోంది. కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలోని ప్రాజెక్టులు జలకళ సంతరించుకుంటున్నాయి. తెలంగాణలోని జూరాల ఆల్మట్టి ప్రాజెక్టు పూర్తిస్థాయి జలకళను సంతరించుకుంటోంది. నాలుగైదు రోజులుగా లక్ష క్యూసెక్కులకు మించి ఆల్మట్టికి ప్రవాహాలు వస్తున్నాయి. శనివారం 1.10 లక్షల వరకు ఉన్న వరద ఆదివారం 1.14 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో ఆల్మట్టి నీటి నిల్వ సామర్థ్యం 129.72 టీఎంసీలకుగానూ ఆదివారం ఉదయం ఎనిమిదింటికి 92 టీఎంసీలకు చేరింది. రాత్రి 100 టీఎంసీలకు పెరిగింది. మరో 29 టీఎంసీల మేర నీరు వస్తే ఆల్మట్టి పూర్తిస్థాయిలో నిండుతుంది. గత ఏడాది ఇదే సమయానికి ఆల్మట్టిలో నీటినిల్వ 83.78 టీఎంసీలే. గత ఏడాది కంటే ప్రస్తుతం 17 టీఎంసీల నిల్వ ఎక్కువగా ఉంది. దీంతోపాటు ఎగువ నుంచి వరద కూడా ఆశాజనకంగా ఉండటం దిగువ ప్రాజెక్టుల్లో ఆశలు రేపుతోంది. ఇక ప్రవాహాలను దృష్టిలో పెట్టుకొని కర్ణాటక విద్యుదుత్పాదన మోతాదును కూడా పెంచింది. కరెంటు ఉత్పత్తి కారణంగా 28,125 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతుండటంతో నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరుగుతోంది. ప్రస్తుతం ఆ జలాశయానికి 25,909 క్యూసెక్కుల వరద వస్తుండగా, అధికారులు కాల్వల ద్వారా 1,732 క్యూసెక్కులను కిందికి వదులుతున్నారు. నారాయణపూర్ పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 37.64 టీఎంసీలుకాగా ప్రస్తుతం 23 టీఎంసీల మేర నిల్వ ఉంది. ఇంకా సుమారు 43 టీఎంసీలైతే ఆల్మట్టి, నారాయణపూర్ రెండూ నిండుతాయి. ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో దృష్ట్యా ఇందుకు ఐదారు రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. ఆల్మట్టికి ఇదే రీతిన వరద కొనసాగితే దిగువన జూరాల ప్రాజెక్టుకు నీరు వచ్చేందుకు వారం, పదిరోజులు పట్టే అవకాశముంది. ఒకవేళ ఇన్‌ఫ్లో మరింత పెరిగితే ఆ లోగానే కృష్ణా జలాలు జూరాలకు చేరే అవకాశం ఉంది. మరోవైపు తుంగభద్రకు ఇన్‌ఫ్లో స్థిరంగా కొనసాగుతోంది. ప్రాజెక్టుకు 20,061 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు నిల్వసామర్థ్యం 100 టీఎంసీలకుగానూ ప్రస్తుతం నీటినిల్వ 13 టీఎంసీలకు చేరింది.

# ప్రతి కాలేజీలోనూ ఏదో ఒక లోపం

- ప్రైవేటు జూనియర్ కాలేజీలపై ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్
- లైబ్రేరియన్, పీడీలు లేకపోయినా మినహాయింపుతో అఫిలియేషన్
- 2,656 కాలేజీల్లో 1,239 కాలేజీలకు గుర్తింపు ఇచ్చాం
- సున్నా మార్కులు వచ్చిన విద్యార్థుల స్క్రిప్టులను ప్రాసెస్ చేశాం



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రైవేటు జూనియర్ కాలేజీలు అన్నింటిలో లోపాలు ఉన్నాయని, ప్రతి కాలేజీలో ఏదో ఒక లోపం ఉందని ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి అశోక్ తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ (పీడీ), లైబ్రేరియన్ వంటి పోస్టుల్లో అధ్యాపకులు లేకపోయినా తాము షరతులతో అనుబంధ గుర్తింపు ఇస్తున్నట్లు వెల్లడించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల అనంతరం తనను కలిసిన మీడియాతో ఆయన చిట్‌చాట్‌గా మాట్లాడారు. రాష్ట్రంలో ఒక్క ప్రైవేట్ కాలేజీ కూడా పర్‌ఫెక్ట్‌గా లేదన్నారు. ప్రతి కాలేజీలో ఏదో ఒక లోపం ఉందన్నారు. శానిటేషన్ సర్టిఫికెట్లు, ఫైర్ సేఫ్టీ, హైజీన్ సర్టిఫికెట్లు, ఆర్ అండ్ డీ వంటివి లేవని తెలిపారు. కాలేజీల్లో 100 శాతం సిబ్బంది లేరన్నారు. 15 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు కలిగిన భవనాలు ఉన్న విద్యా సంస్థలు 63 ఉన్నాయని తెలిపారు. వాటికి ఫైర్ ఎన్వోసీ తీసుకురావాల్సిందేనని పేర్కొన్నారు. ఇప్పటివరకు తాము 1,239 కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇచ్చామని చెప్పారు. మూడు నెలల్లో లోపాలు సవరించుకుంటామని కొన్ని ప్రైవేటు కాలేజీలు రాతపూర్వకంగా అందజేశాయని, అలాంటి 348 కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇచ్చామని వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో 2,656 కాలేజీలు ఉంటే అందులో 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, 553 కోఆపరేటివ్ కాలేజీలు ఉన్నాయన్నారు. మరో 40 కాలేజీలు షెడ్లలో ఉన్నాయని, నిబంధనలు పాటించిన కాలేజీలకే గుర్తింపు ఇస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ కాలేజీల్లో ఆరింటికి తప్ప మిగతా అన్నింటికీ పక్కా భవనాలు ఉన్నాయన్నారు. సీసీ టీవీలు, ఆర్వో ప్లాంట్లు ఉన్నాయన్నారు. ఈసారి ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర ఆన్‌లైన్ ప్రవేశాలను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రాసెస్ చేస్తోందన్నారు. అనుబంధ గుర్తింపు ప్రక్రియను మాత్రం గ్లోబరీనా ప్రాసెస్ చేస్తోందన్నారు. ఈసారి ఫలితాల్లో ఎంత మందికి జీరో వస్తే అంత మంది విద్యార్థుల స్క్రిప్టులను ప్రాసెస్ చేశామని చెప్పారు. విద్యార్థులు తమ సమస్యలను మెయిల్ ద్వారా తెలియజేస్తే 24 గంటల్లో సమాధానం ఇచ్చేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

### 2.4 లక్షల స్క్రిప్టులే డౌన్‌లోడ్..

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేరిన విద్యార్థుల ఆన్‌లైన్ ప్రాసెస్ ప్రారంభమైందని, 76,752 మందికి ప్రవేశాలు ఆన్‌లైన్ చేశామని అశోక్ తెలిపారు. ప్రవేశాలకు జూలై 31 చివరి తేదీ అని, అయితే ఇటీవల పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలు విడుదల అయినందున మరికొన్ని రోజులు గడువు పెంచుతామని చెప్పా రు. ప్రైవేటు కాలేజీల్లో చేరిన విద్యార్థుల సమాచారం ఆన్‌లైన్ చేసేందుకు త్వరలోనే కాలేజీలకు లాగిన్ ఇస్తామని వెల్లడించారు. వార్షిక పరీక్షల సమయంలో ఫెయిలైన 3.28 లక్షల మందికి చెందిన 9.02 లక్షల జవాబు పత్రాలను స్కాన్ చేసి అందుబాటులో ఉంచామన్నా రు. అయితే అందులో 2.4 లక్షల స్క్రిప్టులను మాత్రమే విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకున్నారని పేర్కొన్నారు. అందులో పాసైనా తక్కువ మార్కులు వచ్చాయని రీవెరిఫికేషన్, రీకౌంటింగ్ కోసం 70 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

## క్షణికావేశంలో మహిళ ఆత్మహత్య

- రెండేళ్ల పాపతో సహా అపార్ట్‌మెంట్ నుంచి దూకిన వివాహిత
- తల్లి దుర్మరణం, గాయాలతో బతికిబయటపడ్డ చిన్నారి



**హైదరాబాద్:** ఆర్థిక ఇబ్బందుల కారణంగా దపంతుల మధ్య చోటుచేసుకున్న గొడవతో మనస్తాపం చెందిన గృహిణి తన బిడ్డతో సహా ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనలో తల్లి అక్కడికక్కడే మరణించగా, చిన్నారి మాత్రం స్వల్పగాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. సిరిసిల్ల జిల్లాకు చెందిన రామ్మూర్తి, పద్మజ (33) దంపతులు కూకట్‌పల్లి బాలాజీనగర్‌లోని అమృత నిలయంలో నివాసముంటున్నారు. పదమూడేళ్ల క్రితం నగరానికి వచ్చారు. వీరిద్దరూ శుభకార్యాలు, పార్టీలు, వేడుకలకు ఈవెంట్ మేనేజ్‌మెంట్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ దంపతులకు రెండేళ్ల కూతురు అక్షర. అయితే వీరి కాపురంలోకి అనుకోకుండా వచ్చిన ఆర్థిక ఇబ్బందులు మానసిక ప్రశాంతత లేకుండా చేశాయి. ఇటీవలే శ్రీలంక పర్యటనకు వెళ్లి వచ్చినా వీరికి అప్పుల గురించి చర్చకు వచ్చినప్పుడల్లా చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకునేది. ఈ విధంగానే శనివారం రాత్రి భార్యా భర్తల మధ్య వివాదం జరగడంతో క్షణికావేశంలో పద్మజ తన కూతురుతో సహా నాలుగో అంతస్తు నుంచి కిందకు దూకింది. ఈ ఘటనలో పద్మజ అక్కడికక్కడే మృతి చెందింది. అక్షరకు స్వల్పగాయాలవడంతో సమీప ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ్నుంచి పాపను మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్షర క్షేమంగానే ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

# నిధుల సమీకరణపై దృష్టి!

- ఎన్నికల హామీలతో ఖజానాపై పెరిగిన భారం
- రాష్ట్ర ఆదాయానికి అదనంగా మరో 40వేల కోట్లు అవసరం
- నిధుల సమీకరణ మార్గాలను అన్వేషిస్తున్న సర్కారు
- ఆర్థిక సలహాదారు జీఆర్ రెడ్డికి బాధ్యతల అప్పగింత



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ఆర్థిక అవసరాలు భారీగా పెరిగిపోయిన నేపథ్యంలో.. అవసరమైన నిధుల సమీకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2019–20లోని తదుపరి 3 త్రైమాసికాలకు అవసరమైన నిధులను సమీకరించేందుకు అందుబాటులో ఉన్న మార్గాలను అన్వేషిస్తోంది. వివిధ ఆదాయ మార్గాల ద్వారా రానున్న నెలల్లో రాష్ట్రానికి వచ్చే నిధులను అత్యంత జాగ్రత్తగా వినియోగించుకోవడంతోపాటుగా పెరిగిన ఆర్థిక అవసరాలను తీర్చుకోవడానికి అవసరమైన నిధులను బయటి ఆర్థిక సంస్థల నుంచి రాబట్టేందుకు ఉన్న అవకాశాలను ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాల సలహాదారు, రిటైర్డు ఐఏఎస్ జీఆర్ రెడ్డికి ప్రభుత్వం ఈ బాధ్యతను అప్పగించినట్లు తెలిసింది. వచ్చేనెలలో పూర్తి స్థాయి రాష్ట్ర బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టాల్సి ఉండగా, ఆర్థిక అవసరాలు, నిధుల లభ్యతపై స్పష్టత కోసం ఈ కసరత్తును ప్రారంభించింది.

### హామీల పూర్తికే భారీగా నిధులు

శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన కొత్త హామీలను నెరవేర్చడం, పెండింగ్ బిల్లుల చెల్లింపులు, ఉద్యోగులకు వేతన సవరణ అమలు చేయడం, నిర్మాణంలో ఉన్న సాగునీటి పథకాలు, ఇతర మౌలిక వసతుల ప్రాజెక్టుల కొనసాగింపునకు రానున్న రోజుల్లో భారీగా నిధులు అవసరం కానుంది. ఇదే విషయాన్ని ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎన్నికల హామీల అమలుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించడంతో రాష్ట్ర సంక్షేమ పథకాల వ్యయం రూ.40,000 కోట్ల నుంచి రూ.60,000 కోట్లకు పెరిగిపోయింది. రైతుబంధు పథకం కింద అన్నదాతలకు చేసే ఆర్థిక సాయాన్ని ప్రస్తుత ఖరీఫ్ నుంచి ఎకరానికి రూ.4వేల నుంచి రూ.5వేలకు పెంచుతూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఈ పథకం వార్షిక వ్యయం ఒక్కసారిగా రూ.12,000 కోట్ల నుంచి రూ.15,000 కోట్లకు పెరిగింది. ఇప్పటి వరకు 70% మందికి ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించగా, ఇంకా 30% మంది సాయం కోసం ఎదురుచూస్తున్నారు. అదే విధంగా వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పంపిణీ చేస్తున్న సామాజిక పింఛన్లను రెట్టింపు చేసి ప్రస్తుత జూలై నెల నుంచి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో సామాజిక పింఛన్ల వార్షిక భారం రూ.6000 కోట్ల నుంచి రూ.12వేల కోట్లకు చేరింది. దీనికి తోడు ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులకు సంబంధించి రూ.10,000 కోట్ల వరకు పెండింగ్ బిల్లులను ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

### పీఆర్సీ నిర్ణయం తీసుకుంటే..

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ అమలుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే రాష్ట్ర ఖజానాపై ఏటా మరో రూ.4వేల కోట్ల నుంచి రూ.5వేల కోట్ల వరకు అదనపు భారం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలు మినహాయిస్తే రాష్ట్రంలో నిర్మిస్తున్న ఇతర నీటిపారుదల ప్రాజెక్టులకు రాష్ట్రఖజానా నుంచే నిధులు వెచ్చించాల్సి ఉంది. మిషన్ కాకతీయతోసహా నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల కొనసాగింపుకు మరో రూ.15 వేల కోట్లను ఈ ఏడాది ఖర్చు చేయకతప్పదని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ అవసరాలను తీర్చాలంటే ప్రస్తుతం రాష్ట్రానికి వస్తున్న ఆదాయానికి తోడుగా మరో రూ.40వేల కోట్ల నిధులు అవసరమవుతాయని ప్రభుత్వం ఓ అంచనాకు వచ్చినట్లు సమాచారం. ఈ మేరకు నిధులు సమీకరించేందుకు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలతో రాష్ట్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు సంప్రదింపులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఎఫ్ఆర్‌బీఎం పరిమితులకు లోబడి బయటి సంస్థల నుంచి ఆర్థిక సహాయం పొందేందుకున్న అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. అదే విధంగా కాళేశ్వరం, మిషన్ భగీరథ ప్రాజెక్టుల కోసం కార్పొరేషన్లు స్థాపించి నిధులను సమీకరించిన తీరులోనే మరికొన్ని మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల విషయంలో కొత్త కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలియవచ్చింది.

# రచయితలకు సిధారెడ్డి క్షమాపణ చెప్పాలి

- సిధారెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డ తె.ర.వే
- ఆయన వ్యాఖ్యలు భావ ప్రకటనా స్వేచ్ఛను హరించేలా ఉన్నాయి
- పదవికి రాజీనామా చేయాలని డిమాండ్
- తెలంగాణ అంటేనే ధిక్కార స్వరమని ప్రకటన



**సాక్షి,హైదరాబాద్:** 'తెలంగాణ రచయితల వేదిక పని అయిపోయింది'అని తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి చేసిన వాఖ్యలపై తెలంగాణ రచయితల వేదిక (తె.ర.వే) తీవ్రంగా మండిపడింది. ఆయన వాఖ్యలు భావప్రకటనా స్వేచ్ఛను హరించేలా ఉన్నాయని, వెంటనే తన పదవికి రాజీనామా చేసి, తెలంగాణ రచయితలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. లేదంటే ఆయనకు వ్యతిరేకంగా భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేసింది. తెలంగాణ రచయితల వేదిక 30 సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'కలాల స్వేచ్ఛ కోసం'అనే అంశంపై నిర్వహించిన సమావేశానికి వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. గత 19 ఏళ్లుగా ప్రజల కోసం అనేక అంశాలపై తెలంగాణ రచయితల వేదిక పోరాటం చేస్తోందని, అటువంటి తె.ర.వేను మూసివేయాలని వ్యాఖ్యానించడం సరికాదని వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు పేర్కొన్నారు. సిధారెడ్డి మాటల్లో ఏక సాహిత్యం ఉండాలనే తీరు కనిపిస్తోందన్నారు. గతంలో ఆయన తె.ర.వేలో పని చేయడంతోపాటు దానికి అధ్యక్షుడిగా ఉన్నారని ఓపీడీఆర్ నాయకులు వెంకటేశ్వర్లు గుర్తు చేశారు. తెలంగాణ అంటేనే ఒక ధిక్కార స్వరమని రచయిత కాలువ మల్లయ్య పేర్కొన్నారు. సాయుధ పోరాటం, మొదటి విడత తెలంగాణ ఉద్యమం, నక్సల్బరి ఉద్యమం, రెండో విడత తెలంగాణ ఉద్యమం, మాదిగ దండోరాతో పాటు అనేక ఉద్యమాలు ఈ పోరాటాల గడ్డ నుంచే వచ్చాయని అప్పుడు కూడా తె.ర.వే ప్రజల పక్షమే వహించిందన్నారు. సిధారెడ్డి లాంటి వ్యక్తులు స్వలాభం కోసం పాలక పక్షాన నిలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించే గొంతులను నొక్కివేస్తున్నారని, ప్రశ్నించినవారిపై తెలంగాణ ప్రభుత్వ వ్యతిరేక ముద్ర వేస్తున్నారని విప్లవగాయని విమలక్క అన్నారు. సమావేశంలో తెలంగాణ జనసమితి ప్రతినిధి పి.శ్రీశైల్‌రెడ్డి, ఎరుక సంస్థ ప్రతినిధి దాసోజు లలిత, వేదిక ప్రధాన కార్యదర్శి నాగభూషణం, పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్, ప్రొఫెసర్ మనోజ్ఞ, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కళామండలి అధ్యక్షుడు సుధాకర్, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ప్రతినిధి బంగారు విజయ, ఛాయ ప్రతినిధి మోహన్‌బాబు, తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు నాగన్న సహా పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.











హిమాచల్‌ప్రదేశ్‌లోని సొలాన్‌ జిల్లాలో భారీ వర్షాల ధాటికి రెస్టారెంట్‌ నిర్వహిస్తున్న ఓ నాలుగంతస్తుల భవనం కూలిపోగా ఇద్దరు చనిపోయారు. మృతుల్లో ఒకరు సైనిక అధికారి. మరో 8 మంది సైనికాధికారులు సహా 27 మంది గాయాలపాలయ్యారు. కొందరు సైనికులు రెస్టారెంట్‌లో భోజనం చేస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

## నక్సల్స్‌ అణచివేతకు ఆర్మీ: కేంద్ర మంత్రి

**కటక్‌:** నక్సలైట్లు హింసను విడనాడి జనజీవన స్రవంతిలో కలిసిపోయి ప్రశాంతమైన, గౌరవమైన జీవితం గడపాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్‌ ఆదివారం కోరారు. అలా చేయని పక్షంలో నక్సలైట్ల అణచివేతకు ప్రభుత్వం అన్ని మార్గాలనూ అనుసరిస్తుందనీ, ఆర్మీని కూడా మోహరిస్తుందని ఆయన హెచ్చరించారు. ఒడిశాలోని కటక్‌లో ఆయన మాట్లాడుతూ 'దేశంలో నక్సల్‌ ప్రభావిత ప్రాంతాలు తగ్గిపోతున్నాయి. నక్సల్స్‌ సంఖ్య కూడా తగ్గుతోంది. ఇంకా నక్సల్‌ ప్రభావం ఉన్న ప్రాంతాల్లో పారా మిలిటరీ దళాలను మోహరించాం. ప్రభుత్వం అందిస్తున్న పునరావాస పథకం కారణంగా అనేక మంది నక్సల్స్‌ హింసను వీడి జన జీవన స్రవంతిలో కలిశారు' అని తెలిపారు. మిగిలి ఉన్న నక్సలైట్లను అణచివేయడానికి అవసరమైతే సైన్యాన్ని రంగంలోకి దింపుతామన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బిహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, కేరళ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్‌ రాష్ట్రాల్లో నక్సల్‌ ప్రభావిత ప్రాంతాలున్నాయి.

## కర్తార్‌పూర్‌ కారిడార్‌పై జాగ్రత్త

### పాకిస్తాన్‌ను అప్రమత్తం చేసిన భారత్‌

**వాఘా/న్యూఢిల్లీ:** కర్తార్‌పూర్‌ సాహిబ్‌ తీర్థయాత్రకు భగ్నం కలిగించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నించే అవకాశం ఉందని పాకిస్తాన్‌ను భారత్‌ హెచ్చరించింది. సిక్కుల పవిత్ర యాత్రా స్థలాలైన పాక్‌లోని దర్బార్‌ సాహిబ్‌ను భారత్‌లోని డేరా బాబా నానక్‌ మందిరంతో కలిపే కర్తార్‌పూర్‌ కారిడార్‌పై రెండు దేశాల అధికారులు ఆదివారం వాఘా సరిహద్దుల్లోని పాక్‌ భూభాగంలో రెండో దఫా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా భారత ప్రతినిధి బృందం పలు అంశాలపై పాక్‌కు అభ్యంతరం తెలిపింది. సిక్కుల మనోభావాలను ఆసరాగా తీసుకుని పాక్‌లోని కొందరు వ్యక్తులు, లేదా సంస్థలు తీర్థయాత్రకు ఆటంకం కలిగించవచ్చునని భారత్‌ హెచ్చరించింది. స్పందించిన పాక్‌..భారత వ్యతిరేక చర్యలను అనుమతించబోమని హామీ ఇచ్చింది. కారిడార్‌లో రావి నదిపై వంతెన నిర్మిస్తే అన్ని కాలాల్లోనూ యాత్రికులకు అనువుగా ఉంటుందని భారత్‌ ప్రతిపాదించగా, పాక్‌ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. చర్చల అనంతరం పాక్‌ ప్రతినిధి మొహమ్మద్‌ మీడియాతో మాట్లాడుతూ..దాదాపు 80 శాతంపైగా అంశాలపై రెండు దేశాలు ఏకాభిప్రాయంతో ఉన్నాయి. మిగతావి కూడా మరోసారి జరిగే చర్చల్లో పరిష్కారమవుతాయి' అని తెలిపారు.

## లోడ్‌ షెడ్డింగ్‌కు నష్టపరిహారం: కేంద్రం

**రాంచీ:** దేశమంతటా ఒకే విద్యుత్తు గ్రిడ్‌ ఉండాలనేది లక్ష్యమనీ, విద్యుత్తు సరఫరాలో విఘాతం కలిగితే (లోడ్‌ షెడ్డింగ్‌) వినియోగదారులకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర విద్యుత్తు శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) రాజ్‌ కుమార్‌ సింగ్‌ ఆదివారం వెల్లడించారు. రాంచీలో సింగ్‌ మాట్లాడుతూ 'విద్యుత్తు చార్జీల కొత్త విధానాన్ని త్వరలోనే కేబినెట్‌ ముందు ఉంచుతాం. సాంకేతిక సమస్యలు వచ్చినప్పుడు, ప్రకృతి విపత్తుల సమయంలో తప్ప మిగతా సందర్భాల్లో చెప్పాపెట్టకుండా కరెంటు తీసేస్తే సిబ్బందికి జరిమానా వేసేలా, వినియోగదారులకు నష్టపరిహారం చెల్లించేలా ఈ కొత్త విధానం ఉంటుంది' అని వెల్లడించారు.

# కేబినెట్‌ నుంచి సిద్ధూ నిష్క్రమణ



- ముఖ్యమంత్రి అమరీందర్‌ సింగ్‌తో విభేదాలు
- గత నెలలోనే రాజీనామా చేసినట్లు ట్విట్టర్‌లో ప్రకటన

**చండీగఢ్‌:** మాజీ క్రికెటర్, కాంగ్రెస్‌ ఎమ్మెల్యే నవ్‌జోత్‌ సింగ్‌ సిద్ధూ పంజాబ్‌ మంత్రివర్గం నుంచి వైదొలిగారు. గత నెలలోనే ఆయన రాజీనామా చేసినప్పటికీ తాజాగా వెలుగులోకి వచ్చింది. ముఖ్యమంత్రి కెప్టెన్‌ అమరీందర్‌ సింగ్‌తో విభేదాలు, మంత్రివర్గంలో కీలక శాఖల నుంచి తప్పించడం వంటి పరిణామాల నేపథ్యంలో జూన్‌లోనే రాజీనామా చేసినట్లు ఆదివారం ఆయన ట్విట్టర్‌లో ప్రకటించారు. కాంగ్రెస్‌ చీఫ్‌ రాహుల్‌కు పంపిన ఆ లేఖను సీఎంకు కూడా పంపుతానన్నారు. పంజాబ్‌ సీఎం అమరీందర్‌ సింగ్‌ జూన్‌ 6వ తేదీన మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించారు. ఇందులో భాగంగా పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు, స్థానిక పాలన శాఖల బాధ్యతల నుంచి సిద్ధూను తప్పించి ఇంధనం, పునర్వినియోగ ఇంధన శాఖలను కేటాయించారు. దీంతోపాటు పలు ప్రభుత్వ కమిటీల్లో సిద్ధూకు స్థానం కల్పించలేదు. ఈ పరిణామాలతో తీవ్ర అసంతృప్తి చెందిన సిద్ధూ గత నెల 9వ తేదీన కాంగ్రెస్‌ చీఫ్‌ రాహుల్‌ గాంధీని కలిసి, పరిస్థితిని వివరించడంతోపాటు ఒక లేఖను కూడా అందజేసినట్లు సమాచారం. అప్పటి నుంచి ఆయన తనకు కేటాయించిన కొత్త మంత్రిత్వశాఖల బాధ్యతలను చేపట్టలేదు. దీంతో సిద్ధూ, సీఎం సింగ్‌ల మధ్య విభేదాలను పరిష్కరించే బాధ్యతను సీనియర్‌ నేత అహ్మద్‌ పటేల్‌కు పార్టీ అప్పగించింది. అయితే, సమస్య పరిష్కారం అవుతుందనే ఆశాభావంతో నెల రోజులపాటు వేచి చూసినా ఎలాంటి ఫలితం కనిపించకనే తాజాగా సిద్ధూ తన రాజీనామా లేఖను బహిర్గతం చేసినట్లు సమాచారం. ఈ నెల రోజులు కూడా సిద్ధూ మీడియా, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉన్నారు.

**సీఎం, సిద్ధూ విభేదాలు ఏమిటి?:** ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ ప్రభావం కనిపించకపోవటానికి స్థానిక పాలన శాఖ బాధ్యతలను నిర్వహిస్తున్న సిద్ధూయే కారణమంటూ సీఎం అమరీందర్‌ బాహాటంగా ఆరోపించారు. గత ప్రభుత్వం హయాంలో మత విశ్వాసాలకు భంగం కలిగించిన బాదల్‌ కుటుంబీకులపై కేసు ఎందుకు నమోదు చేయలేదంటూ అంతకుముందు ఎన్నికల ప్రచారంలో సీఎంను సిద్ధూ ప్రశ్నించారు. అదేవిధంగా, తనకు కెప్టెన్‌ రాహుల్‌ గాంధీయేనని, తన కెప్టెన్‌(సీఎం)కు కూడా ఆయనే కెప్టెన్‌ అంటూ గత ఏడాది సిద్ధూ వ్యాఖ్యానించడం విభేదాలకు ఆజ్యం పోసింది.

# సంకీర్ణానికి నాగరాజ్‌ ఝలక్‌

- తొలుత రాజీనామా ఉపసంహరించుకుంటానని హామీ
- ముంబైలోని రెబెల్స్‌ క్యాంప్‌కు చేరుకోగానే యూటర్న్‌
- తిరుగుబాటు నేత రామలింగారెడ్డికి కాంగ్రెస్‌ నేతల బుజ్జగింపులు
- కుమారస్వామి నిజాయితీపరుడైతే రాజీనామా చేయాలి: యడ్యూరప్ప

**బెంగళూరు/ముంబై:** కర్ణాటకలో రాజకీయం ఆదివారం అనూహ్య మలుపు తిరిగింది. రాజీనామాను వెనక్కు తీసుకోవాలని కాంగ్రెస్‌ ముఖ్యనేతలు చేసిన విజ్ఞప్తికి తొలుత సానుకూలంగా స్పందించిన రెబెల్‌ ఎమ్మెల్యేల ఎంటీబీ నాగరాజ్‌ ఒక్కరోజులోనే తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. బీజేపీ నేత ఆర్‌.అశోక్‌తో కలిసి ప్రత్యేక విమానంలో ఆదివారం బెంగళూరు నుంచి ముంబైలోని రెబెల్‌ ఎమ్మెల్యేల క్యాంప్‌కు చేరుకున్నారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలను వెనక్కి తీసుకొస్తానని చెప్పి ముంబైలో దిగగానే మాటమార్చారు. దీంతో కాంగ్రెస్‌–జేడీఎస్‌ నేతల ఆనందం ఒక్క రోజులోనే ఆవిరైంది. అయితే రెబెల్‌ ఎమ్మెల్యే సుధాకర్‌తో పాటు మరికొందరిని ఒప్పించి వెనక్కు తీసుకొచ్చేందుకే నాగరాజ్‌ ముంబైకి వెళ్లారని కాంగ్రెస్‌ సీనియర్‌ నేత హెచ్‌.కె.పాటిల్‌ తెలిపారు. కర్ణాటక అసెంబ్లీ 'విధానసౌధ'లో విశ్వాసపరీక్ష నాటికి అన్నీ సర్దుకుంటాయని ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటకలో ఇప్పటివరకూ కాంగ్రెస్‌–జేడీఎస్‌ పార్టీలకు చెందిన 16 మంది ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా సమర్పించిన సంగతి తెలిసిందే.

**రాజీనామా వెనక్కి తీసుకోను: నాగరాజ్‌**

ముంబైకి వెళ్లేముందు నాగరాజ్‌ మీడియాతో మాట్లాడుతూ..'సుధాకర్‌ గత రెండ్రోజులుగా తన ఫోన్‌ను స్విచ్ఛాఫ్‌ చేసుకున్నారు. ఆయనతో మాట్లాడి ఒప్పించి వెనక్కి తీసుకొస్తాను. ఈ విషయాన్ని కాంగ్రెస్‌ నేతలకు ఇప్పటికే చెప్పాను' అని తెలిపారు. కానీ ముంబైలో రెబెల్‌ ఎమ్మెల్యేల క్యాంప్‌కు చేరుకున్న వెంటనే నాగరాజ్‌ మాటమార్చారు. 'మేమంతా(రెబెల్‌ ఎమ్మెల్యేలు) ఒకేసారి రాజీనామా చేశాం. ఇప్పుడు రాజీనామా విషయంలో నేను పూర్తి స్పష్టతతో ఉన్నాను. నా రాజీనామాను వెనక్కు తీసుకునే ప్రసక్తే లేదు. మా వెనుక బీజేపీ లేదు. బీజేపీ నేత అశోక్‌తో కలిసి నేను ముంబైకి వచ్చినట్లు మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదు' అని వెల్లడించారు. మరో రెబెల్‌ ఎమ్మెల్యే ఎస్‌.టి.సోమశేఖర్‌ స్పందిస్తూ.. నాగరాజ్‌ తమతో కలవడానికే ముంబై వచ్చారనీ, ఎమ్మెల్యే సుధాకర్‌ను వెనక్కి తీసుకెళ్లడానికి కాదన్నారు. నాగరాజ్‌ చేరికతో ముంబైలో మకాం వేసిన రెబెల్స్‌ సంఖ్య 15కు చేరుకుంది.

**రామలింగారెడ్డితో కాంగ్రెస్‌ నేతల భేటీ..**

ఎమ్మెల్యే నాగరాజ్‌ చాకచక్యంగా ముంబైలోని రెబెల్స్‌ క్యాంప్‌కు చేరుకోవడంతో సంకీర్ణ ప్రభుత్వాన్ని కాపాడేందుకు కాంగ్రెస్‌ నేతలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన రెబెల్‌ నేత రామలింగారెడ్డితో కర్ణాటక కాంగ్రెస్‌ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈశ్వర్‌ ఖండ్రే, సీఎల్పీ నేత సిద్దరామయ్య, సీనియర్‌ నేత హెచ్‌.కె.పాటిల్‌ భేటీ అయ్యారు. ఎమ్మెల్యే పదవికి సమర్పించిన రాజీనామాను వెనక్కు తీసుకోవాలని కోరారు. అనంతరం ఖండ్రే మీడియాతో మాట్లాడుతూ..'రామలింగారెడ్డి సీనియర్‌ నేత. కాంగ్రెస్‌ పార్టీకి ఆయన అవసరం చాలాఉంది. ఆయన పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడలేదు. కాబట్టి రాజీనామాను ఉపసంహరించుకోవాల్సిందిగా కోరాం'' అని తెలిపారు. మరోవైపు రామలింగారెడ్డి స్పందిస్తూ.. స్పీకర్‌ రమేశ్‌కుమార్‌తో సోమవారం సమావేశమయ్యేవరకూ తానేమీ మాట్లాడబోనని స్పష్టం చేశారు. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించేందుకు సీఎల్పీ సోమవారం సమావేశం కానుంది.

**2–3 రోజుల్లోనే బీజేపీ ప్రభుత్వం: యడ్యూరప్ప**

కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్‌.డి.కుమారస్వామి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని రాష్ట్ర బీజేపీ చీఫ్‌ యడ్యూరప్ప మరోసారి డిమాండ్‌ చేశారు.'కుమారస్వామి నిజంగా నిజాయితీపరుడైతే, ఆయనకు ప్రజాస్వామ్య వ్యవస్థపై గౌరవముంటే వెంటనే రాజీనామా చేయాలి. లేదంటే అసెంబ్లీలో విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలి. సోమవారం జరిగే బీఏసీ సమావేశంలో ముఖ్యమంత్రికి నేను ఇదే సూచిస్తాను. రెబెల్‌ ఎమ్మెల్యేలు వెనక్కు రాబోమని ఇప్పటికే స్పష్టం చేశారు. ఇంకో 2–3 రోజుల్లో కర్ణాటక ప్రజలకు సేవ లందించే సదవకాశం బీజేపీకి లభిస్తుంది' అని చెప్పారు.

**కాంగ్రెస్‌పై కుమారస్వామి చిందులు..**

**సాక్షి, బెంగళూరు:** కర్ణాటక సంక్షోభం నేపథ్యంలో సీఎం కుమారస్వామి కాంగ్రెస్‌ రాష్ట్ర ఇన్‌చార్జ్‌ కేసీ వేణుగోపాల్, మల్లికార్జున ఖర్గే, సీఎల్పీ నేత సిద్దరామయ్యతో సమావేశమయ్యారు. బెంగళూరులోని కుమారకృప గెస్ట్‌హౌస్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్‌ నేతలపై ముఖ్యమంత్రి చిందులు తొక్కారు. 'మా పార్టీ నుంచి కేవలం ముగ్గురే వెళ్లారు. కానీ కాంగ్రెస్‌ నుంచి ఏకంగా 13 మంది రాజీనామాలు చేశారు. మీ ఎమ్మెల్యేలను కూడా మీరు బుజ్జగించలేరా?' అని అసహనం వ్యక్తం చేశారు.



బెంగళూరులో రామలింగారెడ్డితో భేటీ అయిన సిద్దరామయ్య

### అప్రమత్తమైన కమల్‌నాథ్‌

కర్ణాటక, గోవా రాష్ట్రాల్లో రాజకీయ పరిణామాల నేపథ్యంలో మధ్యప్రదేశ్‌ సీఎం కమల్‌నాథ్‌ అప్రమత్తమయ్యారు. మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వం నడుస్తున్న వేళ ఎమ్మెల్యేలు జారిపోకుండా బుధవారం విందు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 230 స్థానాలున్నమధ్యప్రదేశ్‌ అసెంబ్లీకి 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌ 114, బీజేపీ 109 స్థానాల్లో గెలుపొందాయి. అయితే స్వతంత్రులు(4), బీఎస్పీ(2) ఎస్పీ(1)ల మద్దతుతో కాంగ్రెస్‌ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కాగా, కాంగ్రెస్‌ ముఖ్యనేత జ్యోతిరాదిత్య సింధియా ఇప్పటికే మిత్రపక్షాలతో సమావేశమయ్యారు.

### అసెంబ్లీలో బలాబలాలు

224 స్థానాలున్న కర్ణాటక అసెంబ్లీలో అధికార కాంగ్రెస్‌–జేడీఎస్‌ కూటమికి 118 మంది ఎమ్మెల్యేలు ఉండగా, వారిలో 16 మంది రాజీనామా చేయగా, మరో ఇద్దరు స్వతంత్రులు మద్దతు ఉపసంహరించుకున్నారు. ఒకవేళ స్పీకర్‌ ఈ 16 రాజీనామాలను ఆమోదిస్తే కూటమి బలం 100కు పడిపోతుంది. సభలో ఎమ్మెల్యేల సంఖ్య 208కు చేరుతుంది. అప్పుడు ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన సభ్యుల సంఖ్య 105 అవుతుంది. ఇద్దరు స్వతంత్రుల మద్దతుతో బీజేపీ బలం 107కు పెరిగినందున ఆ పార్టీ సులభంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది.

రాష్ట్రీయం

## పోడు భూములకు పట్టాలివ్వాలి: కోదండరాం



**హైదరాబాద్‌:** అనేక తరాలుగా అడవిలో పోడు సాగుచేసుకుంటున్న లంబాడీ, గిరిజనులపై దాడులను ప్రభుత్వం తక్షణమే నిలిపేసి వారికి పట్టాలివ్వాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్‌ కోదండరాం డిమాండ్‌ చేశారు. గిరిజనులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో మాజీ మంత్రి రవీంద్రనాయక్, లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌ కుమార్‌ జాదవ్‌లు 48 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షను ఆదివారం సాయంత్రం కోదండరాం, ఎమ్మెల్సీ రాంచందర్‌లు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. అనంతరం తెలంగాణ లంబాడీ, గిరిజన జాయింట్‌ యాక్షన్‌ కమిటీ కన్వీనర్‌ మాజీ మంత్రి రవీంద్రనాయక్‌ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లంబాడీ, గిరిజనుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపుతున్నాయని విమర్శించారు. అమాయక గిరిజనుల మధ్య చిచ్చుపెడుతూ గిరిజన హక్కులు కాలరాస్తున్న పాలకులకు వ్యతిరేకంగా సమర శంఖారావం పూరించాలని పిలుపునిచ్చారు. గిరిజనులకు రిజర్వేషన్లు పెంచి, ఛత్తీస్‌గఢ్‌ తరహాలో అమలు చేయాలని రాజ్‌ కుమార్‌ డిమాండ్‌ చేశారు. తెలంగాణలో అత్యధికంగా జనాభా శాతం ఉన్న గిరిజనులకు గిరిజన మంత్రి, హోంశాఖతో పాటు డిప్యూటీ సీఎం కేటాయించాలని డిమాండ్‌ ఆయన చేశారు. గిరిజన యూనివర్సిటీలను ఏర్పాటు చేసి, బయ్యారం స్టీల్‌ ప్లాంట్‌ను వెంటనే స్థాపించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ రాంచందర్‌రావు మాట్లాడుతూ లంబాడీ, గిరిజన సమస్యలపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

## బీజేపీలో చేరిన సోమారపు



సోమారపును పార్టీలోకి ఆహ్వానిస్తున్న లక్ష్మణ్‌. చిత్రంలో దత్తాత్రేయ, రాజాసింగ్‌

**సాక్షి, హైదరాబాద్‌:** రామగుండం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ బీజేపీలో చేరారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో తన అనుచరులతో కలిసి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌ సమక్షంలో ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ కేంద్రమంత్రి దత్తాత్రేయ స్వయంగా సత్యనారాయణను పార్టీలోకి ఆహ్వానించారు. ఇటీవల టీఆర్‌ఎస్‌ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన సత్యనారాయణ.. తనకు అవమానం జరిగినందునే పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. గోదావరిఖనికి చెందిన ఆయ న గతంలో కాంగ్రెస్, టీడీపీ, టీఆర్‌ఎస్‌ పార్టీల్లో పనిచేశారు. 1998లో రామ గుండం మున్సిపల్‌ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీలో చేరి మంథని నుంచి పోటీ చేసి డి.శ్రీధర్‌బాబు చేతిలో ఓడిపోయారు. 2009లో రామగుండం స్వతంత్ర ఎమ్మెల్యేగా, 2014 టీఆర్‌ఎస్‌ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2018లో టీఆర్‌ఎస్‌ రెబెల్‌ కోరుకంటి చందర్‌ చేతిలో పరాజయం పాలయ్యారు. దీంతో తాజాగా కమలం పార్టీలో చేరారు.

## బీసీలను బిచ్చగాళ్లను చేశారు: కృష్ణయ్య



**హైదరాబాద్‌:** దేశంలో బీసీలను బిచ్చగాళ్లను చేశారని, రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించకుండా అన్యాయం చేస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్‌.కృష్ణయ్య ఆరోపించారు. ఆదివారం నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్‌–లింగ బలిజ సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు పెట్టే వరకు ఉద్యమిస్తామన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లును పెట్టి బీసీలకు జనాభా ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ సదస్సులో సైబరాబాద్‌ కమిషనర్‌ సజ్జనార్, సినీ నటుడు ఆర్‌.నారాయణమూర్తి, పటోళ్ల సంగమేశ్వర్, ఈశ్వరప్ప, నీల వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

## పాక్‌ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోంది

- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి.కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

**హైదరాబాద్‌:** పాకిస్తాన్‌ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని, ఎక్కడ ఉగ్రదాడులు జరిగినా దాని మూలాలు పాక్‌లోనే లభిస్తున్నాయని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. పాక్‌లో ఉగ్రవాదుల శిక్షణాశిబిరాలు ఉన్నట్లు ప్రపంచ దేశాలు గుర్తించినప్పటికీ ఆ దేశం మాత్రం బుకాయిస్తోందన్నారు. ఆదివారం అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో కిషన్‌రెడ్డి మహాపాదయాత్ర చేపట్టారు. నల్లకుంట డివిజన్‌ సత్యానగర్‌లో గల రాజ్యాంగనిర్మాత డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాదయాత్ర ప్రారంభించి మాట్లాడారు. ముమ్మాటికీ కశ్మీర్‌ భారత్‌లో అంతర్భాగమేనని, ఒక్క అంగుళం భూమిని కూడా భారత్‌ వదులుకోదని మంత్రి స్పష్టం చేశారు. తాను ఏ పదవిలో ఉన్నా, ఎప్పటికీ సికింద్రాబాద్‌ పార్లమెంట్‌ నియోజకవర్గం ముద్దుబిడ్డనేనని చెప్పారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌ షా తనకు అప్పగించిన కీలకమైన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూనే, సమయం దొరికినప్పుడల్లా నియోజకవర్గంలో పర్యటించి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అమిత్‌షా దేశ ప్రజలకు హోంమంత్రి అయితే, తనకు మాత్రం హెడ్‌ మాస్టరని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతున్నామని చెబుతున్నప్పటికీ, నగరంలో ఎక్కడ చూసినా ఛిద్రమైన రోడ్లు, అస్తవ్యస్తమైన డ్రైనేజీ, సీవరేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తాను ఎంపీగా గెలుపొందేందుకు కృషి చేసిన ఆయా కుల, బస్తీ, పొదుపు సంఘాలు, ఉద్యోగ సంఘాలతో కలవాలని అనుకుంటున్నా సమయాభావం కారణంగా వీలుపడటంలేదని, పార్లమెంట్‌ సమావేశాలు ముగిసిన తరువాత అందరినతో కలుస్తానని చెప్పారు. సత్యానగర్‌ వద్ద ప్రారంభమైన మొదలైన పాదయాత్ర రత్నానగర్, ఫీవర్‌ ఆస్పత్రి చౌరస్తా, తిలక్‌నగర్‌ మొయిన్‌రోడ్డు, తిలక్‌నగర్‌ చౌరస్తా, చే నంబర్‌ చౌరస్తా మీదుగా అంబర్‌పేట మహంకాళి ఆలయం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర మాజీ అధ్యక్షుడు బి.వెంకట్‌ రెడ్డి, నాయకులు గౌతంరావు, ఏవీ.లక్ష్మా రెడ్డి, కన్నె రమేష్‌ యాదవ్, ఎక్కాల నందు, టి. కృష్ణాగౌడ్, వనం రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు. మహా పాదయాత్ర సందర్భంగా ప్రజలు అడుగడున మంత్రికి నీరాజనాలు పలికారు.

## జాతీయ విధానంతోనే అటవీ పరిరక్షణ

### వివిధ రాష్ట్రాల పీసీసీఎఫ్‌లు వెల్లడి

**సాక్షి, హైదరాబాద్‌:** అటవీ సంపద పరిరక్షణకు జాతీయస్థాయిలో ఒక ఉమ్మడి విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని వివిధ రాష్ట్రాలకు చెందిన అటవీశాఖల ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు. వచ్చే నవంబర్‌లో అన్ని రాష్ట్రాల అటవీ మంత్రులు, సెక్రటరీలు, పీసీసీఎఫ్‌లతో ముంబైలో నిర్వహించే జాతీయ అటవీ సదస్సులో ఈ అంశంపై చర్చిస్తామని తెలిపారు. రాష్ట్ర అటవీశాఖ ఆధ్వర్యంలో జరిగిన రెండురోజుల అంతర్రాష్ట్ర అటవీ సదస్సు ముగింపు సందర్భంగా ఆదివారం వివిధ అంశాలపై చర్చించారు. ఈ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వ అంతర్రాష్ట్ర సలహాదారు టంకశాల అశోక్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. పొరుగు రాష్ట్రాలతో స్నేహపూర్వకంగా ఉంటూ బతుకు, బతకనివ్వు విధానాన్ని తెలంగాణ అమలుచేస్తోందని, అడవుల సంరక్షణకు కూడా ఇదే విధానం వర్తిస్తుందని టంకశాల అశోక్‌ తెలిపారు. పచ్చదనం పెంపుదల, అడవుల పునరుజ్జీవనానికి రాష్ట్ర ప్రభుత్వం, సీఎం ఇస్తున్న ప్రాధాన్యతను భూపాల్‌ రెడ్డి వివరించారు. నూటా పది రకాల విధానాలు, సంస్కరణలను తెలంగాణ అటవీ శాఖలో తీసుకువచ్చినట్టు, రాష్ట్ర పీసీసీఎఫ్‌ పీకే ఝా అన్నారు. మంచి అటవీ రక్షణ విధానాలు, కొత్త సాంకేతిక ఆవిష్కరణలకు పరస్పరం ఇచ్చిపుచ్చుకునేందుకు సమావేశంలో అంగీకారం కుదిరింది.

**అటవీ సంరక్షణకు పరస్పర సహకారం..**

అడవుల పరిరక్షణతోపాటు వన్యప్రాణుల సంరక్షణతో ముడిపడిన వివిధ అంశాల్లో పరస్పర సహకారం అవసరమని తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ రాష్ట్రాల అటవీ సంరక్షణ ప్రధాన అటవీ అధికారులు (పీసీసీఎఫ్‌) అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. కాగజ్‌నగర్‌ ఘటన అటవీ సిబ్బంది ఇబ్బందులను ప్రజలకు తెలిపిందని పీకేఝా తెలిపారు. అటవీ పరిరక్షణకు గాను తమ సిబ్బందికి 125 రివాల్వర్లు, ఇతర ఆయుధాలిచ్చినట్టు ఏపీ పీసీసీఎఫ్‌ మహ్మద్‌ ఇల్యాస్‌ రిజ్వీ తెలిపారు. హరితహారం, కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తెలంగాణ అటవీశాఖ పాత్ర ఇతర రాష్ట్రాలకు ఒక మోడల్‌ వంటిదని కేరళ పీసీసీఎఫ్‌ పీకే కేశవన్‌ అన్నారు.

# ఉందిలే మంచికాలం

▶ మొదటి పేజీ తరువాయి

నెలకొన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా లోటు వర్షపాతం నెలకొంది. దీంతో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. ఫలితంగా దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితులకు ప్రధానంగా ఎల్‌నినో ప్రభావం, నైరుతి రుతుపవన ద్రోణి హిమాలయాల వైపు తరలిపోవడమే కారణం. నైరుతి రుతుపవనాల ఆగమనం, విస్తరణకు అనేక సందర్భాల్లో అడ్డుగా నిలిచేది ఎల్‌నినో అనేది తెలిసిందే. అదిప్పుడు బలహీన పడుతుండటంతో రానున్న రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా దక్షిణాదివైపు రావాల్సిన నైరుతి రుతుపవన ద్రోణి హిమాలయాల వైపు వెళ్లిపోయింది. ఆ రుతుపవన ద్రోణి ఇప్పుడు తిరిగి దక్షిణాది ప్రాంతంపైకి త్వరలో రానుంది. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఆగస్టు, సెప్టెంబర్‌ నెలల్లో సాధారణం కంటే భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్‌ వాతావరణ కేంద్రం సీనియర్‌ అధి కారి రాజారావు తెలిపారు. ఎల్‌నినో క్రమంగా బలహీన పడుతుండటంతో ముమ్ముందు మంచి వర్షాలు కురుస్తాయని అమెరికా శాస్త్రవేత్తలు విశ్లేషించారు. అయితే ఎల్‌నినో క్షీణించినా మంచి వర్షాలు పడుతాయని కచ్చితంగా చెప్పలేమని మరికొందరు నిపుణులు అంటున్నారు.

**ఎల్‌నినో అంటే?**

పసిఫిక్‌ మహాసముద్రంలో భూమధ్యరేఖ దగ్గర జల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 0.5 డిగ్రీలు అధికంగా ఉంటే దాన్ని ఎల్‌నినో అంటారు. అంతకంటే తక్కువగా ఉంటే లానినో అంటారు. ఎల్‌నినో ఉంటే వర్షాలు తక్కువగా, లానినా వల్ల వర్షాలు అధికంగా కురుస్తాయని వాతావరణ అధికారులు చెబుతున్నారు. పసిఫిక్‌ మహాసముద్రంలో ఏర్పడే ఎల్‌నినో ప్రభావం ఆసియా దేశాలపై పడుతుంది. ఫలితంగా ఇక్కడి సముద్రపు ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఈ ఏడాదీ ఎల్‌నినో ప్రభావం స్పష్టంగా కనిపించింది. దీంతో నైరుతి రుతుపవనాలు బలహీనమయ్యాయి. ఈసారి వర్షాకాలం ఆలస్యంగా ప్రారంభం కావడానికి ప్రధాన కారణం ఎల్‌నినో అని వాతావరణ నిపుణులు అంటున్నారు. ఫలితంగా జూన్‌లో లోటు వర్షపాతం నమోదైవ్యవసాయ పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. జూన్, జూలైలలో ఇప్పటివరకు సాధారణం కంటే లోటు వర్షపాతం వల్ల భూగర్భ జలాలు అడుగంటి వర్షాభావంతో విలవిలలాడుతున్నాయి. ఒక్కోసారి ఎల్‌నినో, లానినాలతో సంబంధం లేకుండానే మంచి వర్షాలు కురిసిన సందర్భాలు ఉన్నాయని హైదరాబాద్‌ వాతావరణ కేంద్రం డైరెక్టర్‌ వై.కె.రెడ్డి విశ్లేషించారు. అయితే లానినో ఏర్పడిన ఎక్కువ సందర్భాల్లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, కొన్ని సందర్భాల్లో అధికంగా కూడా వర్షాలు కురిశాయని ఆయన తెలిపారు.

**దారితప్పిన నైరుతి రుతుపవన ద్రోణి...**

ఎల్‌నినోకు తోడు ఈసారి నైరుతి రుతుపవన ద్రోణి మనల్ని ముంచింది. రుతుపవన ద్రోణి హిమాలయాల వైపు వెళ్లిపోవడం ప్రస్తుత పరిస్థితికి మరో కారణంగా వాతావరణ కేంద్రం చెబుతోంది. సాధారణంగా నైరుతి రుతుపవనాలు ప్రవేశించాక నైరుతి రుతుపవన ద్రోణి ఏర్పడుతుంది. ఇది నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా విస్తరించే సమయంలో రాజస్తాన్‌లోని గంగానగర్‌ నుంచి అలహాబాద్‌ మీదుగా ఉత్తర బంగాళాఖాతం వరకు ఏర్పడుతుంది. ఆ సమయంలో నైరుతి రుతుపవన ద్రోణి సాధారణ స్థితి నుంచి గాలుల దిశను బట్టి కిందనున్న దక్షిణం వైపునకు రావాల్సి ఉంటుంది. అప్పుడు తెలుగు రాష్ట్రాలకు భారీ వర్షాలు కురుస్తాయి. ఈసారి అలా కాకుండా అది సాధారణ స్థితి నుంచి పైకి అంటే ఉత్తరం వైపు నుంచి హిమాలయాలవైపు వెళ్లి పోయింది. రుతుపవనాలు ఎప్పటికప్పుడు దిశ మార్చుకుంటాయి. అవెప్పుడు ఎలా మారుతాయో వాతావరణ పరిస్థితులను బట్టి ఉంటుంది. అవి దిశ మార్చుకోవడానికి గాలుల తీవ్రతే కారణమని, దానివల్ల ఈసారి రుతుపవన ద్రోణి ఉత్తరం వైపు వెళ్లిపోయిందని రాజారావు అంటున్నారు. దీనివల్ల తెలుగు రాష్ట్రాల్లో తీవ్రమైన వర్షాభావం నెలకొంది. ఒక్కోసారి అది దిశ మార్చుకోకుండా సాధారణ స్థితిలోనే ఉంటే అప్పుడు ఉత్తరం వైపునకు, దక్షిణం వైపునకు కాకుండా అక్కడే తటస్థంగా ఉండిపోతుంది. అప్పుడు దేశం మొత్తం ఒకేసారి ఒకేవిధంగా భారీ వర్షాలు కురుస్తాయి. కానీ అదిప్పుడు హిమాలయాలవైపు వెళ్లిపోవడంతో మనకు వర్షాలు తక్కువగా కురిశాయని రాజారావు తెలిపారు. అయితే రుతుపవనాలు దక్షిణాది వైపు రావడం తప్పనిసరిగా జరిగే పరిణామమేనని, కానీ అవెప్పుడు వస్తాయో సాధారణంగా చెప్పలేమన్నారు. కానీ ఈసారి ఈ నెల చివరి నాటికి వస్తాయని అంచనా వేశామన్నారు.



**ఎల్‌నినో ఏర్పడిన సంవత్సరాలు**

దేశంలో 2000 సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఐదుసార్లు ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆయా సంవత్సరాల్లో జూన్‌ నుంచి సెప్టెంబర్‌ మధ్య కాలంలో అంతకుముందు సంవత్సరాలతో పోలిస్తే పడాల్సిన దానికన్నా కనిష్టంగా 14% లోటు వర్షపాతం నమోదైంది. లోటు వర్షపాతానికి, ఎల్‌నినోకు దగ్గరి సంబంధం ఉందని పలు శాస్త్రీయ అధ్యయనాలు తేల్చాయి. వాతావరణశాఖ దేశం మొత్తాన్ని 36 సబ్‌ డివిజన్లుగా విభజించింది. 2000 సంవత్సరం నుంచి ఈ మొత్తం డివిజన్లలో 25% ప్రాంతాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఎల్‌నినో వల్ల 2002, 2009 లలో 36 సబ్‌ డివిజన్లలో 20కి పైగా ప్రాంతాల్లో లోటు వర్షపాతం, క్షామ పరిస్థితులు తలెత్తాయి. ఎల్‌నినో ఏర్పడిన ఏడాది దేశమంతా సాధారణ వర్షాలు పడి, కొన్ని ప్రాంతాల్లో అధ్వాన పరిస్థితులు నెలకొన్న ఉదాహరణలూ ఉన్నాయని అధికారులు అంటున్నారు.

## మున్సి'పోల్స్‌'లో సత్తా చాటుతాం

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌



**సాక్షి, హైదరాబాద్‌:** మున్సిపల్‌ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధమని, తొలిసారిగా అన్నివార్డుల్లో పోటీ చేసి సత్తా చాటుతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ కె.లక్ష్మణ్‌ అన్నారు. ఆదివారం ఇక్కడి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కోర్‌ కమిటీ సమావేశం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్‌ ఎన్నికలు, మున్సిపల్‌ చట్టంతోపాటు పార్టీలో కొత్త నేతల చేరిక గురించి కోర్‌ కమిటీలో చర్చించామని చెప్పారు. ప్రభుత్వం అశాస్త్రీయ పద్ధతిలో వార్డులు విభజన, అనాగరికంగా సామాజికవర్గాల నమోదు చేపట్టిందన్నారు. బీజేపీ ఎదుగుదలను చూసి టీఆర్‌ఎస్‌ భయపడుతోందని, పార్లమెంటు ఎన్నికల ఫలితాల తరువాత ఈ భయం రెట్టింపు అయిందని ఎద్దేవా చేశారు. మున్సిపల్‌ ఎన్నికలకు నాలుగు మాసాల గడువు కావాలని కోర్టులో అఫిడవిట్‌ దాఖలు చేసిందని, ఇప్పుడేమో నెలరోజులు చాలని, మున్సిపల్‌ చట్టాన్ని సవరిస్తామని చెబుతోందని అభ్యంతరం వ్యక్తం చేశారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చాలా వేగంగా రాష్ట్రం నలుమూలలా పెద్ద ఎత్తున కొనసాగుతోందన్నారు. కాగా, అర్హులైన పేదలకు డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని ఈ నెల 25, 26 తేదీల్లో అన్ని మున్సిపల్‌ కేంద్రాల్లో ప్రజాచైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 30న అన్ని మున్సిపల్‌ కేంద్రాల్లో అవినీతిపై ధర్నాలు చేస్తామన్నారు. భూపాలపల్లి జిల్లా మల్హర్‌ మండలం నుంచి మల్క మోహన్, మల్క కవిత (ఎంపీటీసీ) తదితరులు కాంగ్రెస్‌ నుంచి పార్టీలో చేరారు. అనంతరం సభ్యత్వ నమోదు సంస్థాగత రథాన్ని లక్ష్మణ్‌ జెండా ఊపి ప్రారంభించారు.

## ఉస్మానియా పూర్వ వైద్య విద్యార్థుల సమ్మేళనం

**సాక్షి, హైదరాబాద్‌:** ఉస్మానియా మెడికల్‌ కాలేజ్‌ 1994 బ్యాచ్‌ పూర్వ వైద్య విద్యార్థుల సమ్మేళనం ఆదివారం శ్రీశైలం హైవేలోని బనియన్‌ రిసార్ట్స్‌లో ఘనంగా జరిగింది. తమ చదువు పూర్తి అయి 25 సంవత్సరాలు గడిచిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రాష్ట్రంలో పనిచేస్తున్న వైద్యులతో పాటు దేశ, విదేశాల్లో పనిచేస్తోన్న వైద్యులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారి పాత రోజులను, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డా. లాలూ ప్రసాద్‌ రాథోడ్‌ను సన్మానించారు. ఇందులో సంఘం సభ్యులు అనిల్, శ్రీనివాసరాజు, సురేశ్, ఆజమ్‌ తదితరులు పాల్గొన్నారు.

# కన్నెపల్లిలో జోరుగా ఎత్తిపోతలు

- ప్రస్తుతం 5 మోటార్లతో నీటి పంపింగ్
- ఐదో పంపునకు వెట్‌రన్
- నేడు 2వ మోటార్‌కు వెట్‌రన్
- మేడిగడ్డలో 6.5, అన్నారంలో 4.1 టీఎంసీల నిల్వ
- మేడిగడ్డ బ్యారేజీ బ్యాక్ వాటర్ కన్నెపల్లికి..


గ్రావిటీకాల్వ ద్వారా అన్నారం బ్యారేజీకి చేరుతున్న నీరు

**కాళేశ్వరం:** జయశంకర్ భూపాపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంపుహౌస్ నుంచి ఎత్తిపోతలు జోరందుకుతున్నాయి. జూన్ 21న సీఎం కేసీఆర్ ఆరో నంబర్ మోటార్ ప్రారంభించగా, ఆ తరువాత 1, 3, 4వ నంబర్ మోటార్లతో ఎత్తిపోతలు నిర్వహిస్తున్నారు. ఆదివారం 5వ నంబర్ మోటార్‌కు వెట్‌రన్ పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం మొత్తం ఐదు మోటార్లతో నీటిని ఎత్తిపోస్తున్నారు. ఒక్కో మోటార్ రెండు పంపుల ద్వారా ధారలు పోస్తున్నాయి. మొత్తం 11 మోటార్లకు 22 నీటి ధారలు ఎత్తిపోసేలా నిర్మాణం చేపట్టారు. కాగా, భవిష్యత్‌లో 3 టీఎంసీల నీటిని ఎత్తిపోసేందుకు 17 మోటార్లకు గాను 34 నీటి ధారలకోసం పైపులైన్ నిర్మాణం చేపట్టారు.

**నేడు 2వ మోటార్‌కు వెట్‌రన్..**

కాళేశ్వరం ప్రాజెక్టుద్వారా ఈ ఖరీఫ్ నుంచే పంటలకు నీరందించే దిశగా ఈఎన్‌సీ నల్ల వెంకటేశ్వర్లు పదిరోజులుగా అక్కడే ఉండి మోటార్లకు వెట్‌రన్ నిర్వహించి నీటిని ఎత్తిపోయిస్తున్నారు. సోమవారం 2వ మోటార్‌కు వెట్‌రన్ నిర్వహించనున్నారు.

**మేడిగడ్డలో 6.5 టీఎంసీల నిల్వ**


మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత నదికి వరద ప్రవాహం పోటెత్తి కాళేశ్వరం వద్ద గోదావరిలో కలుస్తోంది. ఆ నీరు మేడిగడ్డ వైపునకు తరలగా.. బ్యారేజీ గేట్లు మూయడంతో నిల్వ అవుతోంది. ప్రస్తుతం బ్యారేజీలో 6.5 టీఎంసీలు.. 9 మీటర్ల ఎత్తులో నీరు నిల్వ ఉంది. ఇంజనీర్లు గోదావరి తీరాల్లో వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్నారు.

**మేడిగడ్డ నుంచి కన్నెపల్లికి బ్యాక్‌వాటర్**

మేడిగడ్డ వద్ద నిల్వ చేస్తున్న నీరు బ్యాక్‌వాటర్ రూపంలో కన్నెపల్లికి చేరింది. దీంతో మోటార్లు నడవడానికి నీటి లభ్యత పెరుగుతోంది. ఇక్కడ ఐదు మోటార్లను ఇంజనీర్లు నడిపిస్తున్నారు. మేడిగడ్డ నుంచి కన్నెపల్లికి 22 కిలోమీటర్ల దూరం బ్యాక్ వాటర్ వచ్చింది.

**అన్నారంలో 4.1 టీఎంసీలు నిల్వ..**

కన్నెపల్లి పంపుహౌస్ నుంచి ఐదు మోటార్ల ద్వారా ఎత్తిపోస్తున్న నీరు గ్రావిటీకాల్వ గుండా అన్నారం వద్ద అండర్‌టన్నెల్ ద్వారా అన్నారం బ్యారేజీ వద్ద కలుస్తోంది. ప్రస్తుతం ఇక్కడ 4.1 టీఎంసీలు నిల్వ ఉంది. ఇక్కడ 8 మీటర్ల ఎత్తులో నీటి మట్టం ఉంది. ఇక్కడి నుంచి బ్యాక్‌వాటర్ పెద్దపల్లి జిల్లా మంథని మండలం పోతారం వరకు 29 కిలోమీటర్ల దూరం దాటింది.



కన్నెపల్లి పంపుహౌస్‌లో ఐదు మోటార్ల ద్వారా దిగువకు ప్రవహిస్తున్న నీరు

# రాష్ట్రాన్ని నాశనం చేశారు

- సీఎం కేసీఆర్‌పై ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధ్వజం
- బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు కోసం ఆగస్టు 15 నుంచి పాదయాత్ర



**చౌటుప్పల్/చిట్యాల:** వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇచ్చి రాష్టాన్ని సీఎం కేసీఆర్ సర్వనాశనం చేశారని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధ్వజమెత్తారు. బ్రాహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టును పూర్తి చేయకుంటే ఆగస్టు 15న ఉదయ సముద్రం ప్రాజెక్టు నుంచి హైదరాబాద్‌లోని జలసౌధ వరకు పాదయాత్ర చేస్తానని ప్రకటించారు. ఆదివారం చౌటుప్పల్, చిట్యాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా చినుకు జాడలేదని, ఎండలతో భూగర్భ జలాలు అడుగంటాయన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా లేకపోతే ఇంతటి పరిస్థితి ఉండేది కాదని పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు పెద్దపీట వేయడాన్ని చూసి కేసీఆర్ నేర్చుకోవాలని హితవు పలికారు. కరువు నిధులు ప్రకటించారని, రైతులకు ఉచితంగా బోర్లు వేసేందుకు రూ.200 కోట్లతో యంత్రాలు కొనుగోలు చేస్తున్నారని కొనియాడారు. దివంగత సీఎం రాజశేఖరరెడ్డి హయాంలో బ్రాహ్మణవెల్లంల ఉదయ సముద్రం ప్రాజెక్టును సాధిస్తే ఆ ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను కేసీఆర్ మంజూరు చేయడం లేదన్నారు.




# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- ఇద్దరు మావోయిస్టుల మృతి
- ఒక మహిళా మావోయిస్టు అరెస్ట్
- ఆయుధాలు, నిత్యావసర సామగ్రి స్వాధీనం

**చర్ల:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో ఆదివారం ఉదయం జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందగా, ఒక మహిళా మావోయిస్టును పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి.. దంతెవాడ జిల్లా కిరండోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుమియాపాల్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు ఛత్తీస్‌గఢ్ పోలీసులు, రిజర్వ్‌డ్ దళాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్‌ను చేపట్టారు. ఈ క్రమంలో గుమియాపాల్ సమీపంలోని అటవీ ప్రాంతంలో బలగాలకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరపడంతో పోలీసులు కూడా ఎదురు కాల్పులు జరిపారు. దాదాపు అరగంట పాటు ఇరు పక్షాల మధ్య హోరాహోరీగా ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఆ తర్వాత మావోయిస్టులు పారిపోగా ఘటనా స్థలంలో ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు, రెండు 303 రైఫిళ్లు, ఒక టిఫిన్ బాంబు, ఒక మొబైల్ ఫోన్, నిత్యావసర వస్తువులు లభ్యమయ్యాయి. మృతిచెందిన మావోయిస్టులలో ఒకరిని మలంగిర్ ఏరియా కమిటీ సభ్యురాలు మంగ్లీగా, మరొకరిని సీఎన్‌ఎం డివిజన్ కమాండర్ దేవాగా గుర్తించారు. వీరిద్దరిపై రూ. 5 లక్షల చొప్పున రివార్డు ఉంది. ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మృతి చెందగా సీఎన్‌ఎం సభ్యురాలు కోసి పట్టుబడింది. ఈ ఘటనతో సరిహద్దులో భద్రతను పెంచారు.


ఎదురుకాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టులు


చెట్ల కిందకు వంట చేసుకుంటున్న గ్రామస్తులు

## వర్షాల కోసం వనవాసం

**మోత్కూరు:** వర్షాలు లేకపోవడంతో గ్రామాల్లో ప్రజలు కప్పకాముడు, వరదపాశం, బొడ్రాయి, గ్రామ దేవతలకు జలాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దేవుడు కరుణించి వానలు కురవాలని, పంట పొలాలు సల్లంగా ఉండాలని ప్రజలు దేవతలను ప్రార్థిస్తున్నారు. అందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పొడిచేడు గ్రామస్తులు ఆదివారం ఉదయం లేచి వాకిళ్లు ఊడ్చకుండా, పొయ్యి వెలిగించకుండా వనవాసం వెళ్లారు. వానలు కురవాలని, పంటలు పండాలని చుట్టుకాముడు ఆడారు. బొడ్రాయి, గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. వరద పాశం పోసి సామూహికంగా నాకడం లాంటి కార్యక్రమాలు చేశారు. వ్యవసాయ బావుల వద్దే చెట్ల కింద వంటలు చేసి అక్కడే భోజనం చేశారు. గ్రామానికి కీడు తొలగిపోయి వానలు కురిసి పంటలతో కళకళలాడాలని గ్రామ దేవతలకు నైవేద్యాలు పెట్టి పూజలు చేశారు. సాయంత్రం ఇళ్లకు చేరుకుని వాకిళ్లు ఊడ్చుకుని కల్లాపి చల్లుకున్నారు. ఊరంతా వనవాసం వెళ్లడంతో గ్రామం నిర్మానుష్యంగా మారింది. ఊళ్లో ఏదైనా కీడు ఉంటే తొలగి వర్షాలు కురుస్తాయన్న నమ్మకంతో గ్రామం వదిలి వనవాసం వెళ్లినట్లు ఎంపీపీ దీటి సంధ్యారాణి సందీప్, సర్పంచ్ పేలపూడి మధు తెలిపారు.

## వాగులు దాటి వైద్య సేవలు..

**తిర్యాణి(ఆసిఫాబాద్):** ఏజెన్సీ గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక గిరిజనులు తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారు. కుమురంభీం జిల్లా తిర్యాణి మండలంలోని మారుమూల గ్రామాలకు నేటికీ రోడ్డు వసతి లేకపోవడంతో అత్యవసర సమయంలో వైద్యసేవలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అలాంటి సంఘటనే శనివారం చోటు చేసుకుంది. ఏఎన్‌ఎంలు ఆరు కిలోమీటర్ల దూరం నడిచి మండలంలోని గుండాల గ్రామస్తులకు వైద్య సేవలందించారు. మండల కేంద్రం నుంచి 15 కిలోమీటర్ల దూరం ఉన్న గుండాల గ్రామానికి వెళ్లాలంటే రెండు వాగులు దాటాలి.



బురదలో నడుచుకుంటూ వెళ్తున్న ఏఎన్‌ఎం

## అనాథ చెల్లికి అన్నలయ్యారు

- గుర్తు తెలియని యువతి మృతదేహానికి అంత్యక్రియలు
- మానవత్వాన్ని చాటుకున్న యువకులు

**జగిత్యాలజోన్:** దుండగుల చేతిలో హత్యకు గురైన అనాథ చెల్లికి జగిత్యాల 'హెల్పింగ్ హ్యాండ్స్'యువకులు అన్నలయ్యారు. వారం రోజులుగా జగత్యాల ఆస్పత్రి మార్చురీలో ఉన్న యువతి మృతదేహం కోసం ఎవరూ రాకపోవడం.. పోలీస్ విచారణలోనూ వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని అక్కడే భద్రపర్చారు. అయితే రోజు రోజుకూ శవం కుళ్లిపోతుండటంతో పోలీసులు ఖననం చేయాలని నిర్ణయించారు. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆస్పత్రికి చేరుకున్నారు. ఆ యువతితో ఎలాంటి బంధుత్వం లేకున్నా.. చెల్లిగా భావించారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించేందుకు అన్నలుగా ముందుకు వచ్చారు. సమాజంలో మానవత్వం ఇంకా బతికే ఉందని నిరూపించారు. వివరాల్లోకి వెళితే.. సుమారు 20 నుంచి 23 ఏళ్లు ఉండే ఓ యువతి మృతదేహం జగిత్యాల జిల్లా కొండగట్టు పరిసర ప్రాంతాల్లో వారం రోజుల క్రితం లభ్యమైంది. ఈనెల 7న పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి యువతి హత్యకు గురైందని తేల్చారు. అయితే ఆమెది ఏ ప్రాంతం, ఎక్కడి నుంచి వచ్చిందనే విషయాలు తెలుసుకునేందుకు పోలీసులు పలు రకాలుగా ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచారు. అయితే వారం రోజులైనా సంబంధీకులు ఎవరూ రాలేదు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంత్యక్రియలు చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో పోలీసులు అనాథ శవాలకు అంత్యక్రియలు చేసే జగిత్యాల హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థకు విషయాన్ని తెలిపారు. సంస్థ వ్యవస్థాపకుడు డెక్క శ్రవణ్, సభ్యులు అసుపత్రి నుంచి మృతదేహాన్ని తీసుకెళ్లి మోతె శ్మశానవాటికలో సంప్రదాయబద్ధంగా ఖననం చేశారు.





# పక్కింటి ఎండమావి

కథాసారం



**విచిత్రంగా ఉంది రామనాథం పరిస్థితి. ముందర అతనికి రమణ మూర్తి ఉషను చూసి పొందిన ఆశ్చర్యం ఎంతో సంతృప్తిని కలగ జేసింది. కానీ అతని కారు చూశాక ఆ సంతృప్తి తగ్గిపోయింది.**

**న్యూ** మార్కెట్లో ఉష కొన్న సామానులన్నీ ఆరు పేకెట్లయ్యాయి. కాస్మటిక్స్ పాకెట్స్ రెండు, చీరల దుకాణంలో తయారైన పాకెట్లు మూడు, ఆపిల్స్ మూడు కిలోలు కట్టిన పెద్ద కాగితపు సంచీ ఒకటి అన్నీ మోసేసరికి చేతులు నొప్పులు పెడుతున్నాయి రామనాథానికి.

'ఈమె ఖర్చు మనిషి' అనుకున్నాడు మనస్సులో, బయటికి అంటే కలిగే పరిణామాలను గురించి తెలుసును కనక. ఇప్పుడు ఆమె షాపింగ్ పూర్తి కాబోతోంది. ఇంతసేపూ ఈ భారం వహించి చిట్టచివర ఆమెకు తన పొరపాటు తెలియజెయ్యడంలో మంచి ఏమీ కనిపించలేదతనికి.

''బరువుగా ఉన్నాయా?'' అంది గ్రీటింగ్ కార్డుల షాపు వైపు దారి తీస్తూ.

''అబ్బే! లేదు'' అన్నాడు రామనాథం. ఆమె చిరునవ్వుతో అతన్ని మరోసారి ధన్యుణ్ని చేసి న్యూ ఇయర్ కార్డ్స్ చూడటంలో నిమగ్నం అయింది.

రెండేళ్ల నించి ఎన్నోసార్లు చూసినా, తనకి ఎప్పటికీ తనివి తీరదు. ఆమె వయస్సుతోపాటు, చిరునవ్వు, సౌందర్యమూ ఉత్కర్ష పొందుతున్నాయి.

మరో పది నిమిషాల తరువాత ఆమె ''సారీ! పోదాం పదండి'' అనడంతో స్వప్నలోకాల నుంచి న్యూ మార్కెట్ దుకాణాల మధ్యకి వచ్చి బయటికి నడిచాడు రామనాథం.

కారు వెనకసీట్లో సామానులు చక్కగా సర్దిపెట్టి నిలబడ్డాడు. స్టార్టు చేసి, ''నాతో వస్తారా?'' అంది.

''థాంక్స్. నేను రాను, కొంచెం పని ఉంది'' అని ఆమె వైపు చూసి నవ్వి, తలుపు జాగ్రత్తగా వేశాడు. కారు తలుపులు బాదడం అంటే ఆమెకి కోపం.

ఆమె విలాసంగా వెళ్లిపోయింది. ఆ వైపే చూస్తూ నిలబడ్డ రామనాథానికి భుజం మీద పడ్డ చెయ్యి మళ్లీ తెలివి తెప్పించింది.

''నేనోయ్! రమణమూర్తిని... జ్ఞాపకం లేదూ?''

''నువ్వు... మీరు... రమణమూర్తి?'' నత్తిలాగా అన్నాడు.

''ఇద్దరం మీ ఎలమంచిలి బడిలో అయిదో ఫారం చదువుకున్నాం...''

''ఓ మీరు...''

రమణమూర్తి నవ్వాడు. ''మీరేమిటోయ్! కలియక కలియక ఈ మహానగరంలో చిన్ననాటి స్నేహితుడివి కలిశావు. ఏం చేస్తున్నావ్?''

తేరిపార చూశాడు రామనాథం. తెల్లటి పంట్లాం, టెరిలిన్ బుష్ షర్టు. ఆరడుగుల ఎత్తు. పాతరోజులు జ్ఞాపకం వచ్చాయి. రమణమూర్తి స్కూల్లో పేరుమోసిన రౌడీగా ఉండేవాడు. ఆటల్లో ఫస్టు, చదువులో లాస్టును.

''ఇక్కడే ఒక ఫర్మ్‌లో ఉంటున్నాను, ఏషియాటిక్ ట్రేడ్స్‌లో.''

''ఉండటం ఎక్కడ?''

''భవానీపూర్‌లో. నువ్వు?''

రమణమూర్తి నవ్వాడు. ఎందుకో అర్థం కాలేదు రామనాథానికి.

''నేను... మెకంజీ కంపెనీలో పని చేస్తున్నాను, తెలుసుగా? ఫెయిర్లీ ప్లేసులో.''

అతనెందుకు నవ్వాడో ఈసారి అర్థం అయింది రామనాథానికి. ఇక్కడ ఉన్న పెద్ద కంపెనీల్లో అది ముఖ్యమైనది. ఈ మొద్దబ్బాయికి అంత మంచి కంపెనీలో ఉద్యోగం! అతని పక్కన తన అయిదడుగుల ఆరంగుళాల ఎత్తు సిగ్గు కలగజేస్తోంది.

''వెరీ గుడ్!'' అన్నాడు రామనాథం చివరికి.

మళ్లీ నవ్వాడు రమణమూర్తి. రామనాథానికి హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది, స్కూల్లో తనను తరచు హేళన చేస్తూ ఉండేవాడు ఇతను. ఒకసారి ఫుట్‌బాల్ ఆడటానికి వెడితే తాను కొంచెం పరాకుగా ఉన్నప్పుడు తన వీపుకి గురి చేసి బంతి గట్టిగా తన్నాడు. బోర్లాపడి లేస్తుంటే రమణమూర్తి సరీగా ఇలాగే నవ్వాడు. అదీకాక రమణమూర్తి దగ్గర ఖర్చులకు డబ్బులుండేవి. తన దగ్గర ఉండేవి కావు.

''పద, కాఫీ తాగుదాం!'' అన్నాడు రమణమూర్తి.

అప్రయత్నంగా జేబులో చెయ్యి పెట్టుకున్నాడు రామనాథం. గుండె జల్లుమంది. బట్టల దుకాణంలో ఇచ్చిన చిల్లర అరవై రూపాయలు జేబులో ఉన్నాయి.

ఆమెకి అవసరం వస్తే? ఆమె తిన్నగా ఇంటికి వెళ్లి ఉంటే పరవాలేదు కానీ, మరేమైనా కొనదలుచుకుంటే? మరుక్షణంలో అతనికి సంతోషం కలిగింది. సామాన్యంగా అయిదారు రూపాయలకన్నా తన దగ్గర ఉంచుకునే అలవాటు లేదతనికి. కానీ, ఈ వేళ రమణమూర్తి దగ్గర పరాభవం జరగకూడదు.

''పద!''

''కారు తీసుకువెడదాం!'' అన్నాడు రమణమూర్తి గడియారం చూస్తూ. రామనాథం ఎదురుగా ఉన్న టవర్ క్లాక్ చూశాడు. ఏడు దాటుతోంది. ఆమె తనకోసం ఎదురు చూస్తూ ఉంటుంది. కానీ...

''ఏం గడియారం చూసి అలాగ అయ్యావు? భార్యగారు దెబ్బలాడతారా?'' అన్నాడు లైట్‌హౌస్ సినిమా వైపు దారి తీస్తూ రమణమూర్తి.

''అబ్బే, అలాంటిది కాదు!'' అన్నాడు.

''ఆవిణ్ని చూసి అలాగే అనుకున్నాను. అద్భుతమైన అమ్మాయిని పెళ్లి చేసుకున్నావోయ్!'' అన్నాడు.

తెల్లబోయి చూసి, ''నువ్వెప్పుడు చూశావు?'' అన్నాడు రామనాథం.

''ఇందాకా నువ్వు సాగనంపుతూంటే చూశాను.''

వెయ్యి తలపులు ఒక్కసారిగా వచ్చాయి రామనాథం మనస్సులో. కానీ, ఉషను తలుచుకోగానే ముఖంలో విచిత్రమైన కాంతి వచ్చింది.

రమణమూర్తి లైట్ హౌస్‌కు ఎదురుగా పార్క్ చేసిన పెద్ద ఫోర్డ్ కారు తలుపు తీసి ''కూర్చో!'' అని అతన్ని ఆహ్వానించాడు.

''ఎంత బాగుంది నీ కారు!'' అన్నాడు అప్రయత్నంగా రామనాథం.

''కస్టమ్ మోడల్. ఎక్కడికి వెడదాము?''

''ట్రింకాస్‌కి పద!''

''అంతకన్న క్వాలిటీయే బాగుంటుంది''

''రెండూ అక్కడేగా. క్వాలిటీయే సరి.''

ఎంతో మృదువుగా కారు అయిదు నిమిషాల్లో పార్క్ స్ట్రీట్ చేరుకుంది. విచిత్రంగా ఉంది రామనాథం పరిస్థితి. ముందర అతనికి రమణమూర్తి ఉషను చూసి పొందిన ఆశ్చర్యం ఎంతో సంతృప్తిని కలగజేసింది. కానీ అతని కారు చూశాక ఆ సంతృప్తి తగ్గిపోయింది.

బీచ్ సాండ్విచ్, పకోడా, ఐస్‌క్రీమ్స్, కాఫీ ఆర్డరు చేశాడు రమణమూర్తి.

''అదృష్టవంతుడివి రామనాథం. నిన్ను ఎప్పుడు తలుచుకున్నా నీ సౌమ్యత, మంచితనం జ్ఞాపకం వస్తాయి. అప్పుడే అనుకునేవాణ్ని నువ్వు పైకి వస్తావని'' అన్నాడు పకోడా తింటూ రమణమూర్తి.

''నీకన్నానా?''

''నాది ఏముందిలే, బాధ లేకుండా గడిచిపోవడం తప్ప''

'మస్తుగా ఉన్నవాళ్లందరికీ ఇదే రోగం' అనుకుని, ''నువ్వు పెళ్లి చేసుకోలేదా?'' అన్నాడు రామనాథం.

''అనేక సమస్యల వల్ల...''

''పెళ్లి చేసుకుంటే అవే తీరుతాయి''

''నీలాగా అందరికీ అదృష్టం కలిసిరావద్దూ!''

సంభాషణ ఉష మీదకి నడవడం ఇష్టం లేదు రామనాథానికి. ''నీ కారు గొప్పగా ఉంది రమణమూర్తీ'' అన్నాడు.

''ప్చ్'' అన్నాడు రమణమూర్తి.

నలభై రెండు రూపాయల ఎనభై ఆరు పైసలు బిల్లు వచ్చింది. రమణమూర్తి బిల్లు తీసుకోబోయాడు. పీకపోయినా అతన్ని బిల్ తీసుకోనివ్వదలచుకోలేదు రామనాథం. ఐదు పది రూపాయల నోట్లు పడేసి బయటికి నడిచాడు.

''సిగరెట్ కావాలా?''

అర పాకెట్ తీసుకుని అతని కొకటి ఇచ్చి తానొకటి తీసుకున్నాడు రామనాథం.

''పద, నిన్ను డ్రాప్ చేసి వస్తాను'' అన్నాడు రమణమూర్తి. కొంచెం గాభరా పడ్డాడు రామనాథం.

''ఎందుకూ? నేను నడిచి వెళ్లిపోతాను. ఈ మహాపట్టణంలో నడవటం అంటే నాకు సరదా''

రమణమూర్తి బలవంతం చెయ్యలేదు. కారు స్టార్టు చేసుకుని, రామనాథానికి సలామ్ చెప్పి విసురుగా వెళ్లిపోయాడు.

రమణమూర్తి సలామ్ రామనాథాన్ని ఆకాశానికి ఎత్తేసింది. ఉషను గురించి చెప్పిన మాటలూ సంతోషపెట్టాయి. పార్క్ స్ట్రీట్‌లో నుంచి చౌరంగీ రోడ్‌కి వచ్చేసరికి అతని సంతోషం కొంచెం తగ్గింది. ఈ సాయంత్రం ఏభై ఎనిమిది రూపాయలు ఖర్చయింది. ప్రతీ పైసాకీ పూర్తి తృప్తి రాలేదని కాదు. కానీ...

ఉదయం వెడుతూంటే...

''బాబుని బడిలో వెయ్యాలి'' అంది కాంతం.

బడిలో వెయ్యడానికి బట్టలు కావాలి; పుస్తకాలు కొనాలి; ఆ డబ్బులుంటే నీకు ఒక్క మందైనా కొందును అనుకున్నాడు రామనాథం. తన దగ్గర ఎప్పుడూ ఉండదు డబ్బు. శేఠ్‌జీ ధర్మమా అని ఇంటర్ ఫెయిల్ అయినా ఆరువందలు దొరుకుతున్నాయి. ఈ కలకత్తాలో చావకుండా బతుక్కు వస్తున్నాడు.

ఏభై ఎనిమిది రూపాయలు!

ఎంత అవివేకం! రేపు పట్టుకువెళ్లి పూర్తి సొమ్ము ఇవ్వకపోతే ఉషాదేవి ఏమంటుంది? తనకంత గర్వం దేన్ని చూసుకుని? ఐశ్వర్యంలో తులతూగుతున్న రమణమూర్తితో తనకు పోటీ ఏమిటి?

పి.జి.హాస్పిటల్ దగ్గరకు వచ్చేసరికి పూర్తిగా కుంగిపోయాడు. తన బ్రతుక్కి నాలుగు రూపాయల సిగరెట్లేమిటి? జేబులో ఉన్న సిగరెట్ పాకెట్ కాలవలోకి విసిరాడు. రేపు ఏం సమాధానం చెబుతావు? ఈ ఉద్యోగం ఊడితే ఏం చేస్తావు? అతనికి రమణమూర్తి మీద కోపం వచ్చింది. బయటికిరాని ఏడుపుతో ఇంటికి చేరాడు రామనాథం.

'ఉషాదేవిని బ్రతిమిలాడాలి శేఠ్‌జీతో చెప్పవద్దని' అనుకున్నాడు ఇంట్లో కాలు పెడుతూ.

• • •

రమణమూర్తి గడియారం చూసుకున్నాడు. ఎనిమిదిన్నర కావస్తోంది. ఇంక సినిమా అయిపోతుంది.

కాలుస్తున్న బీడీ పారేసి, సీటు కింద నుంచి ఖాకీ కోటు తీసి తొడుక్కుని, అద్దంలో ముఖం చూసుకుని నిట్టూర్చాడు.

'మేమ్ సాహెబ్ ఇంక వచ్చేస్తుంది! సినిమా వదిలేశారు'

ఇచ్ఛాపురపు జగన్నాథరావు (1931–2017) 'ఎదురు అద్దాలు' సంక్షిప్త రూపం ఇది. 1999లో ప్రచురితం. జగన్నాథరావు కథలు 13 సంపుటాలుగా వెలువడినాయి. ఎదురు అద్దాలు ఒక సంపుటం పేరు కూడా. వానజల్లు, చేదు కూడా ఒక రుచే లాంటివి ఇతర సంపుటాలు.




ఇచ్ఛాపురపు జగన్నాథరావు

# ఎత్తయిన సిగ్గరి

రిచర్డ్ బ్రాటిగన్

గ్రేట్ రైటర్



ఆరడుగుల నాలుగు అంగుళాల ఎత్తు ఉండేవాడు రిచర్డ్ బ్రాటిగన్ (1935–1984). ఈ అమెరికా రచయిత రాసే అక్షరాలు మాత్రం చీమల్లా ఉండేవి. ఈ వైరుధ్యం ఆయన జీవితమంతా కొనసాగింది. డబ్బులున్నప్పుడు విలాసంగా బతికాడు, లేనప్పుడు బిచ్చగాడిలా ఉండటానికీ సిద్ధపడ్డాడు. తన ఎత్తుకు నప్పని సిగ్గరి కూడా. ఒక ఫ్యాక్టరీ కార్మికుడు, ఓ వెయిట్రెస్ సంతానం రిచర్డ్. ఇంకా రిచర్డ్ కడుపులో ఉన్నప్పుడే తల్లిదండ్రులు విడిపోయారు. తండ్రెవరో తెలియకుండానే పెరిగాడు. తర్వాత కూడా తల్లి ఒక స్థిరమైన బంధంలో కుదురుకోలేదు. దీనికి తోడు పేదరికం. ఈ బాల్య జీవితపు నిరాదరణ బ్రాటిగన్ మీద తీవ్రమైన ప్రభావం చూపింది. ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేసేవాడు. వ్యక్తిగత సంరక్షణ మీద దృష్టి ఉండకపోయేది. జైల్లో పడితేనైనా కడుపు నిండా తినొచ్చన్న ఆలోచనతో ఓసారి పోలీస్ స్టేషన్ కిటికీ మీదికి రాయి విసిరాడు. పోలీసులు పట్టుకుని, తీవ్రమైన వ్యాకులత, మనోవైకల్యంతో బాధ పడుతున్న అతడికి వైద్యం చేయించారు.

గొప్పవాడిలా కనబడాలని మార్క్ ట్వెయిన్‌లా మీసాలు పెంచుకున్న బ్రాటిగన్‌లో నిజంగానే చిన్నతనం నుంచే గొప్పతనం ఉంది. పన్నెండేళ్లప్పుడే కవిత్వం రాయడం ప్రారంభించాడు. వీధుల్లో, పొయెట్రీ క్లబ్బుల్లో తన కవిత్వం చదివేవాడు. వామపక్ష భావజాలంతో నడిచే వీధి నాటకాల సంఘం 'ద డిగ్గర్స్' కోసం రాసేవాడు. అప్పుడు రాసిన 'ట్రౌట్ ఫిషింగ్ ఇన్ అమెరికా'(1967) లక్షల కాపీలు అమ్ముడుపోయింది. 1960, 70ల నాటి అమెరికా ప్రభుత్వ వ్యతిరేక దశకు ఈ నవల అద్దం పట్టింది. రాత్రుళ్లు రాసి పగలు పడుకునే బ్రాటిగన్ కథల సంపుటితో పాటు 'ఎ కాన్ఫెడరేట్ జనరల్ ఫ్రమ్ బిగ్ సుర్', 'ఇన్ వాటర్‌మెలన్ షుగర్', 'సో ద విండ్ వోంట్ బ్లో ఇట్ ఆల్ అవే' లాంటి నవలలు వెలువరించాడు. జపాన్‌లో కూడా విపరీతమైన పేరు వచ్చింది. అయితే, ఉద్యమం వెనుకబాట పట్టిన తర్వాత బ్రాటిగన్ ఆదరణ కోల్పోయాడు. మద్యపానానికి బానిస కావడం, నిరంతర వ్యాకులత ఆయన్ని కూడా తల్లిలాగే ఏ ఒక్క వైవాహిక బంధంలోనూ, మొత్తంగా జీవితంలోనూ సౌకర్యంగా ఇమిడిపోనివ్వలేదు. దానికోసం ఆయన ప్రయత్నించినట్టు కూడా కనబడదు.

నడకను తప్ప వ్యాయామాన్ని ఇష్టపడేవాడు కాదు. అద్దంలో చూసుకోవడమంటే పిచ్చి. అప్పులు చెల్లించడంలో సోమరి. ఒక దశలో ఇంట్లో ఒంటరిగా ఉంటున్న బ్రాటిగన్ తన 49 ఏళ్ల వయసులో రివాల్వర్‌తో తలలోకి కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శరీరం కుళ్లిన కొద్ది రోజుల తర్వాతగానీ ఆయన చనిపోయిన వార్త ప్రపంచానికి తెలియలేదు. ఆయన వదిలివెళ్లిన ఆత్మకథాత్మక, వ్యంగ్యపూరిత అక్షరాల గంధం మాత్రం తర్వాత చాలా మంది రచయితల కలాలకు సోకింది.

# పెత్తనం పోయి కర్ర మిగిలింది

సాహిత్య మరమరాలు



**అ**బ్బూరి ఛాయాదేవి అబ్బూరి రామకృష్ణారావు కోడలు, వరద రాజేశ్వరరావు సహచరి అని అందరికీ తెలిసిందే. సన్నని లోగొంతుకతో, ఆగి ఆగి మాట్లాడే ఛాయాదేవి మాటల్లో మందుపూసిన కత్తివాదర లాంటి చమత్కారాలు తొంగిచూసేవి. భర్త చనిపోయాక, ఆయన వాడిన చేతికర్ర, వొంకీ పేముబెత్తాన్ని ఛాయాదేవి కూడా ఉపయోగించారు. ఒకసారి ఇంటికి వచ్చినవారు 'ఈ చేతికర్ర వరద గారిది అనుకుంటాను' అన్నారట. 'అవునండీ! పెత్తనం పోయింది, కర్ర మాత్రం మిగిలింది' అన్నారట ఛాయాదేవి.

ఇంట్లో వుండే పాత వస్తువులతో కళాకృతులు చేయటం ఛాయాదేవి హాబీ. ఒక రోజు ఆమె నిర్జీవంగా అనిపించిన చేతి కర్రకు తన చీరల్లోని ఒక రంగులపూల డిజైను వున్న అంచును కత్తిరించి కర్రకు పైనుండి కిందిదాకా అలంకరించారు. ఇంటికి వచ్చిన వారు ఎవరో 'ఏమిటీ, చేతికర్రకు చీర చుట్టారు' అని అడిగారట. అప్పుడామె తన సహజ ధోరణిలో 'ఈ కర్ర నిన్నటి దాకా మగకర్ర. నేటి నుండి స్త్రీవాది' అన్నారు.

ఒకరోజు పెళ్లినాటి మాటలు చర్చకు వచ్చి, 'నన్ను చౌకబారుగా కొట్టేశావు' అన్నారట వరద. 'అవును, మీరుండేది చౌకబారులో కదా' అని చురక అంటించారట ఛాయాదేవి.

సేకరణ: శిఖామణి

పదం పలికింది - పాట నిలిచింది

# గాలి ఇసిరికొడితే ఆ దీపముండదు



జాలాది

**తీ**రని దుఃఖాన్నీ, జీవితపు అశాశ్వతత్వాన్నీ, స్త్రీ గొప్పతనాన్నీ, పేదరికపు అక్రోశాన్నీ ఏకకాలంలో చిత్రించిన పాట. ప్రాణం ఖరీదు కోసం జాలాది రాసిన పాట. ఇందులో ఆయనది సింగిల్ కార్డ్. ఈ పాట పాడింది బాలసుబ్రహ్మణ్యం. సంగీతం చక్రవర్తి. చిరంజీవి మొదటి సినిమా. ఈ పాటలో కనబడేది సత్యనారాయణ. 1978లో వచ్చిన ఈ చిత్రానికి దర్శకుడు కె.వాసు.

యాతమేసి తోడినా యేరు ఎండదు
పొగిలి పొగిలి ఏడ్సినా పొంత నిండదు
దేవుడి గుడిలోదైనా పూరి గుడిసెలోదైనా
గాలి ఇసిరికొడితే ఆ దీపముండదు
ఆ దీపముండదు

పలుపుతాడు మెడకేత్తే పాడి ఆవురా
పసుపుతాడు ముడులేత్తే ఆడదాయెరా
కుడితి నీళ్లు పోసినా అది పాలుకుడుపుతాదీ
కడుపుకోత కోసినా అది మనిషికే జన్మ ఇత్తాదీ
బొడ్డు పేగు తెగిపడ్డా రోజు తలుసుకో
గొడ్డు కాదు ఆడదనే గుణం తెలుసుకో

అందరూ నడిసొచ్చిన తోవ ఒక్కటే
సీమునెత్తురులు పారే తూము ఒక్కటే
మేడ మిద్దెలో ఉన్నా సెట్టునీడ తొంగున్నా
నిదర ముదర పడినాకా పాడె ఒక్కటే
వల్లకాడు ఒక్కటే
కూత నేర్చినోళ్ల కులం కోకిలంటరా
ఆకలేసి అరసినోళ్లు కాకులంటరా

హాస్యప్రపంచం

కొత్త కథ రాద్దామని దీర్ఘంగా ఆలోచిస్తున్నానా?
''ఇంటికీ, గొడ్ల చావిడికీ పై కప్పులు'' తప్ప మరే వాక్యం తట్టట్లేదేవిటి సుస్మిత?



గ్రహం అనుగ్రహం

శ్రీ వికారినామ సంవత్సరం. ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు. ఆషాఢ మాసం. తిథి శు.చతుర్దశి రా.1.22 వరకు, తదుపరి పౌర్ణమి. నక్షత్రం మూల రా.7.28వరకు, తదుపరి పూర్వాషాఢ. వర్జ్యం సా.5.48 నుంచి 7.28 వరకు. దుర్ముహూర్తం ప.12.29 నుంచి 1.21 వరకు, తదుపరి ప.3.04 నుంచి 3.55 వరకు. అమృత ఘడియలు ప.12.51 నుంచి 2.30 వరకు

సూర్యోదయం : 5.37 సూర్యాస్తమయం : 6.32
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు
ఫజర్ : 4.29
జొహర్ : 12.22
అసర్ : 4.56
మగ్రీబ్ : 6.54
ఇషా : 8.15

# చీకటికి అలవాటుపడని కళ్లు

కొత్త బంగారం





రేవనిక్ ఓల్మీ

**'మ**మ్మల్నెవరూ చూడకుండా చీకటి పడ్డాక, ఆఖరి బస్సెక్కాం.' కొడుకులైన తొమ్మిదేళ్ల స్టాన్, స్టాన్ సవితి తమ్ముడైన కెవిన్‌ని వెంటబెట్టుకుని– పేరుండని ఊరి నుంచి, అజ్ఞాతమైన ఊర్లో ఉన్న సముద్రతీరానికి బయల్దేరుతుంది 'ఆమె.' ఫ్రెంచ్ రచయిత్రి రేవనిక్ ఓల్మీ రాసిన 'బిసైడ్ ది సీ' నవలికలో– 'అది పిల్లల ఆఖరి ప్రయాణమని ఆమెకు తెలుసు'.

'ఉన్న డబ్బంతా మార్చి చిల్లర' తెచ్చుకుంటుంది. తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకోదు. 'నా ఊడిన పళ్ళ వల్ల నోటికి చెయ్యడ్డం పెట్టుకోకుండా నవ్వలేను' అనే ఆమె– కలుసుకునే సామాజిక కార్యకర్త, ఆస్పత్రి ప్రస్తావన వంటి స్వల్ప సూచనలు తప్ప, ఆమె నేపథ్య వివరాలేమీ ఉండవు. పేరు తెలియని మానసిక రోగానికని మందులు తీసుకుంటుంటుంది. వాటినీ పట్టుకెళ్లదు.

''పొద్దున్నే పిల్లల్ని స్కూల్లో దింపే ఓపిక నాకుండదు. 'స్టాన్ నన్ను తీసుకెళ్తే నాకెప్పుడూ ఆలస్యం అవదు,' అంటాడు కెవిన్. తిన్న ప్రతిసారీ పళ్ళు తోముకోవాలని తన టీచర్ చెప్పిందంటాడు స్టాన్. వాడికి ఆత్మవిశ్వాసం ఎక్కువవుతోంది. క్రూరమైన లోకంలో ఇమిడిపోతున్నాడు. నా మినహా, సమర్థవంతుడెలా అవుతున్నాడు?'' అనుకునే ఆమెకు అభద్రత కలుగుతుంది. ప్రయత్నించినాగానీ, మానసిక పొందిక చేతనవదు.

పిల్లలకు 'విశేషమైన చివరి రోజు' అందించేందుకు– ఉన్మాదిలా, అలిసిపోయేవరకూ వాళ్ళను తిప్పుతుంది. హాట్ చాక్లెట్, భోజనం కొనడం కూడా కష్టమైన పనామెకు. చివర్న, తిరునాళ్ళలో 'గంటల మ్రోత ఆగడం లేదు. ఎంత వానో, ఎంత శబ్దమో, ఎన్ని లైట్లో! అన్ని దిక్కులనుండీ జనాలు వచ్చేస్తున్నారు. అన్నీ కొనేయగలంత డబ్బెక్కడ నుండి వచ్చింది వారికి?' అనడుగుతుంది. 'ఇక ఇంటికి పోదాం' అని స్టాన్ మృదువుగా చెప్తాడు.

లోకం చీకటితో నిండి ఉందనీ, జీవించేందుకు అనుకూలమైనది కాదనీ ఆమె ఏర్పరచుకున్న అభిప్రాయం గట్టిపడుతుంది. కొడుకులు పెద్దయితే, తనకి ఎదురయిన నిరాశ, ఒంటరితనమే వారూ అనుభవిస్తారని ఊహించుకుంటుంది. వారిని కాపాడుకోవాలనుకుంటుంది.

హోటెల్లో, వారికి ఊపిరాడకుండా చేసి చంపేస్తుంది. 'నాకైతే చనిపోయిన పిల్లలిద్దరున్నారు. వాళ్ళకేముంది! దుప్పట్లు, కంబళ్ళ మధ్య దాగున్న వారి శరీరాలను చూడ్డానికి నిలుచున్నాను. కెవిన్ శరీరం బంతిలా ముడుచుకునుంది. స్టాన్‌ది జాచుకొనుంది. కెవిన్ మొహం గోడవైపు తిరిగి ఉంది, స్టాన్‌ది కిటికీ వైపు. మరణం యందు కలిసే ఉంటారనుకున్నాను. నేనిది ఊహించలేదు.' ఆ ఆరవ అంతస్తు కిటికీ బయటకి చూసి, 'వాన నాకింద ఉన్నవారికోసం కురుస్తోంది. నేను వీటన్నిటికీ పైన ఉన్నాను' అంటుంది.

చైతన్య స్రవంతిలో సాగే వాడుక భాష కథనం, ఆమె చదువుకున్నది కాదని సూచిస్తుంది. తల్లి ప్రేమకుండే శక్తికీ, తల్లి బాధ్యతలు నిర్వర్తించలేకపోయే పర్యవసానాలకీ మధ్యనుండే సంఘర్షణను ఎత్తి చూపుతుంది నవలిక.

'పిల్లలకు తిరునాళ్ళలో చిప్స్ తినిపించి, చంపేసిన తల్లి' అన్న వార్తాపత్రిక శీర్షిక చదివిన తరువాత, 'పిచ్చితనం' వంటి సాధారణీకరణాలని పట్టించుకోకుండా– ఏ ఆలోచనా రుగ్మత, సొంత పిల్లల ప్రాణాలను సైతం తీయడానికి ప్రేరేపిస్తుందో అని అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తూ– నాటకకర్తా, రచయిత్రీ అయిన ఓల్మీ యీ పుస్తకం రాశారు. 'ఇలాంటి విషాదాలని అరికట్టాలంటే, మానసిక అనారోగ్యపు సంక్లిష్టతలను అర్థం చేసుకోవాలి' అంటారామె. 120 పేజీల యీ నవలికను, యేడ్రియానా హంటర్ ఇంగ్లిష్‌లోకి అనువదించారు. దీన్ని 2010లో ప్రచురించినది ప్రిరనీ ప్రెస్. తొలి ప్రచురణ 2001లో.

ఫ్రెంచ్‌లో 'బార్డ్ డె మేర్' పేరుతో వచ్చిన యీ పుస్తకం ఎన్నో యూరోపియన్ భాషల్లోకి అనువదించబడింది. ఇంగ్లిష్‌లోకి ప్రచురించడానికి మాత్రం చాలాకాలం ఎవరూ ముందుకు రాలేదు. యీ అనువాదానికి అనువాదకురాలు 'స్కాట్ మోన్క్రీఫ్' బహుమానం పొందారు.

◆ కృష్ణ వేణి

రారండోయ్

- కె.సురేష్, మహమ్మద్ ఖదీర్‌బాబు సంపాదకులుగా తెస్తున్న 'కొత్త కథ 2019' ఆవిష్కరణ సభ జూలై 21న ఉదయం 10:45గం.కు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియం, నాంపల్లి, హైదరాబాద్‌లో జరగనుంది. ఆవిష్కర్త: తమిళ రచయిత అరాత్తు. వక్తలు: కాత్యాయని, ఎన్.వేణుగోపాల్, జి.లక్ష్మీనరసయ్య, డానీ. ఇందులోనే పి.సత్యవతి, అల్లం రాజయ్య, విహినమూర్తికి కథా మార్గదర్శి జ్ఞాపికలు బహూకరిస్తారు. నిర్వహణ: రైటర్స్ మీట్ పబ్లికేషన్స్.
- సాహిత్య అకాడమీ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త నిర్వహణలో 'నా దృష్టిలో' పేరుతో జూలై 16న సాయంత్రం 5:45 గం.కు రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్లో జరిగే కార్యక్రమంలో 'అబ్బూరి ఛాయాదేవి: జీవితము–సాహిత్యము' అంశంపై సి.మృణాళిని ప్రసంగిస్తారు.
- కీ.శే. వింజమూరి అచ్యుతరామయ్య కవితా సంపుటి 'అమ్మ పుట్టిన ఊరు' ఆవిష్కరణ సభ జూలై 21న సాయంత్రం 5 గంటలకు కాకినాడలోని గాంధీభవన్‌లో జరగనుంది. ఆవిష్కర్త: శిఖామణి. నిర్వహణ: కవిసంధ్య సాహిత్య సాంస్కృతిక సంస్థ.
- తండ హరీష్ గౌడ్ కవితా సంపుటి 'నీటిదీపం' ఆవిష్కరణ సభ జూలై 21న సాయంత్రం 5:30 గం.కు సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరగనుంది. ఆవిష్కర్త: కె.శివారెడ్డి. ముఖ్య అతిథి: జూలూరు గౌరీశంకర్. నిర్వహణ: తెలంగాణ సాహితి, కవి సంగమం, శారద ఫౌండేషన్.
- 'మహాకవి డాక్టర్ గడియారం వేంకట శేషశాస్త్రి అవార్డు' కోసం 2014 నుండి ప్రథమ ముద్రణ పొందిన పద్యకావ్యాల మూడు ప్రతులను ఆగస్ట్ 16 లోగా పంపాల్సిందిగా రచన సాహిత్య వేదిక కార్యదర్శి కోరుతున్నారు. అవార్డు నగదు 5 వేలు. చిరునామా: డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, ఎంఐజీ హెచ్–73, హౌసింగ్ బోర్డ్ కాలనీ, కడప–516004. ఫోన్: 9966624276
- మల్లెతీగ పురస్కార, అరిగపూడి పూర్ణచంద్రరావు స్మారక కథల పోటీ బహుమతుల ప్రదానోత్సవ సభ జూలై 18న సాయంత్రం 5 గంటలకు విజయవాడ గాంధీనగర్‌లోని ఐలాపురం ఏసీ హాలులో జరగనుంది. ముఖ్య అతిథి: జస్టిస్ టి.రజని.


ఈవారం పుస్తకాలు

## రవీంద్ర గీతాంజలి



అనుసృజన: కమలేకర్ రామచందర్‌జీరావు; పేజీలు: 136; వెల: 80; ప్రతులకు: కవి, 3–14, అయోధ్య నగర్ కాలనీ, క్రిస్టియన్ పల్లి, మహబూబ్‌నగర్–509001. ఫోన్: 7013638332

## కాకీక కాకికి కాక




రచన: పాలపర్తి ఇంద్రాణి; పేజీలు: 88; వెల: 80; ప్రచురణ: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా; ప్రతులకు: పాలపర్తి సువర్ణలత, 502, ఏపీహెచ్‌బీ టవర్స్, దుర్గాపురం, విజయవాడ–520003.

## గడ్డిభుక్త సీతారాం పాడిన పాటలు, జావళీలు (సీడీతో)




సంపాదకుడు: మోదుగుల రవికృష్ణ; పేజీలు: 34; వెల: 150; ప్రతులకు: రిందా శరణ్య కూచిపూడి డాన్స్ అకాడమీ, 7–1–32/5/5, లీలా నగర్, బేగంపేట్, హైదరాబాద్–16. ఫోన్: 9441185443

## మనసున్న మనసులు (నవల)




రచన: శారదా శ్రీనివాసన్; పేజీలు: 130; వెల: 130; ప్రతులకు: క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్, 1–8–725/ఎ/1, 103సి, బాలాజీ భాగ్యనగర్ అపార్ట్‌మెంట్స్, నల్లకుంట, హైదరాబాద్–44; ఫోన్: 9848065658. రచయిత్రి ఫోన్: 9441010396

## 'పెట్టుబడి' రెండవ సంపుటం అర్థం చేసుకోవడం ఎలా?



మూలం: జాన్ ఫాక్స్; తెలుగు: గుడిపూడి విజయరావు; పేజీలు: 112; వెల: 75; ప్రతులకు: నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్, ఎమ్.హెచ్.భవన్, ప్లాట్ నం. 21/1, అజామాబాద్, హైదరాబాద్–20. ఫోన్: 040–27665420

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083



మహాసముద్రంలో...
– సినిమా పేజీలో

# నలుగురు ఓహ్ బేబీలు



● కుంభం రేణుక

● 'ఓహ్ బేబీ'లో సమంత, లక్ష్మి



● నానుబాల భారతి



● షీలా జోసెఫ్

**జీవితం అరిగిపోయిందని.. సారం కరిగిపోయిందని.. స్వప్నం చెదిరిపోయిందని.. ఆశ ఇంకిపోయిందని.. అవకాశం ఆవిరైపోయిందని.. నడివయసు నైరాశ్యం నుంచి బయటపడ్డ నలుగురు ఓహ్.. బేబీల కథ ఇది!!**

**బే**బీకి డెబ్బై ఏళ్లు. మంచి గాయని కావాలనేది చిన్నప్పటి నుంచీ ఉన్న లక్ష్యం. సంగీతమూ నేర్చుకోవడానికి వెళ్తుంది. కాని సంప్రదాయ కుటుంబంలోని తండ్రి.. పాటలుగీటలు అంటూ ఆడపిల్ల బయటకు వెళ్లడమేంటంటూ ఆమె చెంపలు వాయించి ఇంట్లో కూర్చోబెడ్తాడు. తండ్రిని ఏమీ అనలేక దేవుడిని తిట్టుకుంటుంది. ప్రేమించిన అబ్బాయిని పెళ్లిచేసుకొని అయినా తన లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలనుకుంటుంది. కాని పెళ్లయిన యేడాదికే భర్త చనిపోతాడు. అనుకున్న జీవితం అటకెక్కి.. అనుకోని కష్టం ముందు పడ్తుంది. వంటలు చేసుకుంటూ కష్టపడి పిల్లాడిని పెంచి పెద్దచేస్తుంది. అతనికీ పెళ్లయి.. పిల్లలు పుడ్తారు. ఎప్పటికప్పుడు పెరుగుతున్న బాధ్యతల్లో తనను ముంచుతున్న దేవుడిని తిట్టుకోవడం తప్ప బేబీకి తనకంటూ ఏమీ మిగిలి ఉండదు. గాయని కావాలనుకున్న.. కావాలన్న తపన మెదడు అట్టడుగుపొరల్లో రగులుతూనే ఉంటుంది. లైఫ్‌పట్ల తీవ్ర అసంతృప్తితో ఉంటుంది. అప్పుడు దేవుడు ఆమెకు ఓ అవకాశం ఇస్తాడు.. డెబ్బై ఏళ్ల ఆ ముసలావిడకు ఇరవై ఏళ్ల యవ్వనాన్నిస్తాడు. నచ్చినట్టు బతుకుతూ అనుకున్నది సాధించమని ఆశీర్వదిస్తాడు. ఆ బేబీ గాయని అవుతుంది.

ఇది ''ఓహ్.. బేబీ'' సినిమా సారాంశం క్లుప్తంగా! రియల్‌లైఫ్‌లో బేబీ లాంటి వాళ్లు చాలా మందే ఉంటారు. ఎటొచ్చీ ఆమెకు దొరికిన వరమే.. ప్రాక్టికల్‌గా అసాధ్యం. అయినా రెండు జీవితాలు అనుభవించిన, ఆస్వాదించిన వాళ్లుంటారు.. ఉన్నారు కూడా. పెళ్లి, పిల్లల పెంపకంతో తమ ఆశలు,ఆశయాలు ఆవిరైపోకుండా.. హ్యాండ్‌బ్యాగ్‌లో అట్టేపెట్టుకొని.. మూడుముళ్ల బంధం ముడి వేసిన కర్తవ్యాన్ని నిర్వర్తించాక ఆ హ్యాండ్‌బ్యాగ్‌ను భుజానికి, అందులోని ధ్యేయాన్ని మనసుకు బదిలీ చేసుకొని సాధించిన అమ్మల గురించే ఈ కథనం..

గోల్స్ అంటే ఎవరెస్ట్ శిఖరం అధిరోహించడం, ఫ్రీదా ఖాలో అంతటి ఆర్టిస్ట్ అవడం, ఇంగ్లిష్ చానల్ ఈదడం, ప్రపంచమంతా పాదయాత్ర చేయడం, క్లియోపాత్ర కిరీటాన్ని పెట్టుకోవడం, టాటా, బిర్లా, అంబాని, అదానీలకు దీటుగా వ్యాపారం చేయడం లాంటివే కానక్ఖర్లేదు కదా... చిన్నప్పటి నుంచీ తాము అనుకున్నవి మ్యారేజ్ వల్ల దారి తప్పి.. మళ్లీ వాటి జాడను పట్టుకొని గాడిలో పెట్టుకునేవి కూడా కదా! అలాంటి వాటినే అఛీవ్ చేసిన రియల్ లైఫ్ ఓహ్ బేబీలు వీళ్లు...

## మిసెస్ ఫొటోజెనిక్.. కుంభం రేణుక

**కుం**భం రేణుక వయసు నలభై పైనే. పుట్టింది తెలంగాణలోని సిద్ధిపేటలో.. పెరిగింది కరీంనగర్‌లో. రేణుకను డాక్టర్ చెయ్యాలని ఆమె తండ్రి అనుకున్నారు. రేణుకకేమో అందాల పోటీల్లో పాల్గొనాలని, ఒక్కసారైనా ర్యాంప్ మీద నడవాలనే ఆకాంక్ష. కాని ఆమె సంప్రదాయ కుటుంబం ఆ కోరికను కనీసం ఆమె కలలోకి కూడా రానివ్వకుండా మెడిసిన్ ఎంట్రన్స్ కోసం కోచింగ్‌కు పంపించింది. కష్టపడ్డా ఫలితం దక్కలేదు. దాంతో బీఎస్సీ మైక్రోబయాలజీలో చేరింది. అప్పుడే మంచి సంబంధం రావడంతో వెంటనే పెళ్లిచేసేశారు. అయినా చదువును కంటిన్యూ చేశారు రేణుక. భర్త కుంభం సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగి. తరచూ ట్రాన్స్‌ఫర్స్ అవుతూన్నా చదువుకి ఫుల్‌స్టాప్ పెట్టలేదు. అందాల పోటీల్లో పాల్గొనాలనే కోరికా పోలేదు. పిల్లలు పుట్టారు. పెద్దవాళ్లవుతున్నారు. టీవీల్లో బ్యూటీ కాంటెస్ట్‌లు ఎప్పుడు టెలికాస్ట్ అయినా ఆసక్తిగా చూసేవారు. వయసు రీత్యా కాస్త ఒళ్లు రావడంతో శ్రద్ధగా వ్యాయామం చేసి బరువు తగ్గారు. యోగాలో తర్ఫీదు తీసుకున్నారు.దాంతో ఆమె ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. పెద్ద అబ్బాయి ఇంజనీరింగ్ ఫైనలియర్‌కు వచ్చాక.. తల్లి ఇంట్రెస్ట్ గమనించి మిసెస్ కర్ణాటక బ్యూటీ కాంటెస్ట్‌లో పాల్గొనమని ఎంకరేజ్ చేశాడు. ఆ పోటీలకు సంబంధించిన వివరాలు, సమాచారం అన్నీ సేకరించి తల్లికిచ్చాడు. దరఖాస్తు చేసుకున్నాక తన భర్తకు చెప్పారు రేణుక. సరే అన్నారు ఆయన. భర్త, పిల్లల ప్రోత్సాహంతో మాగ్నా పబ్లికేషన్స్ నిర్వహించిన మిసెస్ ఇండియా పోటీల్లోనూ (ఇటీవలే) పార్టిసిపేట్ చేశారు. ఫైనల్స్‌కు చేరి మిసెస్ ఫొటోజెనిక్ ఫేస్ టైటిల్ గెలుచుకున్నారు. చిన్నప్పటి కల నెరవేర్చుకున్నారు. రేణుక సుప్రసిద్ధ చిత్రకారుడు కాపు రాజయ్య మనవరాలు. ''మా తాత గొప్ప ఆర్టిస్ట్ అయినా నా మీద మా అమ్మమ్మ ఇన్‌ఫ్లుయెన్స్ ఎక్కువ. ఆవిడ చాలా స్ట్రాంగ్. పట్టుదల మనిషి. అమ్మమ్మే నాకు ఇన్స్పిరేషన్. మన సంకల్పం గట్టిదైతే పెళ్లి, పిల్లలు హార్డిల్స్ కావు, కారు. అఫ్‌కోర్స్.. ఆ రెస్పాన్సిబిలిటీస్‌తో మన ఎయిమ్ వెనకబడొచ్చు.. తర్వాత పర్స్యూ చేసుకోవాలి. లేకపోతే మనకు మనం మిగలం. మనల్ని మనం ప్రేమించుకోవాలి. నేను బ్యూటీకాంటెస్ట్‌లో పోటీ చేస్తున్నానని తెలిసినప్పుడు చాలా మంది చాలారకాలుగా కామెంట్ చేశారు. పట్టించుకోలేదు. విని ఉంటే నా కలను ఎక్స్‌పీరియెన్స్ చేసేదాన్నే కాదు. ఆ పోటీలో పాల్గొనడం వల్ల కొత్త ప్రపంచం తెలిసింది. చాలా మంది పరిచయం అయ్యారు. నా కాన్ఫిడెన్స్ లెవెల్స్ పెరిగాయి. ఒక కొత్త రేణుకను చూసుకోగలుగుతున్నా. ప్రస్తుతం నా ఇంకో ఎయిమ్ మీద దృష్టిపెట్టా.. అదే యోగా ట్రైనింగ్. చాలామంది ఆడవాళ్లు పెళ్లి, పిల్లలు కాగానే అంతా అయిపోయిందని తమని తాము పట్టించుకోరు. అలాంటి వాళ్లను మోటివేట్ చేసి వాళ్లలో హెల్త్ కాన్షస్ తీసుకురావాలనుకుంటున్నా. ఓ నలుగురిని మోటివేట్ చేయగలిగినా..నేను హ్యాపీ'' అంటారు కుంభం రేణుక.

## బైక్ రైడర్.. కూర్మ నాగమణి



● కూర్మ నాగమణి

**కూ**ర్మ నాగమణి.. వయసు.. అరవై. స్వస్థలం హైదరాబాద్. బైక్ రైడింగ్ అండ్ పాలిటిక్స్ అంటే చిన్నప్పటి నుంచీ ఇంట్రెస్ట్. భర్త సహకారంతో పాలిటిక్స్‌లో అడుగుపెట్టి కౌన్సిలర్‌గా పనిచేశారు. కాని బైక్ రైడింగే తనకు అరవయ్యో యేడు వచ్చే వరకు ఆగాల్సి వచ్చింది. చిన్నప్పటి నుంచి కళ్లముందు రయ్‌మంటూ టూ వీలర్స్ వెళ్తుంటే మనసు కొట్టుకునేది.. నడపాలని. కాని సాధ్యపడలేదు. పెళ్లయ్యాక కూడా ఆమె బండీ నడపాలనే కాంక్షను ఎవరూ పెద్దగా పట్టించుకున్నట్లు లేదు ఆమె రాజకీయాల్లోకి రావాలనే ఇష్టాన్ని పట్టించుకున్నంతగా. నలుగురు పిల్లలు (ముగ్గురు అబ్బాయిలు, ఒక అమ్మాయి) పుట్టారు. వాళ్లూ బండి నేర్చుకున్నారు.. ఆమెకు ఆ అవకాశం రాలేదు. పెళ్లిళ్లయి కోడళ్లు, అల్లుడు వచ్చారు. స్థిరపడ్డారు. ఈలోపు ఆమె అరవయ్యోపడిలో పడ్డారు. అప్పుడు ఇక ఆగలేదు. ఈ వయసులో బండి ఏంటమ్మా అని లర్నింగ్ లైసెన్స్ కోసం వెళ్లిన ఆమెను ఆర్టీఓ సిబ్బంది నిరాశ పర్చినా రివర్స్ గేర్ వేయలేదు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కావాలని.. హార్డిల్ పెట్టినా.. దాటేశారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తెచ్చారు.. లర్నింగ్ లైసెన్స్ పొందారు. తాను బండీ నడపడమే కాక.. తన ఈడువాళ్లనూ ఎంకరేజ్ చేస్తున్నారు నేర్చుకొమ్మని. ''పనులకు ఆడ, మగ తేడా ఉంటదా? ఉండదు. ఈత రావడం ఎంత అవసరమో డ్రైవింగ్ కూడా అంతే అవసరం. ఆడవాళ్లకైనా మగవాళ్లకైనా! నా ఈడు వాళ్లు కొంతమంది ముందు భయపడ్డారు. నేనే నేర్చుకోగాలేంది మీకు రాదా? అని వాళ్ల భయం పోగొట్టిన. మన పనులు మనం చేసుకుంటే ఎంత ఆనందం! ఎటైనా వెళ్లాలంటే ఇప్పుడు ఎవరిమీదా ఆధారపడాల్సిన పని లేదు.. బండీ తీసి కిక్ కొడితే చాలు. కారు డ్రైవింగ్ కూడా నేర్చుకుంటా'' అంటారు ఎంతో ఆత్మవిశ్వాసంతో నాగమణి.

## ఆర్టిస్ట్.. నానుబాల భారతి

**నా**నుబాల భారతి బార్న్ ఆర్టిస్ట్. స్వస్థలం కడప. ఉగ్గుపాలతో ఒంటబట్టిన కళ. భారతి వాళ్లమ్మ కూడా ఆర్టిస్టే. ఆమె ఆయిల్ పెయింటింగ్స్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్ చేస్తుంటే చూస్తూ పెరిగారు భారతి. అందుకే చిన్నప్పుడే బొమ్మలు వేయడం వచ్చేసింది ఆమెకు. స్వతహాగా అబ్బిన కళ, తల్లిని చూస్తూ పెంచుకున్న నైపుణ్యంతో అద్భుతమైన పెయింటింగ్స్ వేయడం మొదలుపెట్టారు. డిగ్రీ పూర్తయ్యే సరికి ఆమె ఆర్ట్‌కు ఓ గుర్తింపూ వచ్చింది. ఆ ప్రవృత్తిని సీరియస్‌గా తీసుకోవాలి అనే సమయానికి పెళ్లి అయిపోయింది. భర్త గండికోట రమేశ్‌కు సౌదీలో ఉద్యోగం. కొత్త చోటు, ఆమె పాతబడడానికే చాలా కాలం పట్టింది. ఈలోపు పిల్లలు. అందరి తల్లుల్లాగే ఆమెకూ పిల్లలే ప్రాధాన్యమయ్యారు. అక్కడి నుంచి భర్త ఉద్యోగం దుబాయ్‌కు మారింది. కాని ఆమె ప్రయారిటీస్ మారలేదు. కాన్వాస్, కుంచె రెస్ట్ మోడ్‌లోకి వెళ్లిపోయాయి. పాప యుక్తా ఫ్యాషన్ స్టడీస్‌లో డిగ్రీ, బాబు హేమంత్ ట్వల్త్ స్టాండర్డ్‌లోకి రావడంతో భారతికి కాస్త ఖాళీ సమయం దొరికింది. ఆర్ట్ ఎగ్జిబిషన్స్‌కు వెళ్లడం స్టార్ట్ చేశారు. ఆ ఉత్సాహం, భర్త ప్రోత్సాహంతో మళ్లీ కుంచెకు కళ తెచ్చారు భారతి. అందమైన ఆయిల్ పెయింటింగ్స్‌తో తన ఉనికిని చాటుకుంటున్నారు. త్వరలోనే ఎగ్జిబిషన్ పెట్టాలనే ప్లాన్‌లోనూ ఉన్నారు. బొమ్మలే కాదు.. డ్రెస్, జ్యూయెలరీ డిజైనింగ్‌కీ భారతి క్రియేటివిటీని కేరాఫ్‌గా చెప్పుకోవచ్చు. ''పెద్దయ్యాక ఏమవుతావ్ అంటే ఆర్టిస్టే అనుకునేదాన్ని. అదే నా లోకం. అయితే ఆడవాళ్లు అనుకున్నది సాధించాలంటే ముందు వైఫ్‌గా, మదర్‌గా ప్రూవ్ చేసుకోవాల్సి ఉంటుంది. తర్వాతే మన గోల్. తప్పదు.. మన ప్రయార్టీస్ అలా సెట్ అయ్యుంటాయి. ఇప్పటికైనా పర్స్యూ చేసుకునే చాన్స్ వచ్చింది. మావారూ మంచి ఆర్టిస్టే. సో.. అర్థంచేసుకొని.. ఎంకరేజ్ చేస్తున్నారు'' అంటారు భారతి.

## వీ స్టార్.. షీలా జోసెఫ్

**షీ**లా జోసెఫ్. వయసు అరవై పైనే. స్వస్థలం కేరళ. బిజినెస్‌లో రాణించాలనేది చిన్నప్పటి నుంచీ వెంటాడుతున్న కల. టీన్స్‌లోనే పెళ్లయిపోయింది. పిల్లలు, కుటుంబ బాధ్యతలు షరామామూలే. భర్త యోసెఫ్.. వీ గార్డ్ సంస్థ యజమాని. పిల్లలు స్థిరపడ్డాక.. మనసులో మాట బయటపెట్టారు షీలా భర్త దగ్గర. ''వేరే ఎందుకు నాకే తోడుగా ఉండు నా వ్యాపారంలో'' అన్నాడు భర్త. అతని మాట ప్రకారమే కొన్నాళ్లు ఆ బిజినెస్ వ్యవహారాల్లో భర్తకు తోడుగా ఉన్నారు. కాని అది ఆమెకు నచ్చలేదు. ఆమెకు గార్మెంట్ బిజినెస్ అంటే ఇష్టం.. ఇంట్రెస్టునూ. సొంతంగా పెట్టుకుంటాను అంది. భర్త దగ్గరే వడ్డీకి 20 లక్షలు అప్పు, భర్త పాత ఆఫీస్‌నే అద్దెకు తీసుకున్నారు. పది మంది ఉద్యోగులతో పని ప్రారంభించారు. ఏడాది తిరిగేలోపు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. భర్తకు వడ్డీ, రెంట్ కట్టలేని పరిస్థితి. ఇలా కాదని ఆ రేడీమేడ్ బట్టలను ఎప్పుడో తన భర్త రిజిస్టర్ చేసుకున్న వీ స్టార్ అనే లేబుల్ కింద అమ్మడం మొదలుపెట్టారు. కొత్తలో కొంత కష్టమైనా తర్వాత సాఫీగా సాగింది. అయితే వీ స్టార్‌ని భర్త ఎలక్ట్రికల్స్ కంపెనీ అయినా వీ గార్డ్‌కు సిస్టర్ ఆర్గనైజేషన్ అనుకునేవారట వీ స్టార్ ఎంప్లాయ్స్. దాంతో ఆమె వీ గార్డ్ కంపెనీ ఉద్యోగులకు సమానమైన జీతాలను తన ఉద్యోగులకూ ఇవ్వాల్సి వచ్చిందట. తర్వాత వీ స్టార్ అండర్‌గార్మెంట్స్ ప్రొడక్షన్‌నూ స్టార్ట్ చేశారు. ఇప్పుడు అదే ఆ కంపెనీ యూఎస్‌పీ అయింది. స్త్రీల అండర్‌గార్మెంట్స్‌కి సంబంధించి వీ స్టార్ ఇప్పుడొక పాపులర్ బ్రాండ్. రెండు కోట్లతో మొదలై ఇప్పుడు 75 కోట్ల రూపాయల టర్నోవర్‌కు చేరింది. ఇది మొదలుపెట్టిన నాలుగేళ్లలో భర్త దగ్గర తీసుకున్న అప్పు తీర్చేశారు షీలా.. వడ్డీతో సహా. ''కలలు.. మనలో చాలెంజింగ్ స్పిరిట్‌ను నిద్రలేపుతాయి. అదే ముఖ్యం. పెళ్లి, పిల్లలు వంటి బాధ్యతలు కూడా మన చాలెంజింగ్ స్పిరిట్‌ను స్ట్రాంగ్ చేసేవే అని నమ్ముతాను'' అంటారు షీలా.

దేవుడు వరమివ్వకపోతేనేమి.. కాలం అవకాశం ఇచ్చింది.. కల నెరవేర్చుకొమ్మని. ఇంకా యవ్వనవంతులమనే నిరూపించుకున్నారు లక్ష్యాన్ని చేరి! ''ఓహ్.. బేబీ''కే స్ఫూర్తిలా!

– సరస్వతి రమ

---

స్త్రీలోకం

# వివక్ష ఇక బస్!



● బస్ డ్రైవ్ చేస్తున్న ప్రతీక్షా దాస్

**బ**స్ అంటే ఇక చాలు అని అర్థం. ఆడపిల్లలు బస్సులు నడపలేరనే అపోహలూ వివక్షలూ ఇక చాలంటోంది ప్రతీక్ష. బస్ నడుపుతున్న ఆ ప్రతీక్షా దాస్ కథేమిటో చూద్దాం రండి.

●●●

''ఇది కారు కాదు.. బస్సు. డ్రైవింగ్ అంత ఈజీగా ఉండదు. పవర్ స్టీరింగ్ ఉండదు. టర్న్ చేయాలంటే శక్తి కావాలి. నువ్వేమో సన్నగా బలహీనంగా ఉన్నావ్? డ్రైవ్ చేయగలవా?'' బస్ డ్రైవింగ్ ట్రెయినర్ ఆందోళన.

''టెన్షన్ పడకు అన్నా... నేను అన్నిరకాల బైక్స్, రేస్ కార్లు కూడా నడుపుతా'' కాన్ఫిడెంట్‌గా చెప్పింది ఆ అమ్మాయి.

అయినా అతనికి కంగారే. పక్కనున్న సహోద్యోగితో అన్నాడు ''ఈ అమ్మాయి నడపగలదంటావా?'' అని.

నడిపింది. భారీ వాహనాలను మగవాళ్లే నడపగలరు అన్న స్టేట్‌మెంట్‌ను బ్రేక్ చేసింది. తన రాష్ట్రంలో బస్ నడుపుతున్న తొలి మహిళా డ్రైవర్‌గా పేరూ నమోదు చేసుకుంది.

ఆమె పేరు ప్రతీక్షా దాస్. 24 ఏళ్లు. స్థలం.. ముంబై, మహారాష్ట్ర.

ప్రతీక్షా మెకానికల్ ఇంజనీరింగ్ చదివింది. చిన్నప్పటి నుంచీ డ్రైవింగ్ అంటే ఆసక్తి. ఎనిమిదో క్లాస్‌లో ఉన్నప్పుడే టూ వీలర్ నేర్చుకుంది. ఆర్‌టీఓ ఆఫీసర్ కావాలనేది ఆమె కల. అందుకోసం ఆమెకు హెవీ వెహికిల్స్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి. దాంతో బస్ డ్రైవింగ్ నేర్చుకోవడం అనివార్యమైంది. అలా 'బెస్ట్ (BEST)' బస్ వాళ్ల శిక్షణ తీసుకుంది. ఇప్పుడు ముంబై బిజీ రోడ్ల మీద ఆరు టన్నుల బరువుండే బస్‌ను అవలీలగా నడుపుతోంది. ''డ్రైవింగ్ వీల్ నాకెప్పుడూ చాలెంజ్ కాదు.. నేను బస్ నడుపుతుంటే ఆడపిల్ల బస్ నడపడమా అని చూసే జడ్జిమెంటల్ చూపులే నాకు చాలెంజ్. అఫ్‌కోర్స్ అధిగమించా. నా లక్ష్యం క్లియర్‌గా ఉంది కాబట్టి'' అంటుంది ప్రతీక్షా. ఆమె కలల జాబితాలో బైక్ మీద లద్దాఖ్ ప్రయాణంతోపాటు ఫ్లైట్ నడపాలనే కోరికా ఉంది. ''నేను అనుకున్నవన్నీ సాధించా.. సాధిస్తాను కూడా. నేనే కాదు లక్ష్యం పట్ల సీరియస్‌నెస్, ఫోకస్ ఉంటే ఎవరైనా అఛీవ్ చేయొచ్చు'' అంటుంది ప్రతీక్షాదాస్.

---

చెట్టు నీడ

# అందులోనే సమాజ శ్రేయస్సు

**ఓ**మారు 'ఈ భూమి ఓ లక్ష్య ప్రపంచంగా మారడానికి ఏమిటేమిటి అవసరం' అనే విషయం గురించి కన్ఫ్యూషియస్, ఆయన శిష్యులు చర్చించుకుంటున్నారు. జిల్ అనే శిష్యుడు – 'నాకు రథాలు, గుర్రాలు, అందమైన ఉన్ని దుస్తులు కావాలి. వాటిని నేను నా మిత్రులతో పంచుకుంటాను. వాళ్ళు వాటిని వృధా చేసినా నేను బాధపడను' అన్నాడు.

యాన్ హియి అనే మరో శిష్యుడు 'విజయం సాధించాలనే నా ఆశ నెరవేరితే నా శక్తిసామర్థ్యాలకు నేనేమీ గర్వపడను. నా విజయాల గురించి గొప్పలు పోను... వాటి గురించి ప్రచారం చేసుకోను' అన్నాడు.

ఇలా మరికొందరు శిష్యులు కూడా తమ తమ అభిప్రాయాలు చెప్పారు.


చివరికి శిష్యులందరూ గురువుగారి మాటలు వినడానికి ఆసక్తి చూపారు.

అప్పుడు కన్ఫ్యూషియస్ ఇలా చెప్పారు – 'వయోవృద్ధులు ప్రశాంతంగా ఉండాలి. హాయిగా విశ్రాంతి తీసుకోవాలి. మిత్రులు ఒకరితో ఒకరు సత్యంగా ఉండాలి. వారి హెచ్చుతగ్గులు అనే అభిప్రాయభేదాలు ఉండకూడదు. ప్రతి ఒక్కరిలోనూ కరుణరసం ఉండాలి. సమాజం పట్ల తమకున్న బాధ్యతలను విధేయతతో నిర్వర్తించాలి. తనకు ఇతరులు ఏవైతే చేయకూడదనుకుంటాడో వాటిని తాను ఇతరులకు కూడా చేయకుండా ఉండాలి. ఆదర్శ ప్రాయులుగా జీవించాలి. కుటుంబ సభ్యుల మధ్య పరస్పర గౌరవం కలిగి ప్రవర్తించాలి' అని.

కనుక అసలు సిసలు సమాజశ్రేయస్సును కోరిన మహనీయుడిగా కన్ఫ్యూషియస్‌ను అనుకోవడం సబబేగా.

– యామిజాల జగదీశ్

---



బ్యూటిప్

# మెడ మీద ముడతలు తగ్గాలంటే...

**ప్ర**తి రోజూ రాత్రి పడుకునే ముందు క్లెన్సింగ్ మిల్క్‌లో ముంచిన కాటన్‌తో మెడను తుడిచి, ఆ తర్వాత టీ స్పూన్ కీరా దోసకాయ రసంలో టీ స్పూన్ ఆపిల్ వెనిగర్ కలిపిన మిశ్రమాన్ని మెడకు పట్టించాలి. ఉదయం చన్నీటితో కడిగేయాలి. ఇలా కనీసం మూడు వారాల పాటు చేస్తే క్రమంగా మెడ మీద నలుపు వదులుతుంది. ఆపిల్ వెనిగర్ చర్మాన్ని టైట్ చేస్తుంది, కీరదోస చర్మాన్ని కోమలంగా మారుస్తుంది.

---

నెట్ కౌంటర్




● ఆయుష్మాన్, తహీరా

# బాయ్‌కట్ ఉంటే భాయేనా?

''**చీ**రకట్టు, నుదుటన బొట్టు, పొడుగాటి జుట్టు అంటూ ఆడవాళ్ల కట్టు, బొట్టులోనే కాక ఆఖరుకు వాళ్ల జుట్టులో కూడా అందాన్ని, స్త్రీత్వాన్ని చూస్తున్నాం. అవసరం, సౌకర్యం, సందర్భాన్ని బట్టే కట్టు బొట్టు, అలంకరణ ఉంటుందన్న విషయాన్ని మరిచిపోతున్నాం! నా ఫెమినిటీని బేస్ చేసుకొని అందాన్ని నిర్వచిస్తారెందుకు?'' అంటూ సోషల్ మీడియాలో స్పందించింది తహీరా ఖురాన్. ఆయుష్మాన్ ఖురాన్ భార్య. అసలు అలా స్పందించాల్సిన అవసరం ఎందుకొచ్చింది? అంటే ఇదిగో ఈ ఫొటోగ్రాఫ్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం వల్ల. ఇది మరీ తాజా కబురేం కాదు.. తన భర్త నటించిన ''ఆర్టికల్ 15'' సినిమా స్క్రీనింగ్‌కి వెళ్లినప్పుడు అతనితో కలిసి తీసుకున్న ఆ ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది తహీరా. అది చూసిన ఆయుష్మాన్ అభిమానులు.. ''మీరిద్దరు అన్నదమ్ముల్లా కనిపిస్తున్నారు'' అంటూ, ''అన్నదమ్ములు కాదు సరిగ్గా చూడండి.. ట్విన్స్'' అంటూ ట్రోల్ చేశారు. ఆ ఫొటోగ్రాఫ్‌లో తహీరా.. జుట్టు మెడ మీది వరకే అంటే బాయ్‌కట్‌లా ఉండడమే. తహీరా బ్రెస్ట్ క్యాన్సర్ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. ఆ షాక్, బ్యాడ్ ఫేజ్ నుంచి తేరుకొని నవ్వుతూ మునుపటి తహీరాలా కనిపిస్తూ ఆయుష్మాన్‌కు ధైర్యాన్నిస్తోంది. అందులో భాగంగానే ఆ కొత్త లుక్‌తో భర్త సినిమా స్క్రీనింగ్‌కి వెళ్లింది. ఆ ఆనందాన్ని సోషల్ మీడియా పోస్ట్‌తో అలా షేర్ చేసుకుంది. ఆయుష్మాన్ ఫ్యాన్స్ వ్యంగ్యానికి, జోక్స్‌కి పైన ప్రస్తావించిన పోస్ట్‌తో కౌంటర్ ఇచ్చింది.

## లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్..! మూడు నెలల క్రితం నేనొక అమ్మాయిని చూశాను. నాకు బాగా నచ్చింది. ఆ అమ్మాయికి చెప్పాను 'నువ్వు ఒప్పుకుంటే పెళ్ళి చేసుకుందాం' అని. తను ఒప్పుకోలేదు. కాని రోజు మాట్లాడుతుంది. చాలా సార్లు చెప్పాను 'నాకు కాల్ లేదా మెసేజ్ చేయకు' అని. అయినా చేస్తోంది. పెళ్లి మాట ఎత్తితే.. ''మా పేరెంట్స్ ఎవరిని చెప్తే వాళ్ళను చేసుకుంటాను'' అంటోంది. నేను బాగానే సెటిల్ అయ్యాను, జాబ్ చేస్తున్నాను. నేను తనని పెళ్లి చేసుకోవాలంటే ఏం చేయాలి. మీ ఇంట్లో అడుగుతానంటే 'వద్దు' అంటోంది. ఏం చెయ్యమంటారు..?

– బిందువర్ధన్

ప్రేమ ఎంత మధురం... ప్రియురాలు అంత కఠినం..
చేసినాను ప్రేమ క్షీర సాగర మధనం
మింగినాను హాలాహలం
ప్రేమ ఎంత మధురం... ప్రియురాలు అంత కఠినం..
ప్రేమించుటేనా నా దోషము
పూజించుటేనా నా పాపము
ఎన్నాళ్ళనీ ఈ ఎదలో ముల్లు
కన్నీరుగ ఈ కరిగే కళ్ళు
నాలోని నీ రూపము
నా జీవనాధారము
అది ఆరాలి పోవాలి ప్రాణము
ప్రేమ ఎంత మధురం... ప్రియురాలు అంత కఠినం..
నేనోర్వలేను ఈ తేజము
ఆర్పేయరాదా ఈ దీపము
ఆ చీకటిలో కలిసే పోయి
నా రేపటిని మరిచే పోయి
మానాలి నీ ధ్యానము
కావాలి నే శూన్యము
అపుడాగాలి ఈ మూగ గానం
ప్రేమ ఎంత మధురం... ప్రియురాలు అంత కఠినం...

'సినిమా పాట బిందువర్ధన్‌కి సరిపోయింది సార్ మరి ఇప్పుడేం చెయ్యాలి సార్?'

అమ్మాయి ఫ్రెండ్ అయ్యింది.. ప్రేమ బెండ్ అయ్యింది నీలూ!

lovedoctorram@sakshi.com

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



కట్‌చేయ్...దాచేయ్...

**వచనం :**
ఇంతకీ నీ పేరు చెప్పలేదు
మధు...

**పల్లవి :**
ఓ మధు... ఓ మధు...
నా మనసు నాది కాదు
ఓ మధు... ఓ మధు...
నా మనసు నాలో లేదు
రంగులరాట్నంలా
నా కళ్లను తిప్పించేశావే జాదూ
అందాల అయస్కాంతంలా
తిప్పావే హైదరబాదూ
నన్నొదిలి నీవైపొచ్చిన
మనసెట్టాగో తిరిగిక రాదు
వచ్చినా ఏం చేసుకుంటా
నీతో ఉంచేయ్ నాకొద్దు
॥ఓ మధు॥

**చరణం : 1**
వాన పడుతుంటే...
ప్రతి చిన్న చినుకు అద్దంలాగ నిను చూపిస్తుందే
మా నాన్న తిడుతుంటే...
ప్రతి పెద్ద అరుపు నీ పేరల్లే వినిపిస్తూ ఉందే
రెండు జళ్లు వేసుకున్న చిన్నపిల్లలాగ
యమునలో పూసుకున్న వాన వెల్లులాగ
ఒక్కొక్క యాంగిల్‌లో ఒక్కొక్కలాగ
కవ్వించి చంపావే కరెంట్ తీగ
॥ఓ మధు॥

**చరణం : 2**
సన్నాయిలా ఉందే...
అమ్మాయిలందరిని ఉడికించే నున్నని నీ నడుము
సంజాయిషీ ఇస్తూ...
ఆ బ్రహ్మ దిగిన చేసిన
తప్పును క్షమించనే లేము
చందనాలు జల్లుకున్న చందమామలాగా
మత్తుమందు జల్లుతున్న మల్లెమొగ్గ దాకా
ఒక్కొక్కసారి ఒక్కొక్కలాగ
ఊరించి చంపావే నన్నే ఇలాగ
॥ఓ మధు॥


**చిత్రం : జులాయి (2012)**
**రచన, సంగీతం : దేవిశ్రీ ప్రసాద్**
**గానం : అద్నాన్ శామి**

## మహా సముద్రంలో...


అదితీరావ్ హైదరీ

'ఆర్‌ఎక్స్ 100' సినిమా రిలీజ్ అయి ఏడాది కావస్తోంది. దర్శకుడు అజయ్ భూపతి తర్వాతి సినిమాని ఇంకా సెట్స్‌పైకి తీసుకెళ్లడం లేదు. రవితేజ హీరోగా 'మహా సముద్రం' అనే పవర్‌ఫుల్ సబ్జెక్ట్‌ను రెడీ చేస్తున్నారని తెలిసింది. ఈ సినిమా సెప్టెంబర్‌లో ప్రారంభం కానుంది. ఇందులో రవితేజ సరసన హీరోయిన్‌గా అదితీరావ్ హైదరీని తీసుకోవాలని చిత్రబృందం భావిస్తోందట. గత ఏడాది 'సమ్మోహనం, అంతరిక్షం' సినిమాల్లో తన నటనతో ఆకట్టుకున్నారు అదితీ. ప్రస్తుతం సుధీర్‌బాబు, నాని చేస్తున్న 'వి' సినిమాలో ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు. రవితేజ సినిమా సెప్టెంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానుందని తెలిసింది.

## స్పీడ్ పెరిగింది



షారుక్ ఖాన్

షారుక్ ఖాన్ నిర్మాతగా ఫుల్ స్పీడ్‌లో ఉన్నారు. కానీ, హీరోగా చేసే కొత్త ప్రాజెక్ట్‌ను అంగీకరించడానికి మాత్రం టైమ్ తీసుకుంటున్నారు. ఆల్రెడీ 'బార్డ్ ఆఫ్ బ్లడ్, క్లాస్ ఆఫ్ 83' సినిమాలను నెట్‌ఫ్లిక్స్ కోసం నిర్మిస్తున్న ఆయన తాజాగా ఓ హారర్ సిరీస్‌కు సహ నిర్మాతగా వ్యవహరించనున్నారని తెలిసింది. 'బీతాల్' టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సిరీస్‌లో వినీత్ కుమార్ సింగ్, ఆహనా కుమ్రా ముఖ్య పాత్రల్లో నటించనున్నారు. రాధికా ఆప్టే 'గౌల్' సిరీస్‌ను డైరెక్ట్ చేసిన ప్యాట్రిక్ గ్రహం ఈ చిత్రానికి దర్శకుడు. త్వరలో షూటింగ్ స్టార్ట్ కానుంది. షారుక్ సినిమాల విషయానికి వస్తే అట్లీ దర్శకత్వంలో ఓ సినిమలో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం.

## బైలంపుడి ట్రైలర్ చాలా బాగుంది


తనిష్క్, హరీష్, శివ నిర్వాణ, బ్రహ్మానంద రెడ్డి, అనిల్ పి.జి

''బైలంపుడి' ట్రైలర్ చూశా.. చాలా బాగుంది. రెగ్యులర్ చిత్రాలకు భిన్నంగా ఈ సినిమా ఉంటుంది. పక్కా కమర్షియల్ అంశాలు ఉన్నాయి. ఈ సినిమా నిర్మాత బ్రహ్మానందరెడ్డి చేసిన విలన్ పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని దర్శకుడు సాగర్ అన్నారు. హరీష్ వినయ్, తనిష్క తివారి జంటగా అనిల్ పి.జి.రాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బైలంపుడి'. తారా క్రియేషన్స్ పతాకంపై బ్రహ్మానందరెడ్డి నటిస్తూ, నిర్మించిన ఈ సినిమా ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో అలీ మాట్లాడుతూ– ''బైలంపూడి' కథగానీ, డైరెక్టర్‌గానీ, ప్రొడ్యూసర్‌గానీ నాకు తెలియదు. మా ఇంటికి వచ్చి నన్ను ఆహ్వానించారు. ఈ సినిమా తియ్యడానికి చాలా కష్టపడ్డాం అన్నారు. సినిమా మీద ప్యాషన్‌తో కొత్త వాళ్లు రావడం మంచిది. ఇండస్ట్రీకి కొత్తనీరు రావాలి'' అన్నారు. ''మా సినిమా విడుదలవడానికి యూనిట్‌తో పాటు, ఇక్కడకి వచ్చిన ఎంతో మంది అతిథులు చాలా సహాయం చేశారు. డిస్ట్రిబ్యూటర్ శ్రీనివాస్‌రెడ్డి గారు మా సినిమాని అన్ని ఏరియాల్లో అమ్మేశారు. నేను ఇంత దూరం రావడానికి నా కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో ఉంది'' అన్నారు బ్రహ్మానందరెడ్డి. ''ఒక ఊరిలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తీశాం'' అన్నారు అనిల్ పి.జి.రాజ్.

## రాముడు లంకకు వెళ్లొస్తే...


మహేశ్ సూర్య

పురాణాల్లో రావణుడు సీతని అపహరిస్తే ఆంజనేయుడు తొలుత లంకకి వెళ్లొచ్చాడు. రాముడే మొదటగా వెళ్లుంటే? అనే కథాంశంతో రూపొందనున్న చిత్రం 'బడిదొంగ'. మహేష్ సూర్య సిద్దగోని హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మించనున్నారు. బేబి శ్రీనిత్య సమర్పణలో సన్ మీడియా కార్పొరేషన్ బ్యానర్‌పై రూపొందనున్న ఈ చిత్రంలో ఇషిక వర్మ, రవికిరణ్ ఇతర కీలకపాత్రల్లో నటించనున్నారు. ఈ సినిమా లోగోని వ్యాపార వేత్తలు రవీందర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి ఆవిష్కరించారు. మహేష్ సూర్య మాట్లాడుతూ– ''22 ఏళ్లుగా మీడియా, సినీ రంగాల్లో కొనసాగుతున్నాను. పలు యాడ్ ఫిల్మ్స్ రూపొందించిన అనుభవంతో ఈ సినిమా తెరకెక్కిస్తున్నాను. రొమాంటిక్ లవ్ అండ్ యాక్షన్ మూవీగా రూపొందనున్న చిత్రమిది. మూడేళ్ల పాటు ఈ కథపై పని చేశాను. హైదరాబాద్, యాదగిరి గుట్ట పరిసరప్రాంతాల్లో చిత్రీకరణ జరపనున్నాం'' అన్నారు. ''గోవిందుడు అందరివాడేలే, రారండోయ్ వేడుక చూద్దాం' చిత్రాల్లో నటించాను. హీరోయిన్‌గా ఇదే తొలిచిత్రం'' అన్నారు ఇషిక వర్మ. నటుడు రవి కిరణ్, సంగీత దర్శకుడు రాజా మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: రాజా, కెమెరా: వంశీ, సహనిర్మాతలు: రామ్ వశిష్ట, శ్రీనిత్య, హర్ష వర్ధన్, టి.మల్లికార్జున్ రావ్, జగదీశ్.

## వనవాసం పెద్ద హిట్ అవుతుంది

''యాక్టర్ అవుదామని వచ్చిన సంజయ్ కుమార్‌గారు నిర్మాత అయ్యారు. ఈ సినిమాను నిర్మిస్తున్న తన ఫ్రెండ్ చనిపోవడంతో సంజయ్‌గారు ఈ సినిమా నిర్మాణ బాధ్యతలు తీసుకున్నారు. ట్రైలర్ చూస్తుంటే 'వనవాసం' సినిమా పెద్ద హిట్ అవుతుందని నమ్ముతున్నా''అని హీరో 'అల్లరి' నరేశ్ అన్నారు. నవీన్‌రాజ్ శంకరపుడి, శశికాంత్, శ్రావ్య, శృతి ముఖ్య తారలుగా భరత్.పి, నరేంద్ర దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వనవాసం'. భవాని శంకర ప్రొడక్షన్స్ పతాకంపై బి.సంజయ్ కుమార్ నిర్మించారు. మోహన్ స్వరపరచిన ఈ చిత్రం పాటలను హైదరాబాద్‌లో విడుదల చేశారు. సంజయ్ కుమార్ మాట్లాడుతూ– ''20 ఏళ్ల క్రితం యాక్టింగ్ స్కూల్‌లో పరిచయమయ్యారు నరేశ్. ఇప్పుడు నా సినిమాని ప్రోత్సహించడానికి రావడం ఆనందంగా ఉంది'' అన్నారు. ''ఈ మధ్య చిన్న సినిమాలే బాగా ఆడుతున్నాయి. కథ బాగుంటే ప్రేక్షకులు ఆదరిస్తున్నారు'' అన్నారు నిర్మాత తుమ్మళ్లపల్లి రామసత్యనారాయణ. ''అన్ని వర్గాల ప్రేక్షకులకు మా సినిమా నచ్చుతుంది. సంజయ్‌గారు ఖర్చుకు ఎక్కడా వెనకాడకుండా ఈ సినిమా తీశారు'' అన్నారు భరత్.పి, నరేంద్ర. నిర్మాత రాజ్ కందుకూరి పాల్గొన్నారు.


నవీన్, శ్రావ్య

## ఆగస్టులో ఆరంభం?


కమల్ హాసన్

'ఇండియన్ 2' సినిమా గురించి ప్రస్తుతం ఇండస్ట్రీలో భిన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఈ సినిమా షూటింగ్ ఆగిపోయిందనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే తాజాగా 'ఇండియన్ 2' మూవీ గురించి కోలీవుడ్‌లో ఓ కొత్త ప్రచారం ఊపందుకుంది. ఈ సినిమా షూటింగ్ మళ్లీ ఆగస్టులో ప్రారంభం అవుతుందని కోలీవుడ్ టాక్. ఆల్రెడీ ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ పూర్తయిన సంగతి తెలిసిందే. శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా 'ఇండియన్ 2' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. 1996లో శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ నటించిన 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') చిత్రానికి ఇది సీక్వెల్. ఈ సంగతి ఇలా ఉంచితే... ప్రస్తుతం తమిళ బిగ్‌బాస్ 3తో బిజీగా ఉన్నారు కమల్.

## అంతకన్నా ఏం కావాలి?

''నిను వీడని నీడను నేనే' సినిమాకి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ బావుందని చెబుతున్నారు. ఫస్టాఫ్ సూపర్ అని, క్లైమాక్స్‌లో భావోద్వేగ సన్నివేశాలు తమ మనసును కదిలించాయని చెబుతున్నారు'' అని అన్య సింగ్ అన్నారు. సందీప్ కిషన్, అన్య సింగ్ జంటగా కార్తీక్ రాజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'నిను వీడని నీడను నేనే'. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ అనిల్ సుంకర సమర్పణలో దయా పన్నెం, సందీప్ కిషన్, విజి సుబ్రహ్మణ్యన్ నిర్మించిన ఈ సినిమా గత శుక్రవారం విడుదలైంది. ఈ చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయమైన హీరోయిన్ అన్యసింగ్ పంచుకున్న విశేషాలు...


అన్య సింగ్

- మాది ఢిల్లీ. అజ్మీర్‌లోని బోర్డింగ్ స్కూల్‌లో చదువుకున్నా. డిగ్రీ కోసం మళ్లీ ఢిల్లీ వచ్చా. పొలిటికల్ సైన్స్, సోషియాలజీ నా సబ్జెక్ట్స్. నిజానికి సైకాలజీ నా ఫేవరెట్ సబ్జెక్ట్. కానీ, సైకాలజీలో డిగ్రీ చేయాలంటే స్ట్రిక్ట్ యూనివర్సిటీకి వెళ్లాలని మానేశా. కాలేజీలో ఉన్నప్పుడు వెడ్డింగ్ ప్లానర్‌తో కలిసి పనిచేశా. చిన్నప్పటి నుంచి నటన అంటే ఇష్టం. అందుకే చదువు పూర్తయిన తర్వాత ముంబై షిఫ్ట్ అయ్యాను. నా తొలి హిందీ సినిమా 'ఖైదీ బాండ్' లో నా నటన నచ్చి సందీప్ కిషన్, కార్తీక్ రాజు ఈ సినిమా అవకాశం ఇచ్చారు.
- శుక్రవారం ఉదయం కొంచెం టెన్షన్ పడ్డాను. సుమారు 11 గంటల సమయంలో సినిమా బాలేదని ఎవరో రాస్తే చదివి, నిరాశతో ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి హోటల్‌కి వెళ్లిపోయా. మధ్యాహ్నం తర్వాత మా ఎగ్జిక్యూటివ్ నిర్మాత సీతారామ్ ఫోన్ చేసి, సక్సెస్ సెలబ్రేషన్స్‌కి రమ్మని చెప్పారు. సోషల్ మీడియాలో, రివ్యూస్‌లో సినిమా చాలా బాగుందని రాయడంతో సంతోషంగా అనిపించింది. వసూళ్లు బాగున్నాయి. థియేటర్ల సంఖ్యను పెంచుతున్నారు. అంతకన్నా ఏం కావాలి. నేను చాలా సంతోషంగా ఉన్నా.
- సినిమా విడుదలైన రోజు హైదరాబాద్ మెట్రో రైలులో ప్రయాణించినప్పుడు ప్రేక్షకులు సన్నివేశాల గురించి చెబుతుంటే సంతోషంగా అనిపించింది. ఎక్కువమంది నన్ను గుర్తు పట్టలేదు. సందీప్ కిషన్‌తో సెల్ఫీలు తీసుకోవటానికి పోటీ పడ్డారు. 'నిను వీడని నీడను నేనే' సమయంలో క్యాన్సర్ వల్ల మా నాన్నగారు మరణించారు. దాంతో షాక్‌లోకి వెళ్లాను. తర్వాత నెమ్మదిగా కోలుకున్నాను.
- సినిమా షూటింగ్ ప్రారంభం కావడానికి 20 రోజుల ముందు నాకు కథ చెప్పారు. కొంచెం ప్రిపేర్ అయ్యాను. హారర్ సన్నివేశంలో ఈజీగానే నటించా. కానీ, ఎమోషనల్ సన్నివేశాలు చేసేటప్పుడు కష్టపడ్డాను. హారర్ సినిమాలు చూడాలన్నా, చేయాలన్నా భయపడతా. థ్రిల్లర్స్ అంటే ఇష్టం.
- సందీప్ కిషన్‌తో పనిచేయడం సౌకర్యంగా ఉంది. నాకు తెలుగు రాదు. ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నా. షూటింగ్‌లో నాకు డైలాగులు అర్థం కాకపోతే చెప్పేవాడు. కార్తీక్ రాజు కూడా బాగా సహకరించారు. ఈ సినిమాలో నేను సహజంగా నటించానని, సహజ నటి అంటూ ప్రేక్షకులు అంటుంటే సంతోషంగా ఉంది. కొంతమంది నెగిటివ్ కామెంట్స్ కూడా చేశారు.. పరవాలేదు.
- తెలుగులో కొంతమంది నిర్మాతలు సంప్రదించారు.. అయితే ఇంకా ఏ ప్రాజెక్టు కూడా ఫైనలైజ్ కాలేదు. హిందీలో యష్ రాజ్ ఫిలిమ్స్‌తో మూడు సినిమాల అగ్రిమెంట్ ఉంది. ఒక సినిమా చేశా. త్వరలో మిగతా రెండు చేస్తా. అమెజాన్, నెట్‌ఫ్లిక్స్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ వచ్చిన తర్వాత భాషతో సంబంధం లేకుండా ప్రేక్షకులు అన్ని సినిమాలను చూస్తున్నారు. మంచి కథ, పాత్ర లభిస్తే ఏ భాషలోనైనా నటించడానికి సిద్ధమే.

## తమిళంలో నిన్ను కోరి


అథర్వ


అనుపమ

మంచి ప్రేక్షకాదరణ దక్కిన సినిమాలు ఇతర భాషల్లో రీమేక్ కావడం సాధారణమే. ఆ జాబితాలోకి తాజాగా 'నిన్ను కోరి' చిత్రం కూడా చేరిందట. నాని, ఆది పినిశెట్టి, నివేదా థామస్ ముఖ్య తారాగణంగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన 'నిన్ను కోరి' చిత్రం తెలుగులో మంచి హిట్ సాధించింది. ఇప్పుడు ఈ సినిమా తమిళంలో రీమేక్ అవుతోందని సమాచారం. అథర్వ, అనుపమ పరమేశ్వరన్ ముఖ్య తారలుగా ఇటీవల కన్నన్ దర్శకత్వంలో కోలీవుడ్‌లో ఓ సినిమా ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఇది 'నిన్ను కోరి' చిత్రానికి తమిళ రీమేక్ అని టాక్. మరి.. తెలుగులో ఆది పినిశెట్టి చేసిన పాత్రను తమిళంలోఎవరు? చేస్తారో చూడాలి.


కంగనా రనౌత్

## ఖేల్ ఖతమ్

బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ కబడ్డీ కూత ఆగింది. 'పంగా' సినిమా చిత్రీకరణ ముగిసింది. కంగనా రనౌత్ ప్రధాన పాత్రధారిగా అశ్వనీ అయ్యర్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పంగా'. ఓ గ్రామీణ యువతి జాతీయ కబడ్డీ క్రీడాకారిణిగా ఎలా ఎదిగారు? అన్నదే కథాంశం. ఈ చిత్రంలో కబడ్డీ ప్లేయర్‌గా కంగనా నటించారు. రిచా చద్దా, జెస్సీ గిల్, నీనా గుప్తా, పంకజ్ త్రిపాఠి ఇతర ముఖ్య తారాగాణం. ఈ సినిమా చిత్రీకరణ ముగిసింది. ఈ సందర్భంగా ఓ ఎమోషనల్ పోస్ట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు చిత్ర దర్శకురాలు అశ్వనీ. ఈ సినిమాను వచ్చే ఏడాది జనవరిలో విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే... కంగానా, రాజ్‌కుమార్‌రావు కలిసి నటించిన 'జడ్జిమెంటల్ హై క్యా?' సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఓ విలేకరిపై కంగనా అసహనం వ్యక్తం చేశారు. ఈ వివాదం గురించి కంగనా క్షమాపణలు చెప్పాలని ఎంటర్‌టైన్మెంట్ జర్నలిస్ట్ గిల్డ్ డిమాండ్ చేసింది. వీరికి తాజాగా ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా కూడా మద్దతు తెలిపిందని వార్తలు వస్తున్నాయి.


జూలియస్ పాకియమ్

## సైరాకు సై

చిరంజీవి నటించిన 'సైరా:నరసింహారెడ్డి' సినిమా షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రానికి బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కంపోజ్ చేయడానికి బాలీవుడ్ కంపోజర్ జూలియస్ పాకియమ్ తీసుకున్నట్టు తెలిసింది. సల్మాన్ ఖాన్ 'భజరంగీ భాయిజాన్, సుల్తాన్, ఏక్ థా టైగర్, భారత్' సినిమాలకు బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందించారాయన. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ నిర్మించారు. నయనతార, తమన్నా కథానాయికలు. అమితాబ్ బచ్చన్, సుదీప్, జగపతిబాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అమిత్ త్రివేది.

## ప్రేమ సందేశం

ఆయుష్, షిరిన్, ప్రమోదిని, మణిచందన ముఖ్య తారలుగా రవికుమార్ పొన్నగంటి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఏయ్ జూనియర్'. షేక్ గౌస్ నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తెలంగాణా స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ– ''సందేశంతో కూడుకున్న ఈ ప్రేమకథా చిత్రం తప్పక విజయం సాధించాలి'' అన్నారు. ''కాలేజ్ నేపథ్యంలో ఓ చక్కని టీనేజ్ లవ్ స్టోరీగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. అసభ్యతకు తావులేకుండా కుటుంబం మొత్తం కలిసి చూసేలా ఉంటుంది'' అన్నారు రవికుమార్ పొన్నగంటి. ''ఆగస్ట్ మొదటి వారంలో ఆడియో, చివరి వారంలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు షేక్ గౌస్. ఈ చిత్రానికి సమర్పణ: సబీనా, సహ నిర్మాతలు: చేపూరి చంద్రకాంత్, పులిషేరి ప్రణిదీప్, కెమెరా: దుర్గాప్రసాద్.




సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా

సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com

సోమవారం 15-7-2019




గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్).. ఇంజనీరింగ్/టెక్నాలజీ/ఆర్కిటెక్చర్/ సైన్స్‌అభ్యర్థులకు దేశవ్యాప్తంగా ఎంటెక్, డాక్టోరల్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాలకు వీలుకల్పించే పరీక్ష! గేట్‌లో ర్యాంకు ద్వారా ఐఐటీలు, నిట్‌లు తదితర ఇన్‌స్టిట్యూట్స్‌లో ఇంజనీరింగ్ పీజీలో చేరిన విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటు అందుతుంది. గేట్‌లో ప్రతిభతో ప్రభుత్వ రంగ సంస్థల్లో కొలువు సైతం సొంతం చేసుకోవచ్చు. గేట్-2020కు షెడ్యూల్ విడుదలైంది. దరఖాస్తు ప్రక్రియ సెప్టెంబర్‌లో ప్రారంభం కానుంది. గేట్-2020ను ఐఐటీ ఢిల్లీ నిర్వహించనుంది. ఇంజనీరింగ్ పూర్తిచేసిన చాలామంది ఉద్యోగాలు చేస్తూ.. గేట్‌లో అర్హత సాధించేందుకు ప్రయత్నిస్తుంటారు. ఈ నేపథ్యంలో గేట్‌తో ప్రయోజనాలు.. పరీక్ష తీరుతెన్నులు.. జాబ్ చేస్తూనే 'గేట్'ను దాటడం ఎలాగో తెలుసుకుందాం...

హయ్యర్ ఎడ్యుకేషన్

# జాబ్ చేస్తూనే.. గేట్ దాటొచ్చు!

**సెప్టెంబర్ 3 నుంచి గేట్ 2020 దరఖాస్తు ప్రక్రియ**

**2020, ఫిబ్రవరి 1,2, 8, 9 తేదీల్లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్ష**

**గేట్ ర్యాంకుతో ఇటు ఉన్నత విద్య, అటు ప్రభుత్వ రంగ సంస్థల్లో కొలువు**

**జాబ్ చేస్తూనే గేట్ దాటొచ్చు అంటున్న నిపుణులు**

### పరీక్ష.. ప్రత్యేకతలు

- **గేట్ ఎందుకు:** ఎంటెక్/పీహెచ్‌డీలో ప్రవేశం; పీఎస్‌యూల్లో ఉద్యోగం.
- **అర్హత:** బీటెక్/బీఈ/బీఫార్మ్/బీఆర్క్/బీఎస్సీ (రీసెర్చ్)/బీఎస్/ఎంఎస్సీ.
- **గేట్ 2020 నిర్వహణ సంస్థ:** ఐఐటీ ఢిల్లీ.
- **దరఖాస్తులు:** సెప్టెంబర్ 3 నుంచి ప్రారంభం.

### పరీక్ష విధానం

మొత్తం 24 సబ్జెక్టుల్లో కంప్యూటర్ బేస్డ్ టెస్టు(సీబీటీ), ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది.

- **పరీక్ష సమయం:** మూడు గంటలు.
- **ప్రశ్నల సంఖ్య:** 65.
- **మొత్తం మార్కులు:** 100.
- **ప్రశ్నల శైలి:** మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు, న్యూమరికల్ ఆన్సర్ ప్రశ్నలు.
- గేట్ 2020 స్కోర్ మూడేళ్లపాటు చెల్లుబాటవుతుంది.

### భవిష్యత్ లక్ష్యం

బీటెక్ అభ్యర్థులు ఉద్యోగం చేస్తూనే గేట్‌లో మెరిసి.. భవిష్యత్ లక్ష్యాలను అందుకోవాలని కలలు కంటుంటారు. గేట్‌లో ప్రతిభ చూపడం ద్వారా మరింత ఉన్నతస్థాయికి ఎదగొచ్చనడంలో ఎలాంటి సందేహం లేదు. పార్ట్‌టైమ్ లేదా ఫుల్‌టైమ్.. ఏ జాబ్ అయినా.. అలాంటి వారందరూ కొన్ని అంశాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టినప్పుడే లక్ష్యం సాకారమవుతుందని గుర్తించాలి. ముఖ్యంగా దీర్ఘకాలిక ప్రిపరేషన్‌తోనే గేట్‌లో విజయం సాధ్యమంటున్నారు నిపుణులు. ఉద్యోగం చేస్తూ కూడా గేట్‌లో విజయం సాధించొచ్చని సూచిస్తున్నారు. అయితే జాబ్ చేస్తూ గేట్‌కు సిద్ధమయ్యే అభ్యర్థులు పటిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించినప్పుడే విజయం వరిస్తుంది.

### పోటీ తీవ్రం

- గేట్ జాతీయస్థాయి పరీక్ష. దీనికి దాదాపు 10 లక్షల మందికిపైగా హాజరయ్యే అవకాశముంది. అంటే.. పోటీ తీవ్రంగా ఉంటుందని గమనించాలి. గేట్‌లో అడిగే ప్రశ్నలు సైతం ట్రిక్కీగా ఉంటాయి. కాబట్టి పరీక్ష స్థాయికి తగ్గట్టు ఫోకస్డ్‌గా ప్రిపరేషన్ సాగించాలి.
- గేట్ ప్రశ్నపత్రంలో జనరల్ ఆప్టిట్యూడ్ విభాగానికి 15 మార్కులు ఉంటాయి; అలాగే అభ్యర్థి ఎంపిక చేసుకున్న సబ్జెక్టుకు 75 మార్కులు, ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్‌కు 15 మార్కులు కేటాయించారు.
- సరైన సమాధానానికి 1 లేదా 2 మార్కులు వస్తే.. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు ప్రశ్నలకు 1/3 మార్కు కోత, 2 మార్కుల ప్రశ్నలకు 2/3 మార్కుల కోత ఉంటుంది. ఎంసీక్యూ ప్రశ్నలకు మాత్రమే నెగిటివ్ మార్కింగ్ విధానం అమల్లో ఉంది. న్యూమరికల్ తరహా ప్రశ్నలకు నెగిటివ్ మార్కులు ఉండవు.
- గేట్ ప్రశ్నపత్రంలో అప్లికేషన్, అనాలసిస్, కాంప్రెహెన్షన్, సింథసిస్, రీకాల్ తరహా ప్రశ్నలు ఎదురవుతాయని నిపుణులు చెబుతున్నారు.

### కొలువు చేస్తూ.. ఇలా

- అభ్యర్థులు ముందుగా ఉద్యోగం చేస్తూ గేట్‌లో విజయం సాధించడం కష్టమనే భావనను మనసులో నుంచి తీసివేయాలి. ఏటా గేట్ టాపర్లలో ఉద్యోగాలు చేస్తున్న వారు సైతం ఉంటున్నారనే విషయాన్ని గుర్తించాలి. వారిని స్ఫూర్తిగా తీసుకోవాలి.
- ఉద్యోగం చేస్తూ గేట్‌కు సన్నద్ధమవ్వాలనుకునే అభ్యర్థులు ముఖ్యంగా ఆఫీస్ వేళల తర్వాత సహచరులతో చిట్‌చాట్‌లు, పార్టీలకు ఫుల్‌స్టాప్ పెట్టాలి.
- ప్రిపరేషన్ పరంగా ముందుగా పరీక్ష గురించి సమగ్రంగా తెలుసుకోవాలి. అలాగే ప్రామాణిక పుస్తకాలు, మెటీరియల్‌ను ఎంపిక చేసుకోవాలి. వీలైతే వారాంతాల్లో కోచింగ్‌కు హాజరయ్యేందుకు ప్రయత్నించాలి.
- సబ్జెక్టుపై పట్టుసాధిస్తూనే... మరోవైపు గత ప్రశ్నపత్రాలు, మోడల్ పేపర్ల ప్రాక్టీస్ కొనసాగించాలి. పరీక్షకు కొద్దిరోజుల ముందు మాక్ టెస్టులకు హాజరవడం మేలు చేస్తుంది. ప్రాక్టీస్, కచ్చితత్వం గేట్‌లో విజయానికి దోహదం చేస్తాయి.
- ప్రతి మార్కు కీలకమైన గేట్‌లో జనరల్ ఆప్టిట్యూడ్, ఇంజనీరింగ్ మ్యాథ్‌మెటిక్స్‌పై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలి.

### గేట్‌తో ఎంటెక్/ఎంఈ/పీహెచ్‌డీ

- గేట్‌లో ర్యాంకుతో ఐఐటీలు, ఐఐఎస్సీ, నిట్‌లు, ఇతర కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే విద్యాసంస్థలు, యూనివర్సిటీల్లో ఎంటెక్/ఎంఈ, పీహెచ్‌డీల్లో ప్రవేశం పొందొచ్చు! గేట్ స్కోర్ ఆధారంగా అడ్మిషన్ కల్పించే ఇన్‌స్టిట్యూట్లు ప్రత్యేకంగా నోటిఫికేషన్లు జారీచేస్తాయి. సదరు సంస్థల ప్రవేశ ప్రక్రియకు అనుగుణంగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- గేట్ స్కోరుతో డీమ్డ్ యూనివర్సిటీలూ, ఆయా రాష్ట్రాల్లోని క్యాంపస్ కాలేజీల్లో ఎంటెక్, ఎంఈ, ఎంఎస్, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సుల్లో చేరొచ్చు. కొన్ని విద్యాసంస్థలు నేరుగా పీహెచ్‌డీలో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సులతో తక్కువ కాలంలోనే పీహెచ్‌డీని పూర్తిచేసుకోవచ్చు.
- ఐఐఎంల్లో ఫెలోషిప్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(ఎఫ్‌పీఎం) కోర్సులకు గేట్ స్కోరును పరిగణనలోకి తీసుకుంటున్నారు.
- విదేశీ విశ్వవిద్యాలయాల్లో చేరేందుకు సైతం గేట్ స్కోరు ఉపయోగపడుతుంది. సింగపూర్, జర్మనీ, జపాన్ వంటి దేశాల్లోని పలు యూనివర్సిటీలు గేట్‌లో ప్రతిభ చూపిన వారికి ఆహ్వానం పలుకుతున్నాయి.

### స్కాలర్‌షిప్స్/అసిస్టెంట్‌షిప్స్

గేట్‌లో ర్యాంకు ద్వారా ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు స్కాలర్‌షిప్/అసిస్టెంట్‌షిప్‌లు అందుతాయి. ఎంహెచ్ఆర్‌డీ మార్గనిర్దేశకాలు, ఆయా ఇన్‌స్టిట్యూట్‌ల నిబంధనల మేరకు గేట్‌లో ప్రతిభకు 70 శాతం వెయిటేజీ; ఇంటర్వ్యూకు 30 శాతం వెయిటేజీ ఉంటుంది. పీజీలో చేరే విద్యార్థులకు నెలకు రూ.12,400 అందుతుంది. గేట్ స్కోర్ ద్వారా సీఎస్ఐఆర్ లేబొరేటరీల్లో జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ కోసం ప్రయత్నించొచ్చు.




### పీఎస్‌యూ కొలువు.. క్రేజ్

- గేట్‌తో ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ)ల్లో ఉద్యోగం పొందడం అభ్యర్థుల తొలి ప్రాధాన్యంగా మారింది. ప్రస్తుతం గేట్ ఔత్సాహికులంతా పీఎస్‌యూల్లో కొలువే లక్ష్యంగా సాగుతున్నారు.
- బీహెచ్ఈఎల్, గెయిల్, హెచ్ఏఎల్, ఐఓసీఎల్, ఎన్‌టీపీసీ, ఓఎన్‌జీసీ వంటి మహారత్న, నవరత్న, మినీరత్న హోదా కలిగిన పీఎస్‌యూలు గేట్ ర్యాంకు ప్రాతిపదికన ఎంట్రీ లెవల్ ఆఫీసర్ ఉద్యోగాలను భర్తీచేస్తున్నాయి. 2012 నుంచి పీఎస్‌యూలు గేట్ స్కోరు ఆధారంగా నియామకాలు చేపట్టడం ప్రారంభించాయి. వీటి సంఖ్య ప్రస్తుతం 50కి పైగానే ఉంది.
- గేట్ ఫలితాలు విడుదలైన తర్వాత పీఎస్‌యూలు దరఖాస్తు ప్రక్రియను ప్రారంభిస్తున్నాయి. అభ్యర్థుల ప్రయోజనార్థం సంబంధిత నియామక ప్రక్రియ షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటిస్తున్నాయి. కొన్ని పీఎస్‌యూలు సెప్టెంబర్, అక్టోబర్‌ల్లో నోటిఫికేషన్లు విడుదల చేసి.. షెడ్యూల్, ఎంపిక ప్రక్రియ వివరాలను అభ్యర్థులకు అందుబాటులో ఉంచుతున్నాయి. మరికొన్ని పీఎస్‌యూలు జనవరి, ఫిబ్రవరిలో నోటిఫికేషన్లు విడుదల చేస్తున్నాయి. పీఎస్‌యూ జాబ్స్ ఔత్సాహికులు గేట్ ప్రిపరేషన్‌తోపాటు ఆయా పీఎస్‌యూల నోటిఫికేషన్లకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- పీఎస్‌యూలు కేటగిరీల ఆధారంగా, కటాఫ్ మార్కులు నిర్ణయించి ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తున్నాయి. కటాఫ్ మార్కులు పీఎస్‌యూలను బట్టి మారతాయి. కనీస కటాఫ్‌ను నిర్ణయించే సమయంలో 1:5 లేదా 1:7 నిష్పత్తిలో అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఆ మేరకు ప్రకటిస్తున్నాయి. అంటే.. ఒక్కో ఖాళీకి అయిదుగురు లేదా ఏడుగురు అభ్యర్థులను మలిదశ ఎంపిక ప్రక్రియకు పిలుస్తున్నాయి.
- పీఎస్‌యూల్లో గేట్ ర్యాంకుతో నిర్వహించే ఎంపిక ప్రక్రియ సదరు పీఎస్‌యూల నియామక విధానాల మేరకు ఉంటుంది. అధిక శాతం పీఎస్‌యూలు గ్రూప్ డిస్కషన్, మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఇంటర్వ్యూలో వ్యక్తిగత వివరాలు మొదలు కంపెనీపై అవగాహన, సమకాలీన అంశాల పరిజ్ఞానం, టెక్నికల్ స్కిల్స్.. ఇలా అన్ని కోణాల్లో ప్రశ్నలు అడుగుతారు.
- పీఎస్‌యూల్లో కొలువులను ఖరారు చేసుకున్న అభ్యర్థులకు ప్రారంభంలోనే రూ.12 లక్షల నుంచి రూ.18 లక్షల వార్షిక వేతనం అందుతుంది. కొన్ని పీఎస్‌యూలు.. సర్వీస్ బాండ్ నిబంధనను అమలు చేస్తున్నాయి. అంటే.. నియామకం ఖరారైన అభ్యర్థులు నిర్దిష్ట కాలం పాటు సంస్థలో పని చేస్తామని అంగీకార పత్రం ఇవ్వాలి. ఈ వ్యవధి రెండేళ్ల నుంచి మూడేళ్ల వరకు ఉంటోంది.

### ఎంఎన్‌సీల్లోనూ..

గేట్‌లో ప్రతిభ చూపిన వారిని నియమించుకునేందుకు బహుళ జాతి సంస్థలు (ఎంఎన్‌సీ) ఆసక్తి చూపుతున్నాయి. ఆయా సంస్థల్లో రీసెర్చ్, డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) విభాగాల్లో గేట్ ర్యాంకర్లను రిక్రూట్ చేసుకుంటున్నాయి. అడ్వాన్స్‌డ్ మైక్రో డివైసెస్(ఏఎండీ), ఏడీ(అనలాగ్ డివైసెస్), గూగుల్, నోకియా, ఒరాకిల్, సీమెన్స్, తోషిబా, ఫేస్‌బుక్, అమెజాన్, రోబోట్ బోష్ లాంటి.. సుమారు 28 పెద్దసంస్థలు మెరికల్లాంటి అభ్యర్థుల అన్వేషణకు గేట్ స్కోరును పరిగణనలోకి తీసుకుంటున్నాయి.



### గేట్ 2020 ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** సెప్టెంబర్ 3, 2019.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ముగింపు:** సెప్టెంబర్ 24, 2019.
- **పెంచిన దరఖాస్తు ఫీజుతో దరఖాస్తుకు గడువు:** అక్టోబర్ 1, 2019.
- **పరీక్ష తేదీలు:** 2020, ఫిబ్రవరి 01, 02, 08, 09.
- **గేట్ 2020 ఫలితాల వెల్లడి:** మార్చి 16, 2020.
- **దరఖాస్తు ఫీజు:**
  - సెప్టెంబర్ 24 వరకు దరఖాస్తు చేసుకుంటే ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ/మహిళా అభ్యర్థులకు రూ.750; ఇతర అభ్యర్థులకు రూ.1500.
  - సెప్టెంబర్ 24 తర్వాత నుంచి అక్టోబర్ 1 తేదీ వరకూ దరఖాస్తు చేసుకుంటే... ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ/మహిళా అభ్యర్థులకు రూ.1250; ఇతర అభ్యర్థులకు రూ.2000.
- **వెబ్‌సైట్:** http://gate.iitd.ac.in/poster.php

### చేయాల్సినవి

- గేట్ పరీక్ష గురించి సమగ్రంగా తెలుసుకోవాలి.
- ప్రామాణిక పుస్తకాలు, మెటీరియల్‌ను ఎంచుకోవాలి.
- స్వీయ ప్రిపరేషన్‌కు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి
- వారాంతాల్లో కోచింగ్ మేలు చేస్తుంది.

### చేయకూడనివి

- ఫలితం గురించి అతిగా ఆలోచించడం.
- ఆఫీస్ అనంతరం ఇతర వ్యాపకాలకు సమయం కేటాయించడం.
- లక్ష్యం నుంచి మధ్యలోనే వైదొలగడం.

# ఇంటర్‌తోనే ఐటీ కొలువు!

**ఇంటర్మీడియెట్.. ఆ తర్వాత ఎంట్రెన్స్ టెస్టుల్లో విజయం సాధించి ఇంజనీరింగ్‌లో చేరడం... క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగం కోసం ప్రయత్నించడం... కోర్సు పూర్తయ్యాక ఏదో ఒక కొలువు కోసం నానా తంటాలు..! ఇదంతా తెలిసిందే..! ఇలా కాకుండా ఇంటర్ పూర్తవుతూనే ప్రముఖ ఐటీ సంస్థలో ఉద్యోగంతోపాటు పేరున్న ఇన్‌స్టిట్యూట్‌లో చదువుకునే అవకాశం కూడా లభిస్తే..! అంతకంటే కావల్సిందేముంది అంటాం!! కచ్చితంగా ఇలాంటి అవకాశమే కల్పిస్తోంది దేశంలోని టాప్ సాఫ్ట్‌వేర్ కంపెనీ... హెచ్‌సీఎల్! అదెలాగో తెలుసుకుందామా...!**

- హెచ్‌సీఎల్ వినూత్న ప్రోగ్రాం 'టెక్ బీ'
- ఇంటర్ అర్హతతో ఏడాది శిక్షణ అనంతరం ఉద్యోగం
- శిక్షణలో చేరిన విద్యార్థులకు నెలకు రూ.10 వేల స్టైపెండ్
- శిక్షణ పూర్తయ్యాక రూ.2 లక్షల నుంచి రూ.2.2 లక్షల వార్షిక వేతనం
- ఏడాది శిక్షణకు రూ.2 లక్షల ఫీజు, విద్యార్థులకు రుణ సౌకర్యం
- బిట్స్, శాస్త్ర నుంచి డిగ్రీలు పొందే అవకాశం

ఇంజనీరింగ్ అభ్యర్థులకు దీటుగా సమర్థవంతమైన టెక్ నిపుణులను సిద్ధం చేసేందుకు ప్రముఖ ఐటీ సంస్థ 'హిందుస్థాన్ కంప్యూటర్స్ లిమిటెడ్(హెచ్‌సీఎల్)' వినూత్న ప్రోగ్రాం 'టెక్ బీ'కి శ్రీకారం చుట్టింది. ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులకు సరైన శిక్షణ అందిస్తే ఇంజనీరింగ్ విద్యార్థులతో సమానంగా రాణించగలరనే నమ్మకంతో హెచ్‌సీఎల్ ఈ కొత్త ప్రోగ్రాంను ముందుకు తెచ్చింది. మొదట ఈ ప్రోగ్రాంను ఉత్తరప్రదేశ్, తమిళనాడులో అమలు చేసి అక్కడ మెరుగైన ఫలితాలు చూసిన తర్వాత ఇప్పుడు మరికొన్ని రాష్ట్రాల్లోనూ ప్రవేశపెడుతున్నారు. ప్రధానంగా హెచ్‌సీఎల్ కేంద్రాలు ఉన్న రాష్ట్రాల్లో టెక్‌బీ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఏపీ, తెలంగాణల్లోనూ ఈ టెక్‌బీ ప్రోగ్రాంను అమలు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని రాష్ట్రాల్లో ఈ ప్రోగ్రాంను ప్రవేశపెట్టే దిశగా హెచ్‌సీఎల్ కసరత్తు చేస్తోంది.

### అర్హత

- 60 శాతం మార్కులతో మ్యాథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా ఇంటర్/తత్సమాన కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులు టెక్‌బీ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమకు సమీపంలోని హెచ్‌సీఎల్ క్యాంపస్ లేదా నిర్దేశిత ప్రదేశంలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి.
- మొదట విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఆ తర్వాత హెచ్‌సీఎల్ ఎంపిక కమిటీతో ముఖాముఖి ఉంటుంది. అనంతరం ఆన్‌లైన్ టెస్టు నిర్వహిస్తారు. ఇందులో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, లాంగ్వేజ్ ఎబిలిటీస్‌పై ప్రశ్నలు ఇస్తారు.




జాబ్ ట్రెండ్స్

### రూ.2 లక్షల ఫీజు

టెక్‌బీ ప్రోగ్రాంకు ఎంపికైన విద్యార్థులు రూ.2 లక్షల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. తల్లిదండ్రులకు, విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తారు. హెచ్‌సీఎల్‌లో ఉద్యోగం పొందిన తొలి ఏడాది నుంచి ఫీజును వాయిదాల రూపంలో చెల్లించాలి. ఈ టెక్‌బీ ప్రోగ్రాంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఫీజులో రాయితీలు కూడా అందిస్తారు. శిక్షణ సమయంలో 90 శాతం కంటే ఎక్కువ స్కోరు చేసిన విద్యార్థులకు ఫీజులో పూర్తిస్థాయి రాయితీ ఇస్తారు. 85 శాతం నుంచి 90 శాతం మధ్య స్కోరు చేసిన విద్యార్థులకు 50 శాతం రాయితీ కల్పిస్తారు.

### పదివేల స్టైపెండ్

విద్యార్థులు ఆర్థిక స్వావలంబన పొందేలా.. కోర్సులో చేరిన మొదటి రోజు నుంచే సంపాదించుకునేలా టెక్ బీ ప్రోగ్రామ్‌ను రూపొందించారు. ఈ ప్రోగ్రామ్‌లో చేరిన విద్యార్థులకు నెలకు రూ.10,000 స్టైపెండ్ అందిస్తారు.

### 12 నెలల శిక్షణ

'టెక్ బీ' ద్వారా ఆధునిక టెక్నాలజీలపై శిక్షణ ఇస్తారు. ఈ ట్రెనింగ్ మొత్తం 12 నెలల పాటు ఉంటుంది. మొదటి 9 నెలలు క్లాస్ రూమ్ శిక్షణ, ఆ తర్వాత 3 నెలలు ఆన్ జాబ్ ట్రైనింగ్ ఇస్తారు. విద్యార్థులకు వివిధ రకాల టెక్నికల్ కోర్సుల్లో అవగాహన కల్పిస్తారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఫండమెంటల్స్, సాఫ్ట్‌వేర్ టూల్స్, లైఫ్‌స్కిల్స్ తదితర అంశాలపై టెక్ బీ ప్రోగ్రాంలో విద్యార్థులకు శిక్షణ అందిస్తారు. మొదటి మూడు నెలలు ప్రాథమిక శిక్షణ ఉంటుంది. టెక్నాలజీ, డొమైన్ ట్రెనింగ్ తోపాటు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్స్ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చి ఐటీ సేవల రంగంలో జాబ్ రెడీగా తీర్చిదిద్దుతారు. విద్యార్థి ప్రతిభను ఎప్పటికప్పుడు మదింపు చేస్తారు. ప్రాక్టికల్ ఎక్స్‌పోజర్ కోసం అసైన్‌మెంట్లు ఇస్తుంటారు.

### 2 లక్షలకు పైగా వార్షిక వేతనం

విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్న వారిని కంపెనీలోని అప్లికేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సపోర్ట్, టెస్టింగ్, క్యాడ్ సపోర్ట్ విభాగాల్లో నియమిస్తారు. వీరికి రూ.2లక్షల నుంచి రూ.2.2లక్షల ప్రారంభ వార్షిక వేతనం అందుతుంది. ఉద్యోగం చేసే నగరాన్ని బట్టి వేతనాల్లో వ్యత్యాసాలు ఉంటాయి.

### కొలువు+కోర్సు

- టెక్ బీ ప్రోగ్రాంలో చేరే విద్యార్థులు శిక్షణ అనంతరం ప్రముఖ ఐటీ ప్రాజెక్టులపై పని చేస్తూనే.. బిట్స్ పిలానీ, శాస్త్ర యూనివర్సిటీ నుంచి ఉన్నతవిద్యను అభ్యసించే అవకాశముంది. ఈ కోర్సులను వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రాంలుగా వ్యవహరిస్తారు. వీటి కరిక్యులం కూడా హెచ్‌సీఎల్ సంస్థ వినియోగించే టెక్నాలజీల ఆధారంగా రూపొందిస్తారు.
- టెక్‌బీ ప్రోగ్రాం పూర్తిచేసిన విద్యార్థులు బిట్స్ పిలానీ నుంచి బీఎస్సీ(డిజైన్ అండ్ కంప్యూటింగ్), ఎంఎస్సీ/ఎంటెక్ క్లాసులకు హాజరుకావొచ్చు. వీరికి క్లాసులు హెచ్‌సీఎల్ క్యాంపస్‌లోనే నిర్వహిస్తారు.
- శాస్త్ర యూనివర్సిటీ బీసీఏ/ఎంసీఏ ప్రోగ్రాంలను హెచ్‌సీఎల్ క్యాంపస్‌ల్లో నిర్వహిస్తుంది. ఈ రెండు కోర్సులు ప్రత్యేకంగా హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాం పూర్తిచేసిన విద్యార్థులకు మాత్రమే.
- బిట్స్ పిలానీ కోర్సులకు ఫీజులను పాక్షికంగా, శాస్త్ర యూనివర్సిటీ కోర్సులకు ఫీజులను పూర్తిగా హెచ్‌సీఎల్ భరిస్తుంది.


### టెక్ బీ.. ముఖ్యాంశాలు

- **అర్హత:** ఇంటర్
- **కాల వ్యవధి:** 12 నెలలు
- **కోర్సు ఫీజు:** రూ.2లక్షలు
- **స్టైపెండ్:** నెలకు రూ.10 వేలు
- బిట్స్ పిలానీ, శాస్త్ర యూనివర్సిటీల్లో కోర్సులు.
- **వెబ్‌సైట్:** www.hcltechbees.com

## ఉద్యోగ సమాచారం

### బీఈసీఐఎల్‌లో 2684 పోస్టులు

ప్రభుత్వ రంగ సంస్థ, మినీరత్న కంపెనీ.. బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్).. ఒప్పంద ప్రాతిపదికన దేశవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల్లో పనిచేసేందుకు స్కిల్డ్, అన్‌స్కిల్డ్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.



**ఖాళీల వివరాలు:**

- **స్కిల్డ్ మ్యాన్‌పవర్:** 1336
- **అన్‌స్కిల్డ్ మ్యాన్‌పవర్:** 1342
- **కన్సల్టెంట్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్):** 4
- **అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్:** 2

**అర్హతలు:**

- స్కిల్డ్ మ్యాన్‌పవర్‌కు ఎలక్ట్రికల్ ట్రేడ్ లేదా వైర్‌మెన్‌లో ఐటీఐ సర్టిఫికెట్ లేదా సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా. కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి.
- అన్‌స్కిల్డ్ మ్యాన్‌పవర్‌కు 8వ తరగతి ఉత్తీర్ణత. కనీసం ఏడాది అనుభవం తప్పనిసరి.
- కన్సల్టెంట్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) పోస్టులకు బీటెక్(ఎలక్ట్రికల్స్) ఉత్తీర్ణతతోపాటు కనీసం అయిదేళ్ల అనుభవం ఉండాలి.
- అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు బీకామ్/ఎంకామ్/ఎంబీఏ (ఫైనాన్స్)తోపాటు అయిదేళ్ల అనుభవం తప్పనిసరి.
- **వయసు:** 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్/ఓబీసీలకు రూ.500; మిగతా అభ్యర్థులకు రూ.250.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 25.07.2019
- **వెబ్‌సైట్:** www.becil.com

### ఆర్మీలో ఎన్‌సీసీ షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్లు



ఇండియన్ ఆర్మీ 2020, ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్‌లో చేరేందుకు అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

**ఖాళీల వివరాలు:**

- **ఎన్‌సీసీ పురుషులు:** 50
- **ఎన్‌సీసీ మహిళలు:** 5
- **వేతనం:** శిక్షణ సమయంలో నెలకు రూ.56100 స్టైపెండ్ లభిస్తుంది.
- **అర్హతలు:** కనీసం 50 శాతం మార్కులతో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించాలి. ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉండాలి.
- **వయసు:** జనవరి 1, 2020 నాటికి 19-25 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, మెడికల్ టెస్టుల ఆధారంగా
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 8, 2019
- **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in.

సాక్షి స్పోర్ట్స్
సోమవారం
15-7-2019



ఒకప్పుడు సగం ప్రపంచాన్ని ఏలినా...
ఇన్నాళ్లూ ప్రపంచ కప్ మాత్రం వారికి కలే...
మూడుసార్లు కడపటి మెట్టుపై బోల్తా...
ఆపై దరిదాపులకూ రాలేని దీన స్థితి...
నాలుగోసారి మాత్రం ఆ కల నెరవేరింది...
ఓ దశలో కల్లగా మారేలా ఉన్నా కాలం కలిసొచ్చింది...
ఒత్తిడిని పక్కకు నెడుతూ, ఉత్కంఠను తట్టుకుని...
విశ్వ విజేత కిరీటం వారిని వరించింది.
ఔను...!
ఇంగ్లండ్ సాధించింది...
ఎట్టకేలకు వన్డే చాంపియన్ అయింది...
వీడని నీడలాంటి వారి ఆశయం నెరవేరింది...
ఎన్నాళ్లో వేచిన విజయం పలకరించింది...
చాలావరకు సాదాసీదాగా సాగిన ఫైనల్...
ఆఖర్లో అదిరిపోయే హై డ్రామా సృష్టించింది...
మైదానంలో అభిమానులను మునివేళ్లపై నిలిపింది...
టీవీల ముందు ప్రేక్షకులను కన్నార్పకుండా చేసింది...
ప్రపంచ కప్ తుది సమరం 'టై' అవడమే అరుదంటే...
వన్డే క్రికెట్ చరిత్రలోనే తొలిసారి సూపర్ ఓవర్ ఆడిస్తే...
అందులోనూ ఇరు జట్ల స్కోర్లు సమమైతే...
ఇంతకంటే మజా మజా ఏదైనా ఏముంటుంది?
ఏదేమైనా క్రికెట్ పుట్టిల్లు పండుగ చేసుకుంది...
వారి 'ప్రపంచ కల' సొంతగడ్డపైనే నెరవేరింది...
నాలుగేళ్ల వారి శ్రమకు ఫలితం దక్కింది...
రాబోయే నాలుగేళ్లు వారే రారాజని తీర్పొచ్చింది...

# ప్రపంచ కల నెరవేరింది

**వన్డే విశ్వ విజేత ఇంగ్లండ్**

- తొలిసారి ఈ ఘనత అందుకున్న ఆతిథ్య జట్టు
- అత్యంత ఉత్కంఠభరిత పోరులో న్యూజిలాండ్‌పై గెలుపు
- ఇరు జట్ల స్కోర్లు సమమై తొలుత టై అయిన మ్యాచ్
- సూపర్ ఓవర్లోనూ స్కోర్లు సమం
- అత్యధిక బౌండరీల ఆధారంగా ఇంగ్లండ్ మెడలో విజయహారం
- ఆల్‌రౌండర్ స్టోక్స్ అద్భుత ఇన్నింగ్స్
- చివరి వరకు పోరాడినా కివీస్‌కు తప్పని నిరాశ
- వరుసగా రెండోసారి రన్నరప్ హోదాతోనే సరి

**లండన్ :** ఇంగ్లండ్ కల నెరవేరింది. 44 ఏళ్ల వారి సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ఆ దేశ జట్టు ఎట్టకేలకు వన్డే క్రికెట్ ప్రపంచ చాంపియన్‌గా అవతరించింది. క్రికెట్ చరిత్రలోనే అత్యంత ఉత్కంఠతో సాగినదిగా పేర్కొనదగిన వరల్డ్ కప్ ఫైనల్లో వన్ ఓవర్ ఎలిమినేటర్ పద్ధతిలో ఇంగ్లండ్ విజేతగా ఆవిర్భవించింది. ఇక్కడి ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసింది. అర్ధ సెంచరీ సాధించిన ఓపెనర్ హెన్రీ నికోల్స్ (77 బంతుల్లో 55; 4 ఫోర్లు) టాప్ స్కోరర్. వికెట్ కీపర్ టామ్ లాథమ్ (56 బంతుల్లో 47; 2 ఫోర్లు, సిక్స్) రాణించాడు. కివీస్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ విలియమ్సన్ (53 బంతుల్లో 30; 2 ఫోర్లు) స్కోరుకు సమానంగా అదనపు పరుగులు రావడం గమనార్హం. వోక్స్ (3/37), ప్లంకెట్ (3/42)లకు చెరో మూడు వికెట్లు దక్కాయి. చివర్లో హై డ్రామా నడుమ ఇంగ్లండ్ సరిగ్గా 50 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. సూపర్ ఓవర్లోనూ స్కోర్లు (15) సమం కాగా... ఇరు జట్ల ఇన్నింగ్స్‌లో నమోదైన బౌండరీల ఆధారంగా ఇంగ్లండ్‌ను జగజ్జేతగా ప్రకటించారు. ప్రత్యర్థి బౌలర్లు నీషమ్ (3/43), ఫెర్గూసన్ (3/50) వరుసగా వికెట్లు పడగొట్టడం, గ్రాండ్‌హోమ్ (1/25) పొదుపుగా బంతులేయడంతో ఛేదనలో ఇంగ్లండ్ కష్టాలు ఎదుర్కొంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', ఆల్ రౌండర్ బెన్ స్టోక్స్ (98 బంతుల్లో 84 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అద్భుత పోరాటం, బట్లర్ (60 బంతుల్లో 59; 6 ఫోర్లు) చక్కటి ఇన్నింగ్స్‌తో తేరుకుంది.

## నికోల్స్ నిలిచాడు... లాథమ్ ఆడాడు

కివీస్ ఓపెనింగ్ జంట నికోల్స్, గప్టిల్ (18 బంతుల్లో 19, 2 ఫోర్లు, సిక్స్) ఫైనల్లో కాసేపు నిలిచింది. ఆర్చర్ ఓవర్లో సిక్స్, ఫోర్‌తో దూకుడు చూపిన గప్టిల్‌ను వోక్స్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. విలియమ్సన్ జాగ్రత్తగా ఆడాడు. ఎదుర్కొన్న 12వ బంతికి గానీ పరుగు తీయలేకపోయాడు. పవర్ ప్లే అనంతరం ఇద్దరూ వేగం పెంచడంతో కదలిక వచ్చింది. స్వల్ప వ్యవధిలో వీరిని ఔట్ చేసి కివీస్‌కు ప్లంకెట్ షాకిచ్చాడు. అతడి గుడ్ లెంగ్త్ బంతి విలియమ్సన్ బ్యాట్‌ను తాకుతూ కీపర్ బట్లర్ చేతిలో పడింది. అంపైర్ ధర్మసేన ఔటివ్వకున్నా మోర్గాన్ రివ్యూ కోరి ప్రత్యర్థి కెప్టెన్‌ను సాగనంపాడు. అంపైర్ ఎరాస్మస్ తప్పుడు నిర్ణయానికి రాస్ టేలర్ (15) బలయ్యాడు. ఆల్‌రౌండర్ నీషమ్ (25 బంతుల్లో 19; 3 ఫోర్లు) మిడాన్‌లో రూట్‌కు క్యాచ్ ఇచ్చాడు. గ్రాండ్‌హోమ్ (16) అండగా లాథమ్ బండి లాగించాడు. వోక్స్ ఈ ఇద్దరినీ ఔట్ చేసి దెబ్బకొట్టాడు. హెన్రీ (4), సాన్‌ట్నర్ (5 నాటౌట్) చివర్లో భారీ షాట్లు ఆడలేకపోయారు.

## ఇంగ్లండ్ కష్టంగానైనా అందుకుంది...

ఇంగ్లండ్ ఛేదన సులువుగా సాగలేదు. బౌల్ట్ వేసిన ఇన్నింగ్స్ మొదటి బంతే ఓపెనర్ జేసన్ రాయ్ (20 బంతుల్లో 17; 3 ఫోర్లు) ప్యాడ్లను తాకింది. అంపైర్ ఎరాస్మస్ ఔటివ్వకపోవడంతో కివీస్ సమీక్ష కోరింది. బంతి లెగ్ స్టంప్ మీదుగా వెళ్తున్నట్లు తేలడంతో ఎరాస్మస్ నిర్ణయానికి కట్టుబడ్డాడు. హెన్రీ... రాయ్‌ను ఊగిసలాటలో పడేసి వికెట్ దక్కించుకున్నాడు. రూట్ (30 బంతుల్లో 7) స్వేచ్ఛగా ఆడలేకపోయాడు. గ్రాండ్‌హోమ్‌పై ప్రతాపం చూపబోయి వికెట్ ఇచ్చేశాడు. బెయిర్ స్టో (55 బంతుల్లో 36; 7 ఫోర్లు) వికెట్లను ఫెర్గూసన్ గిరాటేశాడు. ఆ వెంటనే మోర్గాన్ (9) పేలవ షాట్‌కు ఔటయ్యాడు. అప్పటికి 23.1 ఓవర్లలో జట్టు స్కోరు 86/4. స్టోక్స్–బట్లర్ ఐదో వికెట్‌కు 130 బంతుల్లో 110 పరుగులు జోడించి మలుపు తిప్పారు. 53 బంతుల్లో బట్లర్, స్టోక్స్ 81 బంతుల్లో అర్ధసెంచరీలు అందుకున్నారు. సమీకరణం 32 బంతుల్లో 46 పరుగులుగా మారి విజయావకాశాలు మెరుగైన స్థితిలో ఫెర్గూసన్ ఓవర్లో బట్లర్ షాట్‌కు యత్నించి ఔటవడం ఉత్కంఠ పెంచింది. స్టోక్స్ పోరాడుతున్నా... వోక్స్ (2)ను పెవిలియన్ చేర్చి కివీస్ మళ్లీ మ్యాచ్‌లోకి వచ్చింది. 49వ ఓవర్లో ప్లంకెట్ (10), ఆర్చర్ (0)లను నాలుగు బంతుల వ్యవధిలో ఔట్ చేసి నీషమ్ ఒత్తిడిని ఆతిథ్య జట్టు మీదకు నెట్టాడు. చివరి ఓవర్లో 15 పరుగులు అవసరం కాగా... బౌల్ట్ తొలి రెండు బంతులకు స్టోక్స్ పరుగులు చేయలేకపోయాడు. మూడో బంతిని సిక్స్ కొట్టాడు. నాలుగో బంతిని డీప్ మిడ్ వికెట్‌లోకి పంపి రెండో పరుగుకు యత్నిస్తుండగా గప్టిల్ త్రో స్టోక్స్‌కు తగిలి 6 పరుగులు వచ్చాయి. లక్ష్యం రెండు బంతుల్లో 3 పరుగులుగా మారింది. రషీద్ (0), వుడ్ (0) రనౌట్లయినా పరుగు వచ్చి మ్యాచ్ టై అయింది.

## చివరి ఐదు ఓవర్లు హైడ్రామా...

ఫైనల్లో చివరి ఐదు ఓవర్ల హైడ్రామా ఇరు జట్ల పోరాటాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లింది. అప్పటికి ఇంగ్లండ్ 30 బంతుల్లో 46 పరుగులు చేయాలి. బట్లర్ రెండు బంతుల ముందే ఔటయ్యాడు. వోక్స్ (46.1), ప్లంకెట్ (48.3), ఆర్చర్ (48.6) ఔటవడంతో కప్ న్యూజిలాండ్‌దే అనిపించింది. కానీ, అటు పరుగులూ రావడంతో ఉత్కంఠ పెరిగింది. చివరి ఓవర్లో స్టోక్స్ సిక్స్, ఓవర్ త్రో రూపంలో 2 ప్లస్ 4 పరుగులు రావడంతో తలకిందులైంది.

## బౌల్ట్ క్యాచ్... సిక్స్...

మ్యాచ్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన టర్నింగ్ పాయింట్ నీషమ్ ఓవర్లో స్టోక్స్ కొట్టిన సిక్స్ షాట్. 9 బంతుల్లో 22 పరుగులు కావాల్సిన స్థితిలో జరిగిందీ ఘటన. స్టోక్స్ మిడ్ వికెట్‌లోకి భారీ షాట్ ఆడగా... బౌండరీ లైన్ వద్ద బౌల్ట్ చేసిన తప్పిదం దెబ్బకొట్టింది. లైన్‌కు కొన్ని అంగుళాల ముందే బంతిని అందుకున్న బౌల్ట్... అలాఅలా వెనక్కువెళ్తూ బౌండరీ రోప్‌ను తొక్కేశాడు. ఎదురుగా ఫీల్డర్ గప్టిల్ ఉన్నా అతడికి విసిరే ప్రయత్నం చేయలేకపోయాడు. పోనీ, బంతిని లోపలకు విసిరేసినా ఆరు పరుగులు బదులుగా రెండో, మూడో వచ్చేవి. అవేవీ కాకపోగా ఏకంగా సిక్స్ నమోదైంది. బోనస్‌గా స్టోక్స్‌కు లైఫ్ వచ్చింది. ప్రధాన పేసర్ అయిన బౌల్ట్ బౌలింగ్ లోనూ (10 ఓవర్లలో 67 పరుగులు; సూపర్ ఓవర్లో 15 పరుగులు) ఆకట్టుకోలేకపోవడం కివీస్‌కు వేదన మిగిల్చింది.



గప్టిల్‌ను ఓదార్చుతున్న నీషమ్

## సూపర్ ఓవర్ సాగిందిలా...

**ఇంగ్లండ్ 15/0**

బౌలర్: ట్రెంట్ బౌల్ట్

| బంతి | బ్యాట్స్‌మన్ | పరుగులు |
|---|---|---|
| 0.1 | స్టోక్స్ | 3 |
| 0.2 | బట్లర్ | 1 |
| 0.3 | స్టోక్స్ | 4 |
| 0.4 | స్టోక్స్ | 1 |
| 0.5 | బట్లర్ | 2 |
| 0.6 | బట్లర్ | 4 |

**న్యూజిలాండ్ 15/1**

బౌలర్: ఆర్చర్

| బంతి | బ్యాట్స్‌మన్ | పరుగులు |
|---|---|---|
| 0.1 | నీషమ్ | 1(వైడ్) |
| 0.1 | నీషమ్ | 2 |
| 0.2 | నీషమ్ | 6 |
| 0.3 | నీషమ్ | 2 |
| 0.4 | నీషమ్ | 2 |
| 0.5 | నీషమ్ | 1 |
| 0.6 | గప్టిల్ | 1 (రనౌట్) |

నోట్: సూపర్ ఓవర్లోనూ స్కోర్లు 'టై' కావడంతో మ్యాచ్ మొత్తంలో ఎక్కువ బౌండరీలు కొట్టిన ఇంగ్లండ్ విజేతగా నిలిచింది. ఇంగ్లండ్ 26 బౌండరీలు కొట్టగా... న్యూజిలాండ్ 17 బౌండరీలు సాధించింది.

## స్కోరు వివరాలు

**న్యూజిలాండ్ ఇన్నింగ్స్:** గప్టిల్ (ఎల్బీడబ్ల్యూ) వోక్స్ 19; నికోల్స్ (బి) ప్లంకెట్ 55; విలియమ్సన్ (సి) బట్లర్ (బి) ప్లంకెట్ 30; టేలర్ (ఎల్బీడబ్ల్యూ) వుడ్ 15; లాథమ్ (సి) సబ్ (విన్స్) (బి) వోక్స్ 47; నీషమ్ (సి) రూట్ (బి) ప్లంకెట్ 19; గ్రాండ్‌హోమ్ (సి) సబ్ (విన్స్) (బి) వోక్స్ 16; సాన్‌ట్నర్ (నాటౌట్) 5; హెన్రీ (బి) ఆర్చర్ 4; బౌల్ట్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 30; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 241**

**వికెట్ల పతనం:** 1–29, 2–103, 3–118, 4–141, 5–173, 6–219, 7–232, 8–240.

**బౌలింగ్:** వోక్స్ 9–0–37–3; ఆర్చర్ 10–0–42–1; ప్లంకెట్ 10–0–42–3; వుడ్ 10–1–49–1; రషీద్ 8–0–39–0; స్టోక్స్ 3–0–20–0.

**ఇంగ్లండ్ ఇన్నింగ్స్:** జేసన్ రాయ్ (సి) లాథమ్ (బి) హెన్రీ 17; బెయిర్‌స్టో (బి) ఫెర్గూసన్ 36; రూట్ (సి) లాథమ్ (బి) గ్రాండ్‌హోమ్ 7; మోర్గాన్ (సి) ఫెర్గూసన్ (బి) నీషమ్ 9, స్టోక్స్ (నాటౌట్) 84; బట్లర్ (సి) సబ్ (సౌతీ) (బి) ఫెర్గూసన్ 59; వోక్స్ (సి) లాథమ్ (బి) ఫెర్గూసన్ 2; ప్లంకెట్ (సి) బౌల్ట్ (బి) నీషమ్ 10; ఆర్చర్ (బి) నీషమ్ 0; రషీద్ (రనౌట్) 0; మార్క్ వుడ్ (రనౌట్) 0; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (50 ఓవర్లలో ఆలౌట్) 241.**

**వికెట్ల పతనం:** 1–28, 2–59, 3–71, 4–86, 5–196, 6–203, 7–220, 8–227, 9–240, 10–241.

**బౌలింగ్:** బౌల్ట్ 10–0–67–0, హెన్రీ 10–2–40–1, గ్రాండ్‌హోమ్ 10–2–25–1, ఫెర్గూసన్ 10–0–50–3, నీషమ్ 7–0–43–3, సాన్‌ట్నర్ 3–0–11–0.

## గప్టిల్ హీరో... విలన్...

న్యూజిలాండ్‌ను టోర్నీలో దెబ్బకొట్టింది ఓపెనింగ్ వైఫల్యమే. సీనియర్ మార్టిన్ గప్టిల్ ఏమాత్రం రాణించలేక విమర్శల పాలయ్యాడు. అయితే, సెమీఫైనల్లో టీమిండియా వెటరన్ ధోనిని అద్భుత త్రో ద్వారా రనౌట్ చేసి వాటికి కొంతవరకు సమాధానమిచ్చాడు. ఫైనల్లో మళ్లీ విమర్శల పాలయ్యే ప్రదర్శన చేశాడు. బ్యాటింగ్‌లో విఫలమైన అతడు... 50వ ఓవర్ నాలుగో బంతిని ఓవర్ త్రో చేసి ప్రత్యర్థికి నాలుగు పరుగులు సునాయాసంగా ఇచ్చాడు. ఇందులో గప్టిల్ పాత్ర పరోక్షమే అని, కివీస్ దురదృష్టమని అనుకుని సరిపెట్టుకున్నా... సూపర్ ఓవర్ చివరి బంతికి ప్రపంచ కప్ సాధించి పెట్టే రెండు పరుగులు చేయలేకపోయాడు. దీనిని తలుచుకునే ఏమో మ్యాచ్ అనంతరం గప్టిల్ కన్నీటి పర్యంతమయ్యాడు.

## స్టోక్స్... మాస్టర్ స్ట్రోక్...

ప్రపంచ కప్ నెగ్గడం జట్టుగా ఇంగ్లండ్‌కు ఎంత సంబరమో, అంతకుమించి బెన్ స్టోక్స్‌కు వ్యక్తిగతంగా ఆనందదాయకం. ఎందుకంటే అతడి చేతుల మీదుగానే ఇంగ్లండ్‌కు ఒక కప్ (2017 టి20 ప్రపంచ కప్) చేజారింది. భారత్ వేదికగా జరిగిన నాటి కప్ ఫైనల్లో స్టోక్స్ వేసిన చివరి ఓవర్లో కార్లోస్ బ్రాత్‌వైట్ వరుసగా నాలుగు సిక్స్‌లు బాది వెస్టిండీస్‌కు కప్‌ను సాధించి పెట్టాడు. అప్పుడు స్టోక్స్ పిచ్ పైనే కుప్పకూలి రోదించాడు. ఆదివారం నాటి ఫైనల్లో ఆ చేదు అనుభవాన్ని అతడు తన చేతులతోనే చెరిపేసుకున్నాడు. ఇంగ్లండ్ ఓటమికి దగ్గరగా ఉన్నప్పుడు క్రీజులోకి వచ్చిన స్టోక్స్ తన స్ఫూర్తిదాయక ఇన్నింగ్స్‌తో ఒడ్డునపడేశాడు. సహచరులు వెనుదిరుగుతున్నా పట్టు వదలకుండా ఆఖరి వరకు క్రీజులో నిలిచాడు. సూపర్ ఓవర్లోనూ బ్యాటింగ్‌కు వచ్చి బాధ్యతను సంపూర్తిగా నెరవేర్చాడు. టోర్నీలో స్టోక్స్ ఆస్ట్రేలియాపై (89), శ్రీలంకపై (82 నాటౌట్) ఆడిన ఇన్నింగ్స్‌లు ఓటముల కారణంగా వెలుగులోకి రాలేకపోయాయి. ఫైనల్లో మాత్రం అతడి శ్రమకు అత్యద్భుత రీతిలో ఫలితం దక్కింది.

## వరల్డ్ కప్ విశేషాలు

| | |
|---|---|
| **అత్యధిక పరుగులు** రోహిత్ శర్మ (648) | **అత్యధిక వికెట్లు** మిషెల్ స్టార్క్ (27) |
| **అత్యధిక వ్యక్తిగత స్కోరు** డేవిడ్ వార్నర్ (166) | **అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన** షాహీన్ అఫ్రిది (6/35) |
| **అత్యుత్తమ బ్యాటింగ్ సగటు** షకీబ్ అల్ హసన్ (86.57) | **మ్యాచ్‌లో చెత్త బౌలింగ్ ప్రదర్శన** రషీద్ ఖాన్ (9 ఓవర్లలో 110 పరుగులు) |
| **అత్యధిక సెంచరీలు** రోహిత్ శర్మ (5) | **అత్యధిక క్యాచ్‌లు పట్టిన ఫీల్డర్** జో రూట్ (13) |
| **ఎక్కువ 50+స్కోర్లు** షకీబ్ అల్ హసన్ (7 ; ఇందులో 2 సెంచరీలు, 5 అర్ధసెంచరీలు ఉన్నాయి) | **టోర్నీలో అత్యుత్తమ భాగస్వామ్యం** 192 పరుగులు (వార్నర్, ఖాజా) |
| **అత్యధిక సిక్సర్లు** మోర్గాన్ (22) | **ప్లేయర్ ఆఫ్ ద సిరీస్** విలియమ్సన్ |



సాక్షి స్పోర్ట్స్
సోమవారం
15-7-2019

## బ్రిటిష్ గ్రాండ్‌ప్రిలో హామిల్టన్ సిక్సర్

సిల్వర్‌స్టోన్ (ఇంగ్లండ్): ఈ సీజన్‌లో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ మెర్సిడెస్ జట్టు డ్రైవర్, ప్రపంచ చాంపియన్ లూయిస్ హామిల్టన్ ఏడో టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఆదివారం సొంతగడ్డపై జరిగిన బ్రిటిష్ గ్రాండ్‌ప్రిలో హామిల్టన్ విజేతగా నిలిచాడు. 52 ల్యాప్‌ల ఈ రేసును హామిల్టన్ గంటా 21 నిమిషాల 08.452 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. తద్వారా బ్రిటిష్ గ్రాండ్‌ప్రి టైటిల్‌ను అత్యధికంగా ఆరుసార్లు గెలిచిన డ్రైవర్‌గా రికార్డు సృష్టించాడు. ఐదు టైటిల్స్‌తో జిమ్ క్లార్క్ (బ్రిటన్), అలైన్ ప్రోస్ట్ (ఫ్రాన్స్)ల పేరిట ఉన్న రికార్డును హామిల్టన్ సవరించాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన మెర్సిడెస్ జట్టుకే చెందిన వాల్తెరి బొటాస్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు.



# లార్డ్స్ నుంచి లార్డ్స్ వరకు...

**అద్వితీయం ఇంగ్లండ్ ప్రస్థానం ➤ నాలుగో ప్రయత్నంలో ప్రపంచకప్ సొంతం ➤ సమష్టి ప్రదర్శనతో చిరస్మరణీయ ఫలితం**

**1975, జూన్ 7:** ప్రతిష్టాత్మక లార్డ్స్ మైదానంలో జరిగిన ప్రపంచ కప్ తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్ బరిలోకి దిగింది. క్రికెట్‌ను కనుగొన్న దేశం వరల్డ్ కప్ గెలవాలనే కలతో, ఆశలు అడుగుపెట్టిన రోజది.

**2019, జూలై 14:** లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్ విశ్వ విజేతగా నిలిచి సగర్వంగా ట్రోఫీని సొంతం చేసుకున్న రోజు... నాటి కల నెరవేరేందుకు ఇంగ్లండ్‌కు ఏకంగా 44 ఏళ్లు పట్టింది.

సాక్షి క్రీడా విభాగం

గత నాలుగేళ్లలో ఇంగ్లండ్ అద్భుతమైన వన్డే క్రికెట్ ఆడింది. ఎన్నో రికార్డులు ఆ జట్టు పాదాక్రాంతమయ్యాయి. ఏ దశలోనూ భయం, బెరుకు లేకుండా ప్రత్యర్థులపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడుతూ ఆ జట్టు ప్రదర్శించిన జోరు ప్రపంచకప్ గెలుపుపై ఆశలు రేపింది. ఇంగ్లండ్ జట్టు టాప్–20 వన్డే అత్యధిక స్కోర్ల జాబితాలో (అన్ని 350 పరుగులకు మించి) రెండు మినహా మిగిలిన 18 స్కోర్లు 2015 వరల్డ్ కప్ వైఫల్యం తర్వాతే వచ్చాయంటే ఆ జట్టు సాధించిన పురోగతి ఏమిటో అర్థమవుతుంది. ఇందులో 481 పరుగుల ప్రపంచ రికార్డు స్కోరు కూడా ఉంది. ఇదంతా అంత సులువుగా జరగలేదు. కెప్టెన్ మోర్గాన్, కోచ్ ట్రెవర్ బేలిస్ కలిసి మూలాల నుంచి పరిస్థితి మార్చేందుకు సంకల్పించారు. ముందుగా సాంప్రదాయ ముద్ర నుంచి జట్టును బయట పడేసే ప్రయత్నం చేశారు. టెస్టుల్లో దిగ్గజాలే అయినా వన్డే క్రికెట్‌కు పనికి రారంటూ అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్, బెల్‌లాంటి వారిని బయటకు పంపించడంతో జట్టు ప్రక్షాళన మొదలైంది. వారి స్థానాల్లో ఆల్‌రౌండర్లతో జట్టును నింపేశారు. అవసరమైతే పదో నంబర్ ఆటగాడు కూడా బ్యాటింగ్ చేయాల్సి ఉంటుందనే ఆలోచన నిజంగానే చాలా బాగా పని చేసింది. వరుస విజయాలు వచ్చి చేరడంతో గత ఏడాది మేలో తొలిసారి ఇంగ్లండ్ వన్డేల్లో నంబర్‌వన్‌గా నిలిచింది. ఇక అక్కడి నుంచి తదుపరి లక్ష్యం ప్రపంచ కప్ విజయమే. ఆ దారిలో దూసుకుపోయిన మోర్గాన్ సేన తమ దేశంలో సంబరాలు పంచింది.

ఇంగ్లండ్ ఆటగాళ్లకు, అభిమానులకు, బోర్డుకు, ప్రసారకర్తలకు, ప్రకటనదారులకు అందరికీ తెలుసు ఈసారి సాధ్యం కాకపోతే ఇంకెప్పటికీ ఇంగ్లండ్ వన్డే ప్రపంచ కప్ గెలవలేదని. పేరుకే క్రికెట్ ఇంగ్లండ్‌లో పుట్టినా, వన్డే వరల్డ్ కప్ అక్కడే తొలి అడుగు వేసినా... ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేని జట్టుగా అవమాన భారాన్ని ఆ జట్టు ఇంత కాలంగా మోస్తూనే వచ్చింది. ఇంగ్లండ్ ప్రదర్శనపై ఎన్నో విమర్శలు, మరెన్నో జోక్‌లు ప్రచారంలో ఉన్న సంగతీ వారికి తెలియనిది కాదు. గత వరల్డ్‌కప్‌లో ఘోర వైఫల్యం తర్వాతనైతే అసలు ఇంగ్లండ్ టీమ్‌ను ఎవరూ లెక్కలోకి తీసుకోని పరిస్థితి. కానీ కొత్త ఇంగ్లండ్ జట్టు చరిత్రను తిరగరాసింది. అసమాన ఆటతీరుతో సత్తా చాటి ఇన్నేళ్ల ప్రశ్నలకు ఒకేసారి సమాధానం ఇచ్చింది. పాత గాయాలు అంత తొందరగా మానేవి కావు. 1992లో పాకిస్తాన్ బౌలర్ వసీమ్ అక్రమ్ వేసిన రెండు అద్భుత బంతులతో ప్రపంచ కప్ కల చెల్లాచెదురైన తర్వాత మళ్లీ కోలుకునేందుకు ఇంగ్లండ్‌కు 27 ఏళ్లు పట్టింది. న్యూజిలాండ్ కంటే కూడా ఇంగ్లండ్‌కు ఈ విజయం ఎంతో అవసరం. ఒక్కసారి కూడా విశ్వ విజేతగా నిలవలేదన్న పేరును తొలగించుకునేందుకు స్వదేశంలో ఇంతకంటే మంచి అవకాశం వారికి రాదు. దానిని ఒడిసిపట్టుకొని మోర్గాన్ సేన తమ దేశం మొత్తాన్ని ఆనందంలో ముంచెత్తింది.



దాదాపు ఏడాది కాలంగా ఇంగ్లండ్ అభిమానులు 'ఇట్స్ కమింగ్ హోమ్' అంటూ గొంతు చించుకుంటూ హోరెత్తిస్తుండగా మోర్గాన్ సేన కోటి ఆశలతో మైదానంలో తమ ఆట మొదలుపెట్టింది. తొలి మ్యాచ్‌లో 100 పరుగులకు పైగా తేడాతో గెలవగానే ఇంగ్లిష్ సేన సంబరపడిపోయింది. కానీ పాకిస్తాన్‌తో మ్యాచ్ జట్టును నేలకు దించింది. ఆ తర్వాత ఆస్ట్రేలియా కూడా చితక్కొట్టగా, శ్రీలంక చేతిలో ఓటమి పాత ఇంగ్లండ్‌ను గుర్తుకు తెచ్చింది. నిజంగా ఇంగ్లండ్ సెమీస్ చేరకపోయి ఉంటే ఆ క్షణాన ఎన్ని గుండెలు బద్దలయ్యేవో... కానీ భారత్‌పై గెలుపు మళ్లీ ఆశలు నిలబెట్టింది. ఈ విజయం ఇచ్చిన ఆత్మ విశ్వాసమే కివీస్‌నూ ఓడించి దర్జాగా సెమీస్ చేరేలా చేసింది. ఇక ఆస్ట్రేలియాను ఓడించి ఫైనల్ చేరడం జట్టు ఆనందాన్ని రెట్టింపు చేసింది. లీగ్‌లో తమ చేతిలో చిత్తయిన కివీస్‌పై ఫైనల్ అనగానే సహజంగానే అందరిలో అంచనాలు పెరిగిపోయాయి. భారత్‌నే ఓడించిన న్యూజిలాండ్‌ను తక్కువగా అంచనా వేస్తే మూల్యం చెల్లించాల్సి ఉంటుందని ఇంగ్లండ్‌కు తెలుసు. రసవత్తర ఫైనల్ దానిని నిజం చేసింది. చివరకు అశేష అభిమానుల జయజయధ్వానాలతో సగర్వంగా ట్రోఫీని ఎత్తుకుంది.

ఇంగ్లండ్ విజయంలో అందరికీ సమష్టి పాత్ర ఉంది. ఓపెనర్లుగా బెయిర్‌స్టో (532 పరుగులు), జేసన్ రాయ్ (443 పరుగులు) అద్భుత ఆరంభాలు అందిస్తే, జో రూట్ (556 పరుగులు), స్టోక్స్ (465 పరుగులు), బట్లర్ (312 పరుగులు) మధ్యలో దానిని కొనసాగించారు. మోర్గాన్ (371 పరుగులు) బ్యాట్స్‌మన్‌గా కంటే కెప్టెన్‌గా తనదైన ముద్ర చూపించగలిగాడు. ఫైనల్లో స్టోక్స్, బట్లర్ ఆడిన ఆట గురించి ఎంత చెప్పినా తక్కువే. లోతైన బ్యాటింగ్ వనరులు ఉండటం కూడా జట్టుకు కలిసొచ్చింది. ఇక బౌలింగ్‌లో ఆర్చర్ (20 వికెట్లు) అత్యధిక వికెట్లతో చెలరేగితే వుడ్ (18 వికెట్లు), వోక్స్ (16 వికెట్లు) ప్రత్యర్థులను కట్టిపడేశారు. ప్లంకెట్ 11 వికెట్లే తీసినా అవి కీలక సమయంలో జట్టుకు అవసరమైనప్పుడు వచ్చాయి. అందరిలోకి స్టోక్స్ గురించి ప్రత్యేకంగా చెప్పాలి. 2016 టి20 ఫైనల్ చివరి ఓవర్లో వరుసగా నాలుగు సిక్సర్లు ఇచ్చి కప్ కోల్పోవడానికి కారణమైన అతనికి ఇది పాపపరిహారంగా చెప్పుకోవచ్చు. ఫైనల్లో చివరి వరకు నిలబడి అతను జట్టును గెలిపించాడు. అయితే ఐదు అర్ధసెంచరీలు ఇంగ్లండ్ విజయ యాత్రలో కీలక పాత్ర పోషించాయి.

### కివీస్ కొట్టిన దెబ్బ తర్వాతే...

గత ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ చేతిలో పరాజయం తర్వాత ఇంగ్లండ్ క్వార్టర్ ఫైనల్ అవకాశం కోల్పోయింది. కానీ దానికి ముందే ఈ టోర్నీలో ఆ జట్టు చావుదెబ్బ తింది. లీగ్ దశలో న్యూజిలాండ్ చేతిలో ఎదురైన ఘోర పరాజయమే ఇంగ్లండ్‌ను అతలాకుతలం చేసింది. మోర్గాన్ మాటల్లో చెప్పాలంటే మమ్మల్ని అత్యంత అథమ స్థితికి చేర్చిన రోజది. మేం పాతాళంలో పడిపోయినట్లుగా అనిపించింది... నాటి మ్యాచ్‌లో ఇంగ్లండ్ 33.2 ఓవర్లలో 123 పరుగులకే ఆలౌట్ కాగా... న్యూజిలాండ్ 12.2 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. సౌతీ దెబ్బకు 19 పరుగులకే ఇంగ్లండ్ చివరి 7 వికెట్లు కోల్పోయింది. అదే న్యూజిలాండ్‌ను ఫైనల్లో ఓడించి ఇంగ్లండ్ పునరుజ్జీవం పొందడం విశేషం.

# జయహో జొకోవిచ్

**వింబుల్డన్ పురుషుల సింగిల్స్ టైటిల్ నిలబెట్టుకున్న సెర్బియా స్టార్**

- మారథాన్ ఫైనల్లో ఫెడరర్‌పై విజయం
- రూ.20 కోట్ల 20 లక్షల ప్రైజ్‌మనీ సొంతం
- రెండు మ్యాచ్ పాయింట్లు చేజార్చుకున్న స్విస్ దిగ్గజం

**సమఉజ్జీల పోరంటే ఇది. అసలు సిసలు ఫైనల్ అంటే కచ్చితంగా ఇదే! అలసటే ఉత్సాహం తెచ్చుకున్న సమరంలో దిగ్గజం ఫెడరర్ పోరాడి ఓడగా... డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్ టైటిల్ నిలబెట్టుకున్నాడు. వింబుల్డన్ ఫైనల్ వేదిక ఐదు సెట్ల దాకా ఆడించింది. ప్రేక్షకుల్ని 4 గంటల 57 నిమిషాలపాటు కూర్చోబెట్టింది. ఆఖరి దాకా నువ్వానేనా అన్నట్లు టైటిల్ కోసం ఈ పోరాట యోధులిద్దరూ యుద్ధమే చేశారు. తుదకు కీలకదశలో సంయమనంతో ఆడిన జొకోవిచ్ పైచేయి సాధించాడు. తన కెరీర్‌లో ఐదోసారి వింబుల్డన్ టైటిల్‌ను, 16వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు.**

**లండన్:** టాప్ సీడ్ల మధ్య జరిగిన ఆఖరి సమరంలో అంతిమ విజయం జొకోవిచ్‌కు దక్కింది. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో ప్రపంచ నంబర్ వన్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) 7–6 (7/5), 1–6, 7–6 (7/4), 4–6, 13–12 (7/3)తో రెండో సీడ్ రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్)పై గెలుపొందాడు. ఐదు సెట్ల పోరాటంలో మూడు సెట్లను టైబ్రేక్‌లే తేల్చాయి. ఏస్‌ల రారాజు ఫెడరర్ ఏకంగా 25 ఏస్‌లు సంధించినప్పటికీ టైబ్రేక్‌లో వెనుకబడటంతో రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. విజేత జొకోవిచ్ 10 ఏస్‌లు సంధించి, 52 అనవసర తప్పిదాలు చేశాడు. స్విస్ స్టార్ 61 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. 94 విన్నర్లు కొట్టిన ఫెడరర్, ఆరుసార్లు డబుల్ ఫాల్ట్ చేశాడు. జొకోవిచ్ 54 విన్నర్లు కొట్టాడు. ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో ఐదో టైటిల్ గెలిచిన జొకోవిచ్ ఓవరాల్‌గా 16వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను చేజిక్కించుకున్నాడు. ఓపెన్ శకం మొదలయ్యాక టాప్ సీడ్, రెండో సీడ్ వింబుల్డన్ ఫైనల్లో తలపడటం ఇది 14వసారి. 2015లోనూ ఈ ఇద్దరు టైటిల్ కోసం పోటీపడగా ఫెడెక్స్‌పై జొకోవిచే గెలిచాడు. విజేతగా నిలిచిన జొకోవిచ్‌కు 23 లక్షల 50 వేల పౌండ్లు (రూ. 20 కోట్ల 26 లక్షలు)... రన్నరప్ ఫెడరర్‌కు 11 లక్షల 75 వేల పౌండ్లు (రూ. 10 కోట్ల 13 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

### ఆరంభం నుంచే హోరాహోరీ...

ఇద్దరి ఆట ఆరంభం నుంచే వేటగా మారింది. అందుకే ఒక్క సెట్ మినహా మిగతా అన్ని సెట్లు నువ్వానేనా అన్నట్లే సాగాయి. ముందుగా 58 నిమిషాల పాటు జరిగిన తొలి సెట్‌లో ఎవరి సర్వీస్‌ను వారు నిలబెట్టుకోవడంలో సఫలమయ్యారు. డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్ ఒక గేమ్ గెలిస్తే... మరో గేమ్ ఫెడరర్ నెగ్గాడు. ఇలా 12 గేమ్‌ల దాకా సాగిన తొలి సెట్‌లో ఇద్దరూ ఆరేసి పాయింట్లు సంపాదించారు. దీంతో ఫలితం తేల్చేందుకు టైబ్రేక్ అనివార్యమైంది. టైబ్రేక్‌లో సెర్బియన్ అంత చురుగ్గా ఫెడరర్ షాట్లకు పదును పెట్టలేకపోయాడు. దీంతో ఫెడెక్స్ తొలి సెట్‌ను కోల్పోయాడు.

### రెండో సెట్ మినహా...

తుది పోరులో ఈ రెండో సెట్ మినహా అన్నీ సెట్లు యుద్ధాన్ని తలపించాయి. ఈ సెట్‌లో ఫెడెక్స్ ఫోర్‌హ్యాండ్, బ్యాక్ హ్యాండ్ షాట్లతో చెలరేగాడు. ప్రత్యర్థి కంటే రెట్టింపు వేగంతో కదం తొక్కడంతో జొకో ఆటలేవీ సాగలేదు. దీంతో ఫెడరర్ జోరుకు తిరుగేలేకుండా పోయింది. ఆరంభం నుంచి చకచకా పాయింట్లు సాధిస్తుండటంతో వరుస గేముల్లో రోజర్ గెలుస్తూ వచ్చాడు. రెండు బ్రేక్ పాయింట్లతో పాటు తన సర్వీస్‌లను నిలబెట్టుకోవడంతో కేవలం 15 నిమిషాల్లోనే ఫెడరర్ 4–0తో ఆధిపత్యం చాటాడు. అదేపనిగా అనవసర తప్పిదాలు చేసిన సెర్బియన్ స్టార్ ఒక్క గేమ్ అయిన గెలకుండానే సెట్ కోల్పోయే ప్రమాదంలో పడ్డాడు. చివరకు ఐదో గేమ్‌లో సెర్బియన్ స్టార్‌కు గేమ్ గెలిచే పట్టుచిక్కింది. తన సర్వీస్‌ను నిలబెట్టుకోవడంతో 1–4తో స్విస్ స్టార్ జోరుకు ఎదురు నిలిచాడు. వెంటనే తేరుకున్న ఫెడరర్ మరో బ్రేక్ పాయింట్‌తో పాటు సర్వీస్ నిలబెట్టుకొని సెట్‌ను 6–1తో గెలిచాడు.



### టైబ్రేక్‌లో జొకో జోరు...

మూడో సెట్ కూడా తొలి సెట్‌నే తలపించింది. ప్రతి పాయింట్ కోసం ఇద్దరు శక్తికి మించే శ్రమించారు. 52 నిమిషాల పాటు జరిగిన ఈ సెట్‌లో ఫెడరర్ తన ప్రత్యర్థిపై 4 ఏస్‌లతో విరుచుకుపడినప్పటికీ 12 అనవసర తప్పిదాలు ఫలితంపై ప్రభావం చూపాయి. ఈ సెట్ కూడా 6–6దాకా సాగడంతో టైబ్రేక్ తప్పలేదు. ఇందులో సెర్బియన్ స్టార్ వయసుపైబడిన ఫెడెక్స్‌పై సహజంగా తన దూకుడు కనబరచడంతో సెట్ దక్కించుకున్నాడు. నాలుగో సెట్‌లో మళ్లీ ఫెడరర్ జోరు పెంచాడు. ఇందులో సుదీర్ఘ ర్యాలీలు జరిగిన ప్రతీసారి ఫెడరర్ విన్నర్లు సంధించి సెట్‌ను గెలుపొందాడు. నిర్ణాయక ఐదో సెట్ హోరాహోరీగా సాగింది. ఒక దశలో 8–7తో ఆధిక్యంలో ఉన్నపుడు తన సర్వీస్‌లో ఫెడరర్ 40–15తో రెండు మ్యాచ్ పాయింట్లు సంపాదించాడు. అయితే జొకోవిచ్ తేరుకొని ఈ గేమ్‌లో ఫెడరర్ సర్వీస్‌ను బ్రేక్ చేసి స్కోరును 8–8తో సమం చేసి మ్యాచ్‌లో నిలిచాడు. ఆ తర్వాత ఆఖరి సెట్ కటాఫ్ స్కోరు 12–12 దాకా జరిగింది. ఇక్కడ టైబ్రేక్ నిర్వహిస్తే మళ్లీ జొకోవిచే పైచేయి సాధించడంతో టైటిల్ వశమైంది. ఈ సీజన్‌లో సెర్బియన్ స్టార్‌కిది రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్. ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచిన జొకోవిచ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీస్‌లో వెనుదిరిగాడు.

# సారీ న్యూజిలాండ్...

**ఆఖరి మెట్టుపై అదుపు తప్పిన విలియమ్సన్ బృందం ● ఓడినా అందరి హృదయాలు గెల్చుకున్న వైనం**

సాక్షి క్రీడావిభాగం


ప్రపంచకప్ ఫైనల్లో పాత రూల్స్ అమల్లో ఉంటే ఇంగ్లండ్–న్యూజిలాండ్‌లు సంయుక్త విజేతలుగా నిలిచేవి. కానీ ఈ మ్యాచ్‌లో కివీస్ ఓడిపోయిందంటే సగటు క్రికెట్ అభిమాని కూడా దానిని తమ పరాజయంగా భావిస్తున్నాడు. స్టోక్స్ బ్యాట్‌ను తాకి పోయిన 6 పరుగుల ఓవర్‌త్రో దురదృష్టమో, గప్టిల్ గ్రహచారం బాగా లేని రోజు కావడమో కానీ విలియమ్సన్ సేన విలపించాల్సి వచ్చింది. ఇంత అద్భుతమైన ఆట తర్వాత కూడా బౌండరీ లెక్కల త్రాసుతో ఇంగ్లండ్ పైచేయి కావడం బలవంతంగా కివీ రెక్కలు విరిచేసినట్లయింది. వరుసగా రెండోసారి కూడా న్యూజిలాండ్‌ను ఫైనల్ మ్యాచ్‌లో ఓటమి వెంటాడింది. అయితే ఆ జట్టు గొప్పతనాన్ని ఈ మ్యాచ్ ఫలితం తగ్గించలేదు. ప్రత్యర్థులపై మాటల దాడి చేయకుండా, దూషణలకు పాల్పడకుండా కూడా ప్రపంచ కప్‌లో గొప్ప విజయాలు సాధించవచ్చని ఆ జట్టు నిరూపించింది. కివీస్ క్రికెట్ అనగానే అందరికీ గుర్తొచ్చేది మైదానంలో వారి ప్రవర్తన. తమదైన ఆటను ఆడుకుంటూ గెలుపోటములతో నిమిత్తం లేకుండా క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించడంలో వారికి వారే సాటి. ఫెయిర్ ప్లే అవార్డు అంటూ ఎప్పుడిచ్చినా ఈ మర్యాద రామన్నల బృందానికే దక్కడం పరమ రొటీన్. ఆటగాళ్లపై క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు 2016లో ఐసీసీ డీమెరిట్ పాయింట్ సిస్టంను మొదలు పెట్టింది. అప్పటినుంచి ఇప్పటి వరకు అందరికంటే అతి తక్కువగా ఒకే ఒకసారి శిక్షకు గురైన జట్టు న్యూజిలాండ్. వారి ఆట ఎలా ఉంటుందో చెప్పేందుకు ఇది చాలు.

ఏ టోర్నీలో బరిలోకి దిగినా వారిని 'అండర్‌డాగ్'గానే చూడడం అందరికీ అలవాటైపోయింది. డాగ్ ఏదైనా అసలైన రోజు కరవడం ముఖ్యం అని స్వయంగా విలియమ్సన్ చెప్పినట్లు రెండు అసలు మ్యాచ్‌లలో కివీస్ సత్తా చాటింది. సెమీస్‌లోనే భారత్ ముందు అసలు కివీస్‌ను ఎవరూ పెద్దగా లెక్క చేయలేదు. కానీ అద్భుత వ్యూహంతో ఆ జట్టు అనూహ్య విజయాన్ని అందుకుంది. స్వల్ప స్కోరుకే పరిమితమైనా... పట్టుదలతో ఆడి టీమిండియాను నిలవరించగలిగింది. ఫైనల్లో కూడా నాలుగు ఇంగ్లండ్ వికెట్లు తీసిన తర్వాత విజయానికి బాటలు వేసుకున్న ఆ జట్టు అదే ఒత్తిడిని కొనసాగించలేక పోయింది.

కెప్టెన్‌గా తొలి ప్రపంచ కప్‌లో బ్యాట్స్‌మన్‌గానూ తనదైన ముద్ర వేసిన విలియమ్సన్‌కు దురదృష్టవశాత్తూ ఇతర ఆటగాళ్ల నుంచి ఎక్కువ మద్దతు లభించలేదు. అదే చివరి పోరులో తక్కువ స్కోరుకే పరిమితమయ్యేందుకు కారణమైంది. విలియమ్సన్ 82.57 సగటుతో ఏకంగా 578 పరుగులు చేయగా... రెండో స్థానంలో నిలిచిన టేలర్ మూడు అర్ధ సెంచరీలతో 350 పరుగులకే పరిమితమయ్యాడు. గత వరల్డ్‌కప్‌లో డబుల్ సెంచరీ సహా హీరోగా నిలిచిన గప్టిల్ ఘోర వైఫల్యం జట్టును దెబ్బ తీసింది. 10 ఇన్నింగ్స్‌లలో కలిపి అతను 186 పరుగులు మాత్రమే చేయగలిగాడు.

కివీస్ ఇక్కడి వరకు రాగలిగిందంటే పేస్ బౌలింగ్ త్రయమే కారణం. ఫెర్గూసన్ (21), బౌల్ట్ (17), హెన్రీ (14) కలిపి 52 వికెట్లు పడగొట్టారు. ఈ ముగ్గురిలో ఒక్కరు కూడా ఓవర్‌కు ఐదుకు మించి పరుగులు ఇవ్వలేదంటే ఎంత నియంత్రణతో బౌలింగ్ చేశారో అర్థమవుతుంది. 232 పరుగులు చేసిన నీషమ్ కూడా 15 వికెట్లతో అండగా నిలిచాడు. అయితే చివరకు బ్యాటింగ్ వైఫల్యమే కివీస్‌కు గొప్ప అవకాశాన్ని దూరం చేసింది. అఫ్గానిస్తాన్ మినహా టోర్నీలో 300 దాటని ఏకైక జట్టు న్యూజిలాండే. ఫలితంగా కివీస్ బృందం టైటిల్ కాకుండా మరోసారి హృదయాలు గెలుచుకోవడంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.





## ప్రపంచ చాంపియన్‌షిప్‌కు అనస్ అర్హత

**న్యూఢిల్లీ:** భారత స్టార్ అథ్లెట్, ఆసియా మాజీ చాంపియన్ మొహమ్మద్ అనస్ ప్రపంచ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాడు. చెక్ రిపబ్లిక్‌లో జరిగిన క్లాడ్నో అంతర్జాతీయ మీట్‌లో అనస్ 400 మీటర్ల విభాగంలో 45.21 సెకన్లలో గమ్యానికి చేరి విజేతగా నిలిచాడు. ఈ క్రమంలో 45.24 సెకన్లతో తన పేరిటే ఉన్న జాతీయ రికార్డును బద్దలు కొట్టాడు. అంతేకాకుండా ప్రపంచ చాంపియన్‌షిప్ అర్హత ప్రమాణ సమయాన్ని (45.30 సెకన్లు) అధిగమించాడు. గతేడాది జకార్తా ఆసియా క్రీడల్లో అనస్ 400 మీటర్ల వ్యక్తిగత విభాగంతోపాటు 4x400 పురుషుల, మిక్స్‌డ్ రిలేలో రజత పతకాలు సాధించాడు.

**11 రోజుల్లో మూడో స్వర్ణం... :** మరోవైపు భారత మహిళా యువ అథ్లెట్ హిమ దాస్ 11 రోజుల వ్యవధిలో తన ఖాతాలో మూడో అంతర్జాతీయ స్వర్ణ పతకాన్ని జమ చేసుకుంది. క్లాడ్నో మీట్‌లో హిమ దాస్ 200 మీటర్ల రేసును 23.43 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని సంపాదించింది. ఇంతకుముందు హిమ దాస్ పోలాండ్‌లో జరిగిన పొజ్నాన్ గ్రాండ్‌ప్రి, కుట్నో మీట్‌లలో పసిడి పతకాలు గెలిచింది.

## సెమీస్‌లో ఓడిన సౌరభ్



**ఫులెర్టాన్:** యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత అగ్రశ్రేణి క్రీడాకారుడు సౌరభ్‌వర్మ పోరాటం సెమీఫైనల్లో ముగిసింది. ప్రపంచ 56వ ర్యాంకర్ తనోంగ్‌సక్ సెన్‌సోమ్‌బున్‌సక్ (థాయ్‌లాండ్)తో జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 43వ ర్యాంకర్ సౌరభ్ 9–21, 18–21తో ఓడిపోయాడు. 39 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌లో తేలిపోయిన సౌరభ్ రెండో గేమ్‌లో పోరాడినా ఫలితం లేకపోయింది. సెమీస్‌లో ఓడిన సౌరభ్‌కు 2,175 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ.లక్షా 50 వేలు)తోపాటు 4900 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
15-7-2019

**స్టాక్ మార్కెట్లు** (శుక్రవారం ముగింపు)

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ | 87 ▼ | 38,736 |
| నిఫ్టీ | 30 ▼ | 11,553 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

| విదేశీ సూచీలు | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,244 | ▲ 48 |
| డోజోన్స్ | 27,332 | ▲ 244 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,506 | ▼ 4 |
| డాక్స్ | 12,323 | ▼ 9 |
| షాంఘై | 2,931 | ▲ 13 |
| నికాయ్ | 21,686 | ▲ 42 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | థామస్‌కుక్ | 67.75 | 69.39 |
| £ | బ్రిటన్ పౌండ్ | థామస్‌కుక్ | 84.35 | 87.60 |
| € | యూరో | థామస్‌కుక్ | 75.88 | 78.76 |
| ¥ | జపాన్ ఎన్ (100) | థామస్‌కుక్ | 62.05 | 64.46 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | థామస్‌కుక్ | 47.09 | 49.27 |
| SS | సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 49.63 | 51.40 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.65 | 19.36 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.07 | 19.58 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.39 | 10.75 |

# పెద్దలకూ హెల్త్ పాలసీ




- ప్రీమియం మాత్రం ఖరీదు
- అయినా సరే తీసుకోవడమే సురక్షితం
- అప్పటికే ఉన్న వ్యాధులకూ కవరేజీ
- కాకపోతే పరిమితులు ఎక్కువ
- కో-పేమెంట్, రూమ్‌రెంట్ క్యాప్ గమనించాలి
- పాలసీ లేకపోతే ఆర్థికంగా బోలెడు భారం



**చెన్నైకి చెందిన సుమీత్ (60) ఇటీవలే పదవీ విరమణ చేశాడు. ప్రైవేటు రంగంలో పనిచేసినంత కాలం సంస్థ తరఫున గ్రూపు హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ అతడి కుటుంబ సభ్యుల అవసరాలను ఆదుకుంది. కానీ, ఉద్యోగానికి విరామం తీసుకోవడంతో ఇకపై తనకు హెల్త్ కవరేజీ ఉండదన్న విషయం తెలుసుకుని అతడు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యాడు. పోనీ, ఈ వయసులో హెల్త్ పాలసీ తీసుకుందామనుకున్నా... అతి సాధ్యమేనా? అన్నది అతడి సందేహం. అప్పటికే సుమీత్‌కు అధిక రక్తపోటు సమస్య కూడా ఉంది. ఈ పరిస్థితి సుమీత్ ఒక్కడికే కాదు... ఎంతో మందికి ఎదురయ్యేదే. కానీ, పరిస్థితులు మారాయి. సీనియర్ సిటిజన్లకు ప్రత్యేకంగా రూపొందించిన హెల్త్ పాలసీలను నేడు ఎన్నో కంపెనీలు అందిస్తున్నాయి. కాకపోతే, ఏ పాలసీ తీసుకోవాలన్నది తేల్చుకోవాలంటే, వాటికి సంబంధించి అన్ని అంశాలనూ తెలుసుకోవాలి. వాటిని తెలియజేసే ఆరోగ్య కథనమే ఇది.**

## ఖరీదైనా సరే...

సాధారణ పాలసీలు అయితే వయసురీత్యా ప్రవేశానికి పరిమితులు ఉంటున్నాయి. ఈ పాలసీలను 60–65 ఏళ్ల తర్వాత తీసుకోవడం కష్టమే. అదే సీనియర్ సిటిజన్ పాలసీలు అయితే, ఏ ఇబ్బంది లేకుండా తీసుకోవచ్చు. ''మా సీనియర్ సిటిజన్ పాలసీ చాలా పెద్ద వయసులో అంటే 65–74 మధ్యనున్న వారు కూడా తీసుకోవచ్చు'' అని స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ జాయింట్ ఎండీ ఎస్.ప్రకాష్ తెలిపారు. అయితే, పెద్ద వయసులో లభించే హెల్త్ పాలసీల ప్రీమియం చౌకగా మాత్రం ఉండదు. ఎందుకంటే వయసు పెరుగుతున్న కొద్దీ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఎక్కువ ఉంటుంది. ''కాస్త చిన్న వయసులోనే పాలసీ తీసుకుంటే నో క్లెయిమ్ బోనస్ ప్రయోజనం లభిస్తుంది. ముందస్తు వ్యాధుల కవరేజీ కోసం వారు వేచి ఉండాల్సిన ఇబ్బంది తప్పుతుంది'' అని జేఎల్‌టీ ఇండిపెండెంట్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ లీడ్ పార్ట్‌నర్ అర్హత్‌గోటడ్కే తెలిపారు. అయితే, ప్రీమియం ఎక్కువైనా కానీ సీనియర్ సిటిజన్లు అనారోగ్యం కారణంగా ఆర్థికంగా గుల్ల కాకుండా ఉండేందుకు హెల్త్ పాలసీ తీసుకోడమే సరైనదన్నది నిపుణులు ఇచ్చే సలహా. ప్రీమియం రూ.25,000– 30,000 ఖరీదుగా భావించొచ్చు. అత్యవసర నిధి కలిగి ఉన్న వారు సైతం హెల్త్ పాలసీ తీసుకోవడం ఎంతో అవసరం అంటున్నారు నిపుణులు. ఏదైనా పెద్ద వ్యాధి బారిన పడితే మీ మొత్తం నిధి అంతా కరిగిపోవచ్చు. అందువల్ల పెద్దలకు పాలసీనే ఎంతో శ్రేయస్కరమని నిపుణుల సూచన.



**ప్రీమియం అంచనాలు**

| కంపెనీ | పాలసీ పేరు | వ్యక్తిగత పాలసీ | కుటుంబ పాలసీ |
|---|---|---|---|
| ఓరియంటల్ ఇన్సూరెన్స్ | హోప్ పాలసీ | రూ.21,670 | అందుబాటులో లేదు |
| స్టార్ హెల్త్ | సీనియర్ సిటిజన్ రెడ్‌కార్పెట్ | రూ.21,240 | రూ.45,135 |
| బజాజ్ అలియాంజ్ | సిల్వర్ హెల్త్‌ప్లాన్ | రూ.23,632 | అందుబాటులో లేదు |
| అపోలో మ్యునిచ్ | ఆప్టిమా సీనియర్ | రూ.26,612 | అందుబాటులో లేదు |
| రెలిగేర్ హెల్త్ ఇన్సూరెన్స్ | కేర్ సీనియర్ | రూ.17,345 | రూ.39,374 |

**నోట్: ఈ టేబుల్‌లో వ్యక్తిగత పాలసీ అయితే రూ.5 లక్షల కవరేజీకి, 60-65 ఏళ్ల ప్రవేశ వయసు ఆధారంగా ప్రీమియం వివరాలు ఇవి. అలాగే, ఫ్యామిలీ పాలసీలో రూ.10 లక్షల కవరేజీకి, దంపతుల్లో భర్త వయసు 62 ఏళ్లు, భార్య వయసు 60 ఏళ్ల ఆధారంగా ప్రీమియం అంచనాలు ఇవి.**

### అపోహలు

అప్పటికే ఆరోగ్య సమస్యలు ఉన్న వృద్ధులకు హెల్త్ పాలసీలు లభించడం కష్టమని చాలా మంది భావిస్తుంటారు. కష్టమైనా కానీ, హెల్త్ కవరేజీ పొందడం అసాధ్యమేమీ కాదని బ్యాంక్ బజార్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ నవీన్ చందాని అన్నారు. వేతన జీవుల్లో ఎక్కువ మంది సాధారణంగా తమ వృద్ధులైన తల్లిదండ్రుల కోసం ప్రత్యేకంగా పాలసీ తీసుకోరు. గ్రూపు హెల్త్ పాలసీలో వారికి కూడా కవరేజీ ఉండడం వల్లే అలా చేస్తుంటారు. ''కార్పొరేట్ హెల్త్ కవరేజీ రూ.2–5 లక్షలకు మించదు. కనుక ఇది సరిపోదు. ఒకవేళ ఉద్యోగం కోల్పోయినా లేక ఉద్యోగం వీడి సొంతంగా వ్యాపారం ప్రారంభించాలనుకుంటే ఏం చేస్తారు?'' అని ప్రశ్నించారు బత్వాల్. అలాగే, వృద్ధులు తమ దృష్టికి వచ్చిన హెల్త్‌పాలసీ తీసుకోవడానికే మొగ్గు చూపుతుంటారు. అయితే, అలా చేయడానికి ముందు అందులో ఉన్న ప్రయోజనాలు, మినహాయింపులు అన్నింటినీ తెలుసుకోవాలన్నది నిపుణుల సూచన. ఎన్నో ఆప్షన్లు అందుబాటులో ఉంటున్నాయని, అన్నింటినీ పరిశీలించిన తర్వాతే తమకు అనువైన పాలసీని ఎంచుకోవాలని సూచిస్తున్నారు. పెద్ద వయసులో తీసుకునే పాలసీలో ముఖ్యంగా చూడాల్సినది బీమా కవరేజీ మొత్తం పెంచుకోవడానికి అవకాశం ఉందా? అని. పైలట్ పాలసీ కాకుండా పూర్తి స్థాయి పాలసీ తీసుకోవాలి. అప్పటికే ఉన్న వ్యాధుల కవరేజీకి ఎంత కాలం వేచి ఉండాలన్నది కూడా పరిశీలించాలి. ''ఇది 18 నెలల నుంచి నాలుగేళ్ల వరకు ఉంటుంది. తక్కువ వెయిటేజీ పీరియడ్ ఉన్న పాలసీని ఎంచుకోవాలి'' అని సింబో ఇన్సూరెన్స్ సీఈవో అనిక్ జైన్ సూచించారు. ఇక సీనియర్ సిటిజన్ పాలసీల్లో కోపేమెంట్ (క్లెయిమ్‌లో పాలసీదారులు తమ వంతు వెచ్చించాల్సిన మొత్తం) ఎక్కువగా ఉంటుంది. ''10 శాతం కోపేమెంట్ అయితే ఫర్వాలేదు. 30 శాతం అయితే చాలా కష్టమవుతుంది'' అని జైన్ అన్నారు.

### అన్ని వివరాలు వెల్లడించడమే మేలు

హెల్త్ పాలసీకి దరఖాస్తు చేసుకోవడానికి ముందుగా ఓ పేపర్‌పై మీకున్న ఆరోగ్య సమస్యల వివరాలన్నీ నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత హెల్త్‌పాలసీ ప్రపోజల్ ఫామ్‌లో ఆ వివరాలన్నింటినీ వెల్లడించడం మంచి నిర్ణయం అవుతుంది. ఎందుకంటే పూర్తి వివరాలు వెల్లడించకపోవడం క్లెయిమ్‌లు తిరస్కరణకు కారణమవుతున్న వాటిల్లో ముఖ్యమైనది. పాలసీ పత్రంలోని అన్ని నియమ, నిబంధనలు, షరతులను పూర్తిగా చదవడం మంచిది.

### ప్రపోజల్ తిరస్కరణ

సీనియర్ సిటిజన్ పాలసీల్లో ప్రపోజల్ తిరస్కరణ ఎదురయ్యే అవకాశాలు లేకపోలేదు. ఒకవేళ ఒక కంపెనీ పాలసీ ప్రపోజల్‌ను తిరస్కరిస్తే, మరో కంపెనీ నుంచి పాలసీ తీసుకునేందుకు ప్రయత్నించాలి. అంతేకానీ, ఈ వయసులో రాదులేనన్న అపోహతో ఆగిపోవద్దు. ఎందుకంటే ఒక్కో కంపెనీకి భిన్నమైన అండర్‌రైటింగ్ విధానాలు ఉండొచ్చు. ఒక కంపెనీ రిస్క్ ప్రపోజల్‌ను కాదనుకుంటే, మరో బీమా కంపెనీ అదే తరహా రిస్క్ కేసులకు పాలసీలను జారీ చేయవచ్చు. ఒకవేళ విడిగా పాలసీ పొందలేకపోతే, అప్పుడు బ్యాంకు ఖాతాదారునిగా గ్రూపు హెల్త్ పాలసీ కోసం ప్రయత్నించొచ్చని జైన్ సూచించారు. ఏ మార్గంలోనూ పాలసీ లభించని వారి ముందున్న మార్గం వైద్య అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవడమే.

# క్రెడిట్ రిస్క్ నిర్వహణ చాలా ముఖ్యం

## పరిశోధన, పోర్ట్‌ఫోలియో నిర్మాణం, పర్యవేక్షణ కీలకం


పృథ్వి పొట్టా
వ్యవస్థాపక భాగస్వామి,
వర్త్ అడ్వైజరీ సర్వీసెస్

**డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో క్రెడిట్ రిస్క్ ఫండ్ అన్నది ఓ విభాగం. తక్కువ రేటింగ్ ఉన్న డెట్ సాధనాల్లో ఈ పథకం ప్రధానంగా ఇన్వెస్ట్ చేస్తుంది. సెబీ మార్గదర్శకాల ప్రకారం... క్రెడిట్ రిస్క్ ఫండ్స్ ప్రధానంగా 65 శాతం పెట్టుబడులను ఏఏ అంతకంటే తక్కువ రేటింగ్ ఉన్న పేపర్లలో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. అధిక రిస్క్ తీసుకునే సామర్థ్యం ఉన్న వారు, వీటిల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా రెండంకెల రాబడులు పొందేందుకు అవకాశాలు ఉండడంతో గత కొన్నేళ్లలో ఈ విభాగం ఎంతో ఆకర్షణీయంగా మారింది. అయితే, ఐఎల్అండ్ఎఫ్ఎస్ రుణ చెల్లింపుల్లో విఫలం అయిన తర్వాత నుంచి, ఈ విభాగం అమ్మకాల ఒత్తిళ్లను ఎదుర్కొన్నది. పలు ఏఎంసీలకు చెందిన ఎన్నో పథకాలు సమస్యాత్మక కంపెనీల డెట్ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేయడంతో, వాటి యూనిట్ల ఎన్ఏవీలు ఒక్క ట్రేడింగ్ సెషన్‌లోనే దారుణంగా పతనమయ్యాయి. ఇది ఇన్వెస్టర్లలో ఆందోళనకు దారితీసింది.**



కొన్ని ప్రతికూల పరిణామాల నేపథ్యంలోనూ... కొన్ని ఏఎంసీల పథకాలు ఈ ప్రతికూల పరిణామాల ప్రభావానికి దూరంగా ఉన్నాయి. కారణం, సమస్యలను ఎదుర్కొంటున్న కంపెనీల డెట్ పేపర్లలో అవి ఇన్వెస్ట్ చేయకపోవడమే. దీంతో ఈ పథకాలు ఎంత భిన్నంగా వ్యవహరించాయి? అనే ప్రశ్న ఇక్కడ ఎదురవుతుంది. ఇందుకు జవాబు... వాటి రిస్క్ నిర్వహణ విధానాలేనని చెప్పుకోవాలి. గత కొన్ని నెలల్లో ఎక్కువగా ప్రభావితం అయిన పథకాల్లోని పెట్టుబడులకు అధిక నష్టం జరగడం... ఫలితంగా ఇన్వెస్టర్లు నాణ్యమైన, బలమైన రిస్క్, నిర్వహణ విధానాలు కలిగిన ఫండ్ హౌస్‌లకు వెళ్లిపోయినట్టు తెలుస్తోంది.

### ఎంపిక ఎలా...?

క్రెడిట్‌రిస్క్ ఫండ్‌ను ఏ విధంగా ఎంచుకోవాలన్న ప్రశ్న ఎదురవుతోంది. దీనికి ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ పాటిస్తున్న రిస్క్, నిర్వహణ మాదిరి విధానాలేనని చెప్పుకోవాలి. ఈ పథకం మెరుగైన రాబడులను ఇవ్వడమే కాకుండా, నష్టదాయక డెట్ పేపర్లకు దూరంగా ఉంది. ఈ ఫండ్ పాటిస్తున్న విధానాలను పరిశీలిస్తే.. ఈ పథకం ఇన్వెస్ట్‌మెంట్ టీమ్ భద్రతతోపాటు, లిక్విడిటీ, రాబడులకు ప్రాధాన్యం ఇస్తోంది. అలాగే, పరిశోధన, పోర్ట్‌ఫోలియో నిర్మాణం, పర్యవేక్షణ వంటి అంశాలతో కూడిన బలమైన నిర్వహణ విధానాలను ఆచరిస్తోంది. ఇక పోర్ట్‌ఫోలియోలో భాగం చేసుకునే ప్రతీ డెట్‌పేపర్‌ను స్వతంత్ర పరిశోధన బృందం క్షుణంగా పరిశీలించడం, రిస్క్ నిర్వహణ టీమ్ ఆమోదం తీసుకోవడాన్ని కూడా గమనించాలి. క్రెడిట్ రేటింగ్ అన్నది కేవలం ఒక అంశమేనని, నిర్ణయం తీసుకోవడానికి ఇదొక్కటే ప్రామాణికం కాదన్నది ఈ ఫండ్ హౌస్ చెబుతోంది. డ్యురేషన్ ఫండ్స్ మాదిరిగా కాకుండా, అక్ర్యూయల్ ఫండ్స్‌లో రాబడుల వెనుక రెండు ముఖ్యమైన అంశాలను చూడాల్సి ఉంటుంది. అవి... రిస్క్ సర్దుబాటుతో కూడిన రాబడుల రేటు, పెట్టుబడుల కాల వ్యవధి. ఏ డెట్ పెట్టుబడికైనా అప్ సైడ్ పరిమితం అనుకున్నప్పుడు, బలమైన రిస్క్ నిర్వహణ కలిగిన మ్యూచువల్ ఫండ్ పథకాల్లోనే ఇన్వెస్ట్ చేయడం మంచిది.

# పావెల్ ‘ప్రకటన’ బలం

- ఫెడ్ రేటు తగ్గింపునకు సంకేతాలు
- వారంలో 20 డాలర్లు పెరిగిన పసిడి
- బంగారానిది బుల్లిష్ ట్రెండేనన్న విశ్లేషణలు



అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో 10 రోజుల క్రితం న్యూయార్క్ ఫ్యూచర్స్ మార్కెట్ నైమెక్స్‌లో ఔన్స్‌కు (31.1గ్రా) 1,440 డాలర్లను తాకిన పసిడి ధర, లాభాల స్వీకరణతో 1,388 డాలర్ల స్థాయిని తిరిగి తాకింది. అయినప్పటికీ 1,366 డాలర్ల పటిష్ట మద్దతు స్థాయిని కోల్పోకపోవడం గమనార్హం. 12వ తేదీ శుక్రవారంతో ముగిసిన వారంలో మళ్లీ 1,423 డాలర్లను చేరింది. చివరకు వారం వారీగా దాదాపు 20 డాలర్లు ఎగసి 1418 డాలర్ల వద్ద ముగిసింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ మందగమనం నేపథ్యంలో ఫెడ్ ఫండ్ రేటు (ప్రస్తుతం 2.25–2.50 శాతం శ్రేణి) తగ్గింపుకు వీలుందని అమెరికా సెంట్రల్ బ్యాంక్ చీఫ్ పావెల్ పంపిన సంకేతాలు పసిడిని మళ్లీ పటిష్ట స్థితికి చేర్చాయి. అయితే వారం వారీగా వెలువడిన ఉపాధి కల్పన గణాంకాలు, ద్రవ్యోల్బణం పెరగడం అమెరికా ఆర్థిక వ్యవస్థకు మళ్లీ కొంత ఊతాన్నిచ్చాయి. చివరకు పసిడి 1,418 డాలర్ల వద్ద ముగిసింది. అయితే అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి వాతావరణం తొలిగిపోతుందన్న విషయంలో స్పష్టత లేకపోవడం, దీనితో డాలర్ ఇండెక్స్ (వారం ముగింపునకు 96.42) భారీగా పెరిగే అవకాశాలు లేకపోవడం, భౌగోళిక ఉద్రిక్తతలు వంటి అంశాలు దీర్ఘకాలంలో బంగారానికి బలాన్ని ఇచ్చే అంశాలేనని నిపుణులు భావిస్తున్నారు. అయితే పసిడి తిరిగి 1,360 డాలర్ల స్థాయి దిగువకు వస్తే, 1,300 డాలర్ల స్థాయిని కూడా చూసే అవకాశం ఉందనీ, ఇది కొనుగోళ్లకు మంచి అవకాశమనీ వారు పేర్కొంటున్నారు.

**భారత్‌లో పరుగునకు ‘రూపాయి’ అడ్డు..**

నిజానికి అంతర్జాతీయంగా ధర పెరిగినప్పటికీ, భారత్‌లో ఆ మేర పెరుగుదల కనిపించడం లేదు. డాలర్ మారకంలో రూపాయి విలువ పటిష్ట (68.68) ధోరణి దీనికి కారణం. దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్– మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో పసిడి ధర శుక్రవారంతో ముగిసిన వారంలో 10 గ్రాములకు 34,905 వద్ద ముగిసింది. అయితే ధర తీవ్రత వల్ల స్పాట్ మార్కెట్‌లో కస్టమర్లు కొనుగోళ్లకు ‘వేచి చూసే’ ధోరణిని అవలంబిస్తున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే సమీపకాలంలో పసిడి ధరలు రూ.30 వేల కిందకు దిగిరాకపోవచ్చన్నది నిపుణుల అభిప్రాయం. ఇక ముంబై స్పాట్ మార్కెట్‌లో 24, 22 క్యారెట్ల ధరలు శుక్రవారం రూ.35,280 రూ.33,600 వద్ద ముగిశాయి.

## ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (జులై-12-2019 అంకెలు శాతాల్లో)

| బ్యాంకులు | 6 నెలలు- ఏడాది | 1–2 ఏళ్లు | 3–5 ఏళ్లు |
|---|---|---|---|
| ఆంధ్రా బ్యాంక్ | 6.6 | 6.8 | 6.75 |
| యాక్సిస్ బ్యాంక్ | 7 | 7.3 | 7.25 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 6.5 | 7 | 6.7 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6.25 | 6.75 | 6.5 |
| కెనరా బ్యాంక్ | 6.7 | 6.7 | 6.4 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6.5 | 6.65 | 6.45 |
| కార్పొరేషన్ బ్యాంక్ | 6.35 | 7 | 6.5 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 7.1 | 7.3 | 7.25 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 6.75 | 7 | 7.25 |
| ఐడీబీఐ బ్యాంక్ | 6.5 | 7.25 | 6.85 |
| ఇండస్‌ఇండ్ బ్యాంక్ | 7.25 | 7.75 | 7.5 |
| కోటక్ మహీంద్రా బ్యాంక్ | 7 | 7.2 | 7 |
| ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ | 6.5 | 6.85 | 6.75 |
| ఎస్‌బీఐ | 6.4 | 7 | 6.7 |
| సిండికేట్ బ్యాంక్ | 6.35 | 7.05 | 7.15 |
| పీఎన్‌బీ | 6.75 | 6.85 | 6.25 |
| యస్ బ్యాంక్ | 7.15 | 7.75 | 7.25 |

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...

# మిడ్‌క్యాప్ ఫండ్స్‌లో మెరుగైన రాబడులు

### ఎల్అండ్‌టీ మిడ్‌క్యాప్ ఫండ్




మిడ్‌క్యాప్ స్టాక్స్ ఇప్పటికే బాగా దిద్దుబాటుకు గురికాగా, అవి ఇంకా నేలచూపులే చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో దీర్ఘకాలానికి మెరుగైన రాబడులు ఆర్జించాలనుకునేవారు మిడ్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్స్‌ను ప్రస్తుత పరిస్థితుల్లో పరిశీలించొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఈ విభాగంలో మంచి పనితీరు కలిగిన పథకాల్లో ఎల్అండ్‌టీ మిడ్‌క్యాప్ కూడా ఒకటి. అయితే, మిడ్‌క్యాప్ స్టాక్స్‌లో రిస్క్ చాలా ఎక్కువగా ఉంటుంది. కనుక రిస్క్ తీసుకునే సామర్థ్యం ఉన్న వారు, అది కూడా సిప్ మార్గంలో ఇన్వెస్ట్ చేయడం మంచిది.

**రాబడులు...:** ఈ పథకం దీర్ఘకాలంలో మంచి రాబడులు ఇచ్చినట్టు పనితీరు తెలియజేస్తోంది. ఈ పథకం పనితీరుకు నిఫ్టీ మిడ్‌క్యాప్ 100ను ప్రామాణికంగా చూస్తున్నారు. ఏడాది కాలంలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100తో పోలిస్తే ఈ పథకం కాస్త వెనుకబడింది. ఈ పథకంలో ఏడాది కాలంలో నష్టాలు 2.9 శాతం స్థాయిలో ఉండగా, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇదే కాలంలో 1.4 శాతం మేర నష్టపోయింది. ఇక మూడేళ్ల కాలంలో ఎల్అండ్‌టీ మిడ్‌క్యాప్ పథకం 12 శాతం, ఐదేళ్లలో 14.6 శాతం చొప్పున వార్షిక రాబడులు ఇచ్చింది. ఇదే కాలంలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 రాబడులు 9.6%, 10.6 శాతంగానే ఉన్నాయి. ఇక పదేళ్ల కాలంలో ఈ పథకం వార్షిక రాబడులు 18 శాతంగా ఉన్నాయి. 2004లో ఈ పథకం ఆరంభమైనప్పటి నుంచి చూస్తే వార్షిక రాబడులు 18.65 శాతంగా ఉండడం గమనార్హం.




**పెట్టుబడుల విధానం.:** పోర్ట్‌ఫోలియోలో వైవిధ్యం, సరైన రంగాల ఎంపిక, వ్యూహాత్మక పెట్టుబడుల కేటాయింపు ఈ పథకం పనితీరుకు కారణాలుగా చెప్పుకోవచ్చు. సెబీ మార్గదర్శకాల ప్రకారం మిడ్‌క్యాప్ పథకాలు మొత్తం పెట్టుబడుల్లో కనీసం 65 శాతాన్ని మిడ్‌క్యాప్ స్టాక్స్‌కు కేటాయించాల్సి ఉంటుంది. మిడ్‌క్యాప్‌లో 65 శాతాన్ని ఇన్వెస్ట్ చేస్తూనే, మార్కెట్లలో అస్థిరతలు పెరిగిన సమయాల్లో లార్జ్‌క్యాప్‌లో పెట్టుబడులను 15 శాతానికి పెంచుకోవడాన్ని ఈ పథకంలో గమనించొచ్చు. ఇక ఈక్విటీల్లో ప్రతికూల పరిస్థితులను అధిగమించేందుకు గాను ఈ పథకం డెట్‌లోనూ కొంత పెట్టుబడులు పెట్టడం లేదా నగదు నిల్వలు పెంచుకోవడం చేస్తుంటుంది. 2015, 2016 మార్కెట్ అస్థిరతల సమయంలో ఈ పథకం ఈక్విటీ పెట్టుబడులను 90 శాతం స్థాయిల్లోనే నిర్వహించింది. ఇక 2018 మార్కెట్ కరెక్షన్ లోనూ ఈక్విటీ పెట్టుబడులను 85–93 శాతం మధ్య కొనసాగించడం గమనార్హం. ముఖ్యంగా ఏడాది కాలంలో ఈ పథకంలో నష్టాలు, బెంచ్ మార్క్‌తో పోలిస్తే కొంచెం ఎక్కువే ఉన్నప్పటికీ... 2018లో మిడ్‌క్యాప్ స్టాక్స్ బాగా పడిపోయిన సమయంలో మాత్రం బెంచ్ మార్క్‌తో పోలిస్తే నష్టాలను తక్కువగా 3 శాతానికే పరిమితం చేసింది. ఇక మార్కెట్ ర్యాలీ సమయాల్లోనూ ఈ పథకం పోర్ట్‌ఫోలియోలో నూరు శాతం పెట్టుబడులు ఈక్విటీల్లోనే ఉండకపోవడం గమనించాల్సిన మరో అంశం. ప్రస్తుతం ఈక్విటీ పెట్టుబడులు 91.4 శాతంగా ఉంటే, నగదు, నగదు సమానాలు 8.6 శాతంగా ఉన్నాయి. పథకం పోర్ట్‌ఫోలియోలో 75 స్టాక్స్ వరకు ఉన్నాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్, కన్‌స్ట్రక్షన్, ఇంజనీరింగ్ రంగాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది.

**ఈక్విటీ టాప్ హోల్డింగ్స్**

| కంపెనీ | పెట్టుబడుల శాతం |
|---|---|
| ఆర్‌బీఎల్ బ్యాంకు | 3.77 |
| సిటీ యూనియన్ బ్యాంకు | 3.48 |
| రామ్కో సిమెంట్స్ | 2.68 |
| శ్రీ సిమెంట్ | 2.58 |
| ఏసీసీ | 2.31 |
| అబాట్ ఇండియా | 2.16 |
| ఇమామీ | 2.03 |
| ఇంజనీర్స్ ఇండియా | 1.97 |
| అపోలో హాస్పిటల్స్ | 1.95 |
| ఒబెరాయ్ రియాలిటీ | 1.93 |



ఆశయం మీద దృష్టి పెడితే...
డబ్బు దానంతటదే వస్తుంది!
- టోనీ హై, జాపోస్ సీఈఓ

## బొమ్మ-బొరుసు

# ఇండిగో లొసుగులపై రంగంలోకి సెబీ, కేంద్రం!

- కార్పొరేట్ వ్యవహారాల శాఖ దృష్టి
- గంగ్వాల్ ఆరోపణలపై వివరణకు ఆదేశించే అవకాశాలు



**న్యూఢిల్లీ:** విమానయాన సంస్థ ఇండిగో నిర్వహణ లోపభూయిష్టంగా ఉంటోందంటూ కంపెనీ సహ ప్రమోటరు రాకేశ్ గంగ్వాల్ చేసిన తీవ్ర ఆరోపణలపై ఇటు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ, అటు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ దృష్టి సారించాయి. ఒకవేళ ఆరోపణలు వాస్తవమేనని రుజువైన పక్షంలో కంపెనీ ప్రస్తుతం చేసుకున్న ఒప్పందాలను ప్రభుత్వం రద్దు చేసే అవకాశాలు కూడా ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. నియంత్రణ సంస్థల నిబంధనలను ఉల్లంఘించేలా ఇండిగో నిర్వహణ పాన్‌షాపు కన్నా అధ్వానంగా మారిందని, మరో ప్రమోటరు రాహుల్ భాటియా తాను లబ్ధి పొందేలా ఒప్పందాలు కుదుర్చుకున్నారని ఆరోపిస్తూ గంగ్వాల్ సెబీకి, కేంద్రానికి లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఇందులోని ప్రస్తావించిన ఆరోపణలకు పేరాల వారీగా వివరణనివ్వాలంటూ కంపెనీని కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఆదేశించే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెప్పారు. ఇండిగో మాతృసంస్థ ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్‌లో గంగ్వాల్ గ్రూప్‌నకు 37 శాతం, భాటియా గ్రూప్‌నకు 38 శాతం వాటాలు ఉన్నాయి.

### గంగ్వాల్ రిస్కులు లేకుండా జాగ్రత్తపడ్డారు: భాటియా గ్రూప్

గంగ్వాల్ ఆరోపణలపై భాటియా గ్రూప్ (ఐజీఈ) తాజాగా మరో ప్రకటన చేసింది. కంపెనీని ఆర్థికంగా నిలబెట్టే బాధ్యత ఇద్దరిపైనా సమానంగా ఉన్నప్పటికీ గంగ్వాల్ మాత్రం తనకు రిస్కులు తక్కువగా ఉండేలా చూసుకున్నారని పేర్కొంది. భాటియా, ఆయన తండ్రి కపిల్ భాటియా దాదాపు రూ. 1,100 కోట్ల దాకా సొంత పూచీకత్తునిచ్చారని, గంగ్వాల్ మాత్రం ఈక్విటీ రిస్కులు రూ. 15 కోట్లు కూడా మించకుండా జాగ్రత్తపడ్డారని ఐజీఈ పేర్కొంది. తన బాధ్యతలు సరిగ్గా పాటించని వ్యక్తి ఇప్పుడు కార్పొరేట్ గవర్నెన్స్ లోపించిందంటూ కావాలనే వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించింది.

# ఫలితాలు, ఆర్థికాంశాలే దిక్సూచి..!

- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండిగో, యస్ బ్యాంక్, ఏసీసీ, విప్రో ఫలితాలు ఈవారంలోనే..
- బుధ, గురువారాల్లో జి–7 దేశాల ఆర్థిక మంత్రుల సమావేశం
- సోమవారం డబ్ల్యూపీఐ డేటా



**న్యూఢిల్లీ:** గడిచిన రెండు వారాలుగా నష్టాలను నమోదుచేస్తున్న దేశీ స్టాక్ సూచీలకు ఈవారం కీలకంగా మారనుందని దలాల్ స్ట్రీట్ వర్గాలు భావిస్తున్నాయి. శుక్రవారంనాటి ముగింపుతో రెండు నెలల కనిష్టస్థాయిని నమోదుచేసిన ప్రధాన సూచీలకు క్యూ1 ఫలితాలు, ఆర్థికాంశాలే దిశా నిర్దేశం చేయనున్నాయని అంచనావేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2019–20) తొలి త్రైమాసిక ఫలితాలు ఏమాత్రం ఆశాజనకంగా ఉన్నా.. నిఫ్టీ 11,600 ఎగువన నిలదొక్కుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. నిరాశాజనకంగా ఉంటే మాత్రం మరింత పతనానికి ఆస్కారం ఉందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధనా విభాగం చీఫ్ వినోద్ నాయర్ విశ్లేషించారు. 'కొనసాగుతున్న వాణిజ్య వివాదాలకు తోడు తొలి త్రైమాసిక ఫలితాలు నిరాశపరిస్తే సమీపకాలంలో సూచీలు మరింత నష్టపోయేందుకు ఆస్కారం ఉంది. ఇప్పటికే వాల్యూయేషన్స్ అధిక స్థాయిలో ఉన్నందున ఈ ఫలితాల కీలక అంశం అండర్ పెర్ఫామెన్స్‌కు దారితీసే అవకాశం ఉంది' అని అన్నారు.

**ఆర్ఐఎల్, యస్ బ్యాంక్ ఫలితాలు...**
శుక్రవారం మార్కెట్ ముగిశాక ఐటీ ఇన్ఫోసిస్ ఫలితాలు వెల్లడయ్యాయి. క్యూ1లో కంపెనీ రూ.3,802 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఫలితాల ప్రభావం సోమవారం ఉదయం ఈషేరు కదలికలపై స్పష్టంగా ఉండనుందని, ఈ వారం స్టాక్ స్పెసిఫిక్ కదలికలకు ఆస్కారం ఉందని ఎస్ఎమ్‌సీ ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ అడ్వైజర్స్ చైర్మన్ డీ కే అగర్వాల్ అన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి దిగ్గజ కంపెనీల ఫలితాలు ఈవారంలోనే వెల్లడికానుండగా.. ఫలితాల కారణంగా భారీ ఒడిదుడుకులకు అవకాశం ఉందని అంచనావేశారు. ఇక ఈవారం క్యూ1 ఫలితాలను వెల్లడించనున్న కంపెనీల జాబితాలో.. బజాజ్ కన్స్యూమర్, టాటా మెటాలిక్స్, విప్రో, మణప్పురం, యస్ బ్యాంక్, ఎల్ అండ్ టీ, సైయంట్, ఏసీసీ, ఆర్‌బీఎల్ బ్యాంక్, హిందుస్తాన్ జింక్, ఇండిగో, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఉన్నాయి. ఆర్ఐఎల్ వంటి దిగ్గజ కంపెనీల ఫలితాల ఉన్న కారణంగా స్టాక్ స్పెసిఫిక్స్ యాక్షన్‌కే ఆస్కారం అధికంగా ఉందని సామ్కో సెక్యూరిటీస్ సీఈఓ జిమీత్ మోదీ అన్నారు.

**స్థూల ఆర్థిక అంశాల ప్రభావం..**
పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) డేటా శుక్రవారం వెల్లడి కాగా, ఈ అంశం సోమవారం మార్కెట్ కదలికలను ప్రభావితం చేయనుందని ఎపిక్ రీసెర్చ్ సీఈవో ముస్తఫా నదీమ్ విశ్లేషించారు. ఈఏడాది జూన్ నెల టోకు ధరల ద్రవ్యోల్బణం(డబ్ల్యూపీఐ) గణాంకాలు 15న వెల్లడికానున్నాయి. ఇక బుధ, గురువారాల్లో ఫ్రాన్స్‌లో జరగనున్న జి–7 దేశాల ఆర్థిక మంత్రుల సమావేశంపై కూడా మార్కెట్ వర్గాలు దృష్టిసారించాయి. వాణిజ్య యుద్ధాల సమయంలో ఆర్థిక వ్యవస్థ మందగమనాన్ని ఎదుర్కొనే అవకాశం ఉన్నందున ఈ అంశంపైనే ప్రధానంగా చర్చ జరగనుందని భావిస్తున్నాయి.

**ముడిచమురు ధరల కదలికలు కీలకం..**
గతవారంలో బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ 67 డాలర్లకు సమీపించింది. శుక్రవారం ట్రేడింగ్ ముగింపు సమయానికి 66.88 వద్ద ముగిసింది. ముడిచమురు ధర మరింత పెరితే మార్కెట్‌కు ప్రతికూలం కానుందనేది కమోడిటీ వర్గాల మాట.

### జూలైలో రూ.3,551 కోట్లు ఎఫ్‌పీఐల పెట్టుబడి

భారత్ క్యాపిటల్ మార్కెట్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐ) పెట్టుబడుల పరంపర కొనసాగుతోంది. గడిచినవారంలో వీరు మార్కెట్ నుంచి పెట్టుబడులను వెనక్కి తీసుకున్నప్పటికీ.. ఈనెల్లో ఇప్పటివరకు చూస్తే నికర కొనుగోలుదారులుగానే నిలిచారు. జూలై 1–12 మధ్యకాలంలో రూ.8,505 కోట్లను పెట్టుబడి పెట్టిన ఎఫ్‌పీఐలు.. రూ.4,953 కోట్లను ఉపసంహరించుకోవడం వల్ల వీరి నికర పెట్టుబడి ఇప్పటికి రూ.3,551 కోట్లుగా ఉన్నట్లు డిపాజిటరీ డేటా తెలిపింది.

## గున్న ఏనుగును గుర్తించాలి!

- కొత్త కార్పొరేట్ విశేషణాలు
- వినూత్న పదబంధాలతో ఆరోపణలు



**న్యూఢిల్లీ:** ఇటీవలి కాలంలో కార్పొరేట్ ప్రపంచంలో మోసాలు, వివాదాలు పెరిగిపోతున్న నేపథ్యంలో వీటిని అభివర్ణించేందుకు కొత్త విశేషణాలు కూడా ప్రాచుర్యంలోకి వస్తున్నాయి. పాన్ షాపు కన్నా అధ్వానం, గదిలో గున్న ఏనుగు, కోటరీలు, వ్యక్తిగత సామ్రాజ్యాలు లాంటి పదబంధాలు తెరపైకి వస్తున్నాయి. విమానయాన సంస్థ ఇండిగోలో సహ ప్రమోటరు రాహుల్ భాటియా వల్ల గవర్నెన్స్ లోపాలు పెరిగిపోయాయని, కంపెనీ పరిస్థితి పాన్ షాపు కన్నా అధ్వానంగా మరో ప్రమోటరు రాకేష్ గంగ్వాల్ చేసిన ఆరోపణలు ఈ కోవకి చెందినవే. ఇక కంపెనీల ఖాతాల్లో అవకతవకల గురించి ఇన్వెస్టర్లను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ఆడిటర్లపై ఉంటుందని చెప్పేందుకు కార్పొరేట్ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ ఇలాంటిదే మరో పదప్రయోగం చేశారు. 'ఆడిటర్లు గడ్డివాములో సూదిని వెతకాలని అనడం లేదు. కానీ గది మధ్యలో గున్న ఏనుగు కూర్చున్నట్లు లోపాలు కనిపిస్తుంటే వాటిని పట్టుకు తీరాల్సిందే. అలా కంటికి కనిపిస్తున్న తప్పులను కూడా వదిలేస్తుండటమే అసలు సమస్య' అని వ్యాఖ్యానించారు. అటు ఐఎల్ఎఫ్ఎస్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో అవకతవకల మీద తయారు చేసిన నివేదికలో 'కోటరీ', 'వ్యక్తిగత సామ్రాజ్యాలు' లాంటి పదబంధాలను ఉపయోగించింది.

### బోర్డ్ మీటింగ్స్

టాటా మెటాలిక్స్, బజాజ్ కన్స్యూమర్ కేర్, కొచ్చిన్ మినరల్స్ అండ్ రిటైల్ లిమిటెడ్, గుజరాత్ హోటల్స్, టిన్‌ప్లేట్ కంపెనీ ఆఫ్ ఇండియా

### కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 15-7-2019

| | |
|---|---|
| విశాఖ | 425-00 |
| చిత్తూరు | 428-00 |
| వరంగల్ | 398-00 |
| విజయవాడ | 402-00 |
| నమక్కల్ | 425-00 |
| గోదావరి | 402-00 |
| 14-7-2019 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 395-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 4.55 |

# కంపెనీగా కొనసాగలేమేమో!

- ఆందోళన వ్యక్తం చేసిన డీహెచ్ఎఫ్ఎల్
- క్యూ4లో రూ.2,224 కోట్ల నష్టాలు
- కంపెనీకి ఇవే అత్యధిక నష్టాలు



**న్యూఢిల్లీ:** గత కొన్ని క్వార్టర్లలో జరిగిన పరిణామాల కారణంగా,.. భవిష్యత్తులో కంపెనీగా కొనసాగలేమోనన్న ఆందోళనను హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ, డీహెచ్ఎఫ్ఎల్ వ్యక్తం చేసింది. గత ఆర్థిక సంవత్సరం(2018–19) నాలుగో క్వార్టర్‌లో రూ.2,224 కోట్ల నికర నష్టాలు వచ్చాయని డీహెచ్ఎఫ్ఎల్ తెలిపింది. రూ.3,280 కోట్ల అదనపు కేటాయింపుల కారణంగా ఈ స్థాయిలో నష్టాలొచ్చాయని, తమ కంపెనీ చరిత్రలో ఇదే అత్యధిక నష్టమని పేర్కొంది. అంతకు ముందటి ఆర్థిక సంవత్సరం (2017–18) క్యూ4లో రూ.134 కోట్ల నికర లాభం వచ్చిందని వివరించింది. గత ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.1,036 కోట్ల నికర నష్టాలు వచ్చాయని పేర్కొంది. కాగా గత క్యూ4లో రూ.372 కోట్ల నిర్వహణ లాభం సాధించామని, మొత్తం గత ఆర్థిక సంవత్సరానికి ఇది రూ.2,378 కోట్లని పేర్కొంది.

**ఆర్థికంగా తీవ్ర ఒత్తిడి**
2018, సెప్టెంబర్ తర్వాత రుణాల మంజూరు, రుణ వృద్ధి భారీగా పడిపోయాయని డీహెచ్ఎఫ్ఎల్ తెలిపింది. దీంతో క్యూ3, క్యూ4 ఫలితాలపై తీవ్రమైన ప్రభావం పడిందని, ఇది మొత్తం ఆర్థిక సంవత్సరం పనితీరుపై ప్రభావం చూపించిందని వివరించింది. గత ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగం నుంచి ఆర్థికంగా తీవ్రమైన ఒత్తిడి ఉందని పేర్కొంది.

**వాటా విక్రయంతో 6,900 కోట్లు!:** నిధులు సమీకరించే సత్తాను కోల్పోయామని, వ్యాపారం పూర్తిగా అడుగంటిందని, రుణ మంజూరీలు దాదాపుగా నిలిచిపోయాయని తెలిపింది. ఈ పరిణామాలన్నింటి కారణంగా భవిష్యత్తులో కంపెనీగా కొనసాగగలమో లేమోనన్న సందేహాలు వస్తున్నాయని వివరించింది. పరిష్కార ప్రక్రియ తుది దశలో ఉందని, దీనికి సంబంధించిన ప్రణాళికను త్వరలోనే రుణదాతలకు సమర్పిస్తామని తెలిపింది. మూలధన నిధులందించే వ్యూహాత్మక ఇన్వెస్టర్ అన్వేషణ కూడా దాదాపుగా పూర్తి కావచ్చిందని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలపై మరో రెండు వారాల్లో కంపెనీ డైరెక్టర్ల బోర్డ్ సమావేశమై నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపింది. కాగా కంపెనీ ప్రమోటర్లు.. తమ వాటాలో దాదాపు సగాన్ని ప్రైవేట్ ఈక్విటీ సంస్థలకు విక్రయించి రూ.6,900 కోట్లు సమీకరించాలని యోచిస్తున్నారని సమాచారం. ఈ కంపెనీ ప్రమోటర్లైన వాధ్వాన్ కుటుంబానికి 40 శాతం వాటా ఉంది.

## స్టాక్స్ వ్యూ

### టైటాన్ కంపెనీ | బ్రోకరేజ్ సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్ | కొనొచ్చు

**ప్రస్తుత ధర:** రూ.1,101 **టార్గెట్ ధర:** రూ.1,250

**ఎందుకంటే:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల కాలంలో ఆభరణాల విభాగం పనితీరు అంతంతమాత్రంగానే ఉందని కంపెనీ పేర్కొంది. పుత్తడి ధరలు పెరగడం, వినియోగం తగ్గడం వంటి కారణాల వల్ల ఈ విభాగం ఆదాయం 13 శాతం మాత్రమే పెరిగింది. అయితే ఇతర జ్యూయలరీ కంపెనీల మార్కెట్ వాటా తగ్గుతుండగా, తనిష్క్ బ్రాండ్ మార్కెట్ వాటా పెరుగుతోంది. టీసీఎస్ కంపెనీ నుంచి భారీ ఆర్డర్ కారణంగా వాచ్‌ల విభాగం ఆదాయం 19 శాతం పెరిగింది. పరిశ్రమ ప్రతికూల పరిస్థితుల్లో ఉన్నా, టైటాన్ మార్కెట్ వాటా పెరగడం గతం నుంచి జరుగుతున్న విషయమే. ఇటీవల షేర్ పతనం,... ఈ షేర్ కొనుగోలుకు మంచి అవకాశంగా భావిస్తున్నాం. తనిష్క్ అందించిన స్వయమ్ కలెక్షన్‌కు ఆదరణ బాగా ఉంది. ఈ క్యూ1లో కొత్తగా 12 తనిష్క్ షోరూమ్‌లను ఏర్పాటు చేసిన ఈ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో 70 కొత్త స్టోర్స్‌ను ప్రారంభించనున్నది. ఇక వాచ్‌ల విషయానికొస్తే, టెక్నాలజీ ఎనేబుల్డ్ వాచ్‌లను అందుబాటులోకి తెస్తుండటంతో ఈ విభాగం అమ్మకాలు జోరుగా ఉండగలవని భావిస్తున్నాం. ఆన్‌లైన్ అమ్మకాలు పుంజుకుంటున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అమ్మకాల పనితీరును బట్టి, ఆదాయ, నికర లాభం అంచనాలను స్వల్పంగా తగ్గిస్తున్నాం. అయితే దీర్ఘకాలం దృష్ట్యా చూస్తే, ప్రస్తుత ధరలో కొనుగోలు చేయవచ్చు. దాదాపు ఎలాంటి రుణ భారం లేకపోవడం, రిటర్న్ ఆన్ క్యాపిటల్ ఎంప్లాయిడ్(ఆర్‌ఓసీఈ) 32 శాతానికి పైగా ఉండటం, మార్కెట్ వాటా పెరుగుతుండటం, కొత్త స్టోర్ల ఏర్పాటు, టైటాన్ బ్రాండ్ వేల్యూ...ఇవన్నీ సానుకూలాంశాలు. రెండేళ్లలో ఆదాయం 18 శాతం, నికర లాభం 27 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందగలవని భావిస్తున్నాం.

### శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ | బ్రోకరేజ్ సంస్థ: మోతిలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

**ప్రస్తుత ధర:** రూ.1,047 **టార్గెట్ ధర:** రూ.1,300

**ఎందుకంటే:** ట్రక్కులు, ఇతర వాణిజ్య వాహనాల కొనుగోళ్లకు రుణాలందించే ఈ కంపెనీ విదేశీ వాణిజ్య రుణాలు(ఈసీబీ),రిటైల్ నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) ద్వారా రూ.10,000 కోట్లు సమీకరించింది. అయితే వీటికి ఎక్కువ వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. 2017–18 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రెట్టింపైన తాజా మొండి బకాయిలు గత ఆర్థిక సంవత్సరంలో ఒకింత నిలకడ సాధించాయి. తాజా మొండి బకాయిలు నియంత్రణలోనే ఉన్నాయి. మొండి బకాయిల రద్దు 60 శాతం పెరిగి రూ.2,340 కోట్లకు చేరింది. గత రెండేళ్లలో మొండి బకాయిల రద్దు దాదాపు రెట్టింపైంది. బకాయిల రద్దు భారీగా ఉన్నప్పటికీ, ప్రొవిజన్ కవరేజ్ రేషియో(పీసీఆర్) 35 శాతం రేంజ్‌లో మెయింటైన్ చేస్తోంది. బ్రాంచ్‌ల విస్తరణ ఆరోగ్యకరంగా ఉంది. కొత్తగా 335 బ్రాంచ్‌లను ఏర్పాటు చేసింది. ఇటీవల లిక్విడిటీ సమస్య కారణంగా రుణాల మంజూరీ తగ్గించింది. గత ఆర్థిక సంవత్సరం చివరి ఆరు నెలల కాలంలో ఈ కంపెనీ ఇచ్చిన రుణాలు 25 శాతం తగ్గాయి. ఫలితంగా గత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలలల్లో 22 శాతంగా ఉన్న నిర్వహణ ఆస్తుల వృద్ధి గత ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగంలో 9 శాతానికే పరిమితమైంది. నిర్వహణ ఆస్తుల వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగం నుంచి పుంజుకోగలదని భావిస్తున్నాం. 2020 నుంచి మాత్రమే వృద్ధి పుంజుకోవచ్చు. రిటర్న్ ఆన్ అసెట్(ఆర్ఓఏ) 2.5 శాతంగా, రిటర్న్ ఆన్ ఈక్విటీ(ఆర్ఓఈ) 16 శాతంగా ఉండొచ్చని భావిస్తున్నాం. ప్రతికూలతలున్నా ఈ షేర్ ఏడాది కాలంలో రూ.1,300కు చేరగలదని భావిస్తున్నాం. కొనొచ్చు రేటింగ్‌ను కొనసాగిస్తున్నాం.

**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

## ఎన్‌బీఎఫ్‌సీల ఆస్తుల కొనుగోలుపై త్వరలోనే మార్గదర్శకాలు



**న్యూఢిల్లీ:** ఎన్‌బీఎఫ్‌సీ రంగం లిక్విడిటీ సమస్యల్లో ఉండడంతో, ఈ రంగంలోని కంపెనీల నుంచి రుణ ఆస్తులను కొనుగోలు చేసే విషయమై ప్రభుత్వరంగ బ్యాంకులకు త్వరలోనే కేంద్రం మార్గదర్శకాలు జారీ చేయనుంది. ఆర్థిక శాఖలోని రెండు ప్రధాన విభాగాల మధ్య ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయని, ఎన్‌బీఎఫ్‌సీ రుణ ఆస్తుల కొనుగోలు అర్హత నిబంధనలను ఈ వారం లేదా వచ్చే వారంలో విడుదల చేయనున్నట్టు ఆర్థిక శాఖ అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్థికంగా బలమైన ఎన్‌బీఎఫ్‌సీ సంస్థల నుంచి, రూ.లక్ష కోట్ల వరకు అధిక రేటింగ్ కలిగిన ఆస్తులను ప్రభుత్వరంగ బ్యాంకులు కొనుగోలు చేయనున్నట్టు బడ్జెట్‌లో మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన విషయం తెలిసిందే.

## కరెన్సీ నోట్లను గుర్తించేందుకు ఆర్‌బీఐ 'యాప్'!



**న్యూఢిల్లీ:** చూపులేని వారు సైతం కరెన్సీ నోట్లను సులభంగా గుర్తించగలిగేలా ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తేవడంపై రిజర్వ్ బ్యాంక్ కసరత్తు చేస్తోంది. దీని రూపకల్పన కోసం యాప్స్ తయారీ సంస్థల నుంచి బిడ్స్ ఆహ్వానించింది. మొబైల్ ఫోన్ కెమెరా ముందు నోటును ఉంచితే.. దాని విలువను తెలియజేసే విధంగా యాప్ ఉండాలని ప్రతిపాదించింది. ఒకవేళ కరెన్సీ నోటును కెమెరా ముందు సరైన యాంగిల్‌లో ఉంచని పక్షంలో ఆ విషయాన్ని కూడా తెలియజేసేలా సదరు యాప్ ఆడియో నోటిఫికేషన్ కూడా ఇచ్చేలా ఉండాలి. ప్రస్తుతం రూ. 1, 10, 20, 50,100, 200, 500, 2000 కరెన్సీ నోట్లు చలామణీలో ఉన్నాయి. చూపులేని వారు కూడా గుర్తించే విధంగా రూ. 100 ఆ పైన విలువ చేసే కరెన్సీ నోట్లపై నిర్దిష్ట భాగం ఉబ్బెత్తుగా ఉండేలా ముద్రిస్తున్నారు. పూర్తిగా, లేదా పాక్షికంగా చూపులేని వారి సంఖ్య దేశీయంగా 80 లక్షల దాకా ఉంటుందని అంచనా. ఆర్‌బీఐ యాప్ ప్రతిపాదన.. వీరందరికీ ఉపయోగపడనుంది.

## జూన్‌లో బీమా ప్రీమియం వసూళ్లు రూ.32,241 కోట్లు



**న్యూఢిల్లీ:** ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ జూన్ మాసంలో ప్రీమియం వసూళ్లను రెట్టింపు చేసుకుంది. దీంతో జీవిత బీమా కంపెనీల ఉమ్మడి ప్రీమియం వసూళ్లు జూన్ లో 94 శాతం పెరిగి రూ.32,241 కోట్లుగా నమోదైనట్టు ఐఆర్‌డీఏఐ గణాంకాల ఆధారంగా తెలుస్తోంది. క్రితం ఏడాది జూన్ నెలలో జీవిత బీమా సంస్థల ఉమ్మడి ప్రీమియం వసూళ్లు రూ.16,611 కోట్లుగా ఉన్నాయి. ముఖ్యంగా ఎల్ఐసీ ప్రీమియం వసూళ్లు గణనీయంగా వృద్ధి చెందాయి. క్రితం ఏడాది జూన్ లో రూ.11,167 కోట్లను రాబట్టుకోగా, అది ఈ ఏడాది జూన్ మాసంలో రూ.26,030 కోట్లకు పెరిగింది. దీంతో జీవిత బీమా మార్కెట్‌లో ఎల్ఐసీ వాటా 74 శాతంగా ఉండగా, మిగిలిన 23 కంపెనీలకు కలిపి 26 శాతం వాటా ఉంది. జూన్ లో ఎల్ఐసీ 13.32 లక్షల కొత్త పాలసీలను విక్రయించింది.

**ప్రైవేటులో వృద్ధి కొంతే...:** ప్రైవేటు రంగ సంస్థల ఉమ్మడి ప్రీమియం ఆదాయం వరకే చూసుకుంటే క్రితం ఏడాది జూన్ లో ఉన్న రూ.5,443 కోట్లతో పోలిస్తే 14% వృద్ధితో, ఈ ఏడాది జూన్ మాసంలో రూ.6,211 కోట్లకు చేరుకుంది. ప్రైవేటు రంగ సంస్థల్లో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ నూతన ప్రీమియం ఆదాయం 21% పెరిగి రూ.1,358 కోట్లుగా నమోదైంది.

# కమర్షియల్ పేపర్ అంటే..?


**కమర్షియల్ పేపర్ చెల్లింపుల్లో కంపెనీలు విఫలమయ్యాయంటూ తరచూ వార్తలు వస్తున్నాయి కదా! ఇంతకీ ఈ కమర్షియల్ పేపర్ అంటే ఏమిటి ?** –ఇంతియాజ్, విజయవాడ

కమర్షియల్ పేపర్.... మనీ మార్కెట్ సాధనాల్లో ఒకటి. వీటి మెచ్యూరిటీ కాలం ఒక ఏడాది. వీటిని కంపెనీలు జారీ చేస్తాయి. బ్యాంక్‌లు జారీ చేసే వాటిని సర్టిఫికెట్ ఆఫ్ డిపాజిట్స్‌గా వ్యవహరిస్తే, కంపెనీలు జారీ చేసే మనీ మార్కెట్ ఇన్‌స్ట్రుమెంట్‌ను కమర్షియల్ పేపర్‌గా వ్యవహరిస్తారు. ఇది స్థిర ఆదాయ సాధనం. వీటిల్లో డెట్ ఫండ్స్ ఇన్వెస్ట్ చేస్తాయి. వీటి మెచ్యూరిటీ కాలం ఏడాదే కాబట్టి, ఇవి సురక్షితమని, లిక్విడిటీ అధికంగా ఉంటుందనే ఉద్దేశంతో చాలా డెట్ ఫండ్స్‌ల్లో వీటిల్లో ఇన్వెస్ట్ చేస్తాయి.

**ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్స్(ఈఎల్ఎస్ఎస్) ఫండ్స్ ఏ కేటగిరీలోకి వస్తాయి? లార్జ్ క్యాపా? స్మాల్ క్యాపా?** – విజయ, హైదరాబాద్

ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్ ఏ కేటగిరీ కిందకైనా వస్తాయి. లార్జ్ , స్మాల్ క్యాప్, వేల్యూ–ఓరియంటెడ్, ఇలా ఏ కేటగిరీకైనా చెందుతాయి. ఇవి ఫలానా కేటగిరీ ఫండ్స్ కిందకు వస్తాయని చెప్పడానికి లేదు. వీటిల్లో చాలా ఫండ్స్ మల్టీ–క్యాప్ ఫండ్స్ కేటగిరీ కిందకు వస్తాయి. మరికొన్ని లార్జ్ క్యాప్ కేటగిరీ కిందకు వస్తాయి. ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్ పోర్ట్‌ఫోలియోకి సంబంధించిన వివరాలు కావాలంటే, సదరు ఫండ్ వెబ్‌సైట్‌లో ఫ్యాక్ట్‌షీట్ మీద క్లిక్ చేసి తెలుసుకోవచ్చు. లేదంటే వేల్యూ రీసెర్చ్ వెబ్‌సైట్‌లో సదరు ఫండ్ పేజీ నుంచి సమాచారం తెలుసుకోవచ్చు. ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్‌లోని ఇన్వెస్ట్‌మెంట్స్‌కు మూడేళ్ల లాక్–ఇన్ పీరియడ్ ఉంటుంది. కనీసం నాలుగు నుంచి ఐదేళ్లపాటు ఈఎల్ఎస్ఎస్‌ల్లో ఇన్వెస్ట్ చేస్తేనే మంచి రాబడులు పొందవచ్చు.

**నాకు ఇటీవలే పెద్ద మొత్తంలో బోనస్ వచ్చింది. ఇలా పెద్ద మొత్తంలో బోనస్‌లు వచ్చిన ఇతర మిత్రులందరూ ఆ మొత్తాలను బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు(ఎఫ్‌డీ) చేశారు. నేను ఈ మొత్తాన్ని మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేద్దామనుకుంటున్నాను. నాకు మ్యూచువల్ ఫండ్స్ కొత్త. పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేయడానికి ఏ మ్యూచువల్ ఫండ్‌ను ఎంచుకోవాలి ?** –ఈశ్వర్, విశాఖపట్టణం



Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేయాలంటే డెట్ ఫండ్స్‌ను మాత్రమే పరిగణించాలి. ఈ డెట్ ఫండ్స్‌ల్లో కూడా లిక్విడ్, ఆల్ట్రా–షార్ట్ డ్యూరేషన్ ఫండ్స్‌ను మాత్రమే పరిశీలించండి. ఇటీవలే మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ డెట్ ఫండ్స్‌కు సంబంధించి కొత్త నిబంధనలను రూపొందించింది. ఈ కొత్త నిబంధనల కారణంగా డెట్ ఫండ్స్ మరింత సురక్షితమని చెప్పవచ్చు. మీరు తొలిసారిగా మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నారు. కాబట్టి, మీరు చాలా జాగ్రత్తగా ఫండ్‌ను ఎంపిక చేసుకోవాలి. మీరు ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్న ఫండ్ గతంలో ఎలాంటి పనితీరు ఎలా ఉందో కూడా చూడండి. డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయడానికి గతంలోని పనితీరు ప్రాతిపదిక కాకపోయినా, ఆ ఫండ్ పనితీరు, రాబడుల పట్ల మీకు ఒకింత అవగాహన వస్తుంది. ఈక్విటీ మ్యూచువల్‌ఫండ్స్‌లో దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేస్తే మంచి రాబడులు వస్తాయి. కానీ ఈక్విటీ ఫండ్స్‌ల్లో ఎప్పుడూ పెద్ద మొత్తంలో ఒకేసారి ఇన్వెస్ట్ చేయకూడదు. సిప్ (సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్) విధానంలో ఇన్వెస్ట్ చేస్తేనే మంచి రాబడులు పొందగలరు.

**నా వయస్సు 60 ఏళ్లు. గత చాలా ఏళ్లుగా డెట్ ఫండ్స్‌ల్లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. ఈ ఫండ్స్ 8–9% రాబడులు ఇస్తున్నాయి. అయితే డీహెచ్ఎఫ్ఎల్ డీఫాల్ట్‌తో అంతా మారిపోయింది. నేను యూటీఐ డెట్ ఫండ్స్‌లో భారీగానే ఇన్వెస్ట్ చేశాను. ఒక ఫండ్ జూన్‌లోనే మెచ్యూర్ అయింది. అయితే దీనికి సంబంధించి నగదు రాలేదు. డీహెచ్ఎఫ్ఎల్ తమ బకాయిలను చెల్లించిన తర్వాత నా డబ్బులు వస్తాయని యూటీఐ సంస్థ అంటోంది. ఇప్పుడు ఏం చేయాలి ?** –జాన్సన్, సికింద్రాబాద్


యూటీఐ చెప్పింది వాస్తవమే. చెల్లింపుల్లో విఫలం కావడంతో పలు రేటింగ్ సంస్థలు డీహెచ్ఎఫ్ఎల్ బాండ్ల రేటింగ్‌ను డౌన్‌గ్రేడ్ చేశాయి. డీహెచ్ఎఫ్ఎల్ ఈ బాండ్లకు సంబంధించి ఇప్పటికే వడ్డీని చెల్లించింది. దీంతో రేటింగ్స్‌ను సవరించమని డీహెచ్ఎఫ్ఎల్ రేటింగ్ సంస్థలను కోరింది. రేటింగ్స్ సవరిస్తే, బాండ్ల విలువ పెరుగుతుంది. మీకు ప్రయోజనం కలుగుతుంది. అప్పటిదాకా ఎదురు చూడండి. డీహెచ్ఎఫ్ఎల్ ఉదంతంతో యూటీఐ ఫిక్స్‌డ్–ఇన్‌కమ్ ఫండ్స్‌పై తీవ్రమైన ప్రభావమే పడింది. మీ విషయంలో మీరు మీ ఇన్వెస్ట్‌మెంట్స్ అన్నీ ఎక్కువగా ఒకే మ్యూచువల్ ఫండ్ సంస్థ(యూటీఐ)లో, అదిన్నూ ఒక కేటగిరీ ఫండ్(డెట్ ఫండ్స్‌ల్లోనే) ఇన్వెస్ట్ చేశారు. ఒకే మ్యూచువల్ ఫండ్ సంస్థ ఆఫర్ చేసే ఫండ్స్‌ల్లో ఎక్కువగా ఇన్వెస్ట్ చేస్తే, ఒక వేళ సదరు సంస్థకు ఏమైనా ప్రతికూల పరిస్థితులు ఎదురైతే, మొత్తం ఫండ్స్ పనితీరు ప్రభావితమవుతుంది. అందుకని ఎప్పుడూ ఒకే మ్యూచువల్ ఫండ్ సంస్థ ఆఫర్ చేసే ఫండ్స్‌ల్లో ఇన్వెస్ట్ చేయకూడదు. మరోవైపు, మ్యూచువల్ ఫండ్స్ డైవర్సిఫికేషన్ కూడా కీలకం. అందుకని ఒకే రకమైన ఫండ్స్‌లో కాకుండా ఈక్విటీ, ఈఎల్ఎస్ఎస్, డెట్ తదితర ఫండ్స్ మిశ్రమంగా మీ పోర్ట్‌ఫోలియో ఉండాలి.

## సెన్సెక్స్ తక్షణ నిరోధం 39,020-మద్దతు 38,475

**మార్కెట్ పంచాంగం**


ఒకవైపు అమెరికా స్టాక్ సూచీలు కొత్త రికార్డులు సృష్టిస్తుండగా, మరోవైపు యూరప్, ఆసియా సూచీలు స్వల్పశ్రేణిలో హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తే అధిక ప్రయోజనం అందుకునే భారత్, చైనా, బ్రెజిల్, రష్యా వంటి వర్ధమాన మార్కెట్లు...అమెరికా ట్రెండ్‌తో విడివడి నిస్తేజంగా ట్రేడవుతుండటం గత కొద్ది సంవత్సరాలుగా ఎన్నడూ జరగలేదు. ఇది ప్రపంచ మార్కెట్ల ట్రెండ్ మార్పునకు సూచనా? ఈ అంశంపై స్పష్టత రావాలంటే మరికొద్దివారాలు ఆగాల్సివుంటుంది. ఇక భారత్ సంగతికొస్తే...బడ్జెట్ ప్రతిపాదనలు రుచించని విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలతో గతవారం భారీగా క్షీణించిన నేపథ్యంలో వెలువడుతున్న కార్పొరేట్ ఫలితాలు సూచీలను సమీప భవిష్యత్తులో ఒడుదుడుకులకు లోనుచేయవచ్చు.

### సెన్సెక్స్ సాంకేతికాంశాలు...




జూలై 12తో ముగిసిన వారంలో తొలిరోజున గ్యాప్‌డౌన్‌తో 39,441 పాయింట్ల వద్ద ప్రారంభమైన బీఎస్ఈ సెన్సెక్స్, అటు తర్వాత అమ్మకాల ఒత్తిడికి లోనై ఆ మరుసటి రోజున 38,436 పాయింట్ల కనిష్టస్థాయికి పడిపోయింది. అటుతర్వాత మూడు రోజులూ స్వల్ప హెచ్చుతగ్గులకు లోనై చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 777 పాయింట్ల నష్టంతో 38,736 పాయింట్ల వద్ద ముగిసింది. ఓవర్‌సోల్డ్ కండీషన్‌లో వున్నందున...పుల్‌బ్యాక్ ర్యాలీలు వస్తే ఈ వారం సెన్సెక్స్ 39,020 పాయింట్ల వద్ద ఎదురయ్యే నిరోధాన్ని తొలుత దాటాల్సివుంటుంది. ఆపైన ముగిస్తే 39,200 పాయింట్ల సమీపస్థాయిని అందుకోవొచ్చు. అటుపైన 39,441–39,476 పాయింట్ల శ్రేణి రానున్న రోజుల్లో సెన్సెక్స్‌కు గట్టి అవరోధం కల్గించవచ్చు. ఈ వారం తొలి నిరోధాన్ని దాటలేకపోతే 38,475 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతును కోల్పోతే క్రమేపీ 38,000 పాయింట్ల వద్దకు పతనం కావచ్చు. ఈ స్థాయిని కూడా నిలుపుకోలేకపోతే 37,640 పాయింట్ల వరకూ పతనం కొనసాగవచ్చు.

### నిఫ్టీ తక్షణ నిరోధం 11,640-మద్దతు 11,475




గత వారం 11,772 పాయింట్ల వద్ద గ్యాప్‌డౌన్‌తో ప్రారంభమైన ఎన్ఎస్ఈ నిఫ్టీ నిలువునా పతనమై 11,461 పాయింట్ల కనిష్టస్థాయికి పడిపోయింది. చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 259 పాయింట్ల భారీ నష్టంతో 11,552 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం నిఫ్టీ పెరిగితే 11,640 పాయింట్ల వద్ద తక్షణ అవరోధం కలగవచ్చు. అటుపైన ముగిస్తే 50 డీఎంఏ కదులుతున్న 11,710 పాయింట్ల స్థాయివరకూ పెరగవచ్చు. ఈ స్థాయిని కూడా అధిగమిస్తే గత సోమవారంనాటి ట్రేడింగ్‌గ్యాప్ 11,772–11,798 పాయింట్ల స్థాయి నిఫ్టీని రానున్న రోజుల్లో గట్టిగా నిరోధించవచ్చు. ఈ వారం తొలి నిరోధాన్ని దాటలేకపోయినా, బలహీనంగా ప్రారంభమైనా 11,475 పాయింట్ల వద్ద తొలి మద్దతు లభ్యమవుతున్నది. ఈ మద్దతులోపున ముగిస్తే 11,426 పాయింట్ల స్థాయికి పడిపోవచ్చు. ఈ కీలకస్థాయిని కోల్పోతే వేగంగా 11,300 పాయింట్ల వరకూ పతనం కొనసాగవచ్చు.

– పి. సత్యప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న హన్నన్ మొల్లా

## బలమైన ఉద్యమాలు నిర్మించాలి: హన్నన్ మొల్లా

**హైదరాబాద్:** దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ, రైతాంగ వ్యతిరేక విధానాలపై బలమైన ఉద్యమాలు నిర్మించాలని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఏఐకేఎస్ ముగింపు సమావేశంలో హన్నన్ మొల్లా మాట్లాడుతూ, వ్యవసాయ సంక్షోభంతో దేశంలో వృద్ధి రేటు పడిపోతున్నా.. కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో వృద్ధి రేటు పెరుగుతుందని ఆర్థిక మంత్రి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 13 రాష్ట్రాల్లో కరువు విలయతాండవం చేస్తోందని, దానిపై నిర్దిష్టమైన కార్యాచరణ రూపొందించడం లేదని విమర్శించారు. తెలంగాణ రైతు సంఘం కార్యదర్శి టి.సాగర్ మాట్లాడుతూ.. రైతు సమస్యలపై ఈ నెల 22న కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు, ఆగస్టు 3న కనీస మద్దతు ధరల చట్టం సాధన కోసం ఆందోళనలు, సెప్టెంబర్ 5న కార్మిక సంఘాలతో ఢిల్లీలో ఐక్య ఉద్యమాలు చేస్తామని తెలిపారు. ఏఐకేఎస్ అధ్యక్షుడు అశోక్ ధావలే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడు పి.జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జరిమానాలకూ జడవడం లేదు!

**ఈ ఏడాదిలో రూ.58 కోట్ల పెనాల్టీలు**

- ఓవర్ స్పీడ్‌కే రూ.46 కోట్లు కట్టారు
- రోజుకు సగటున 7 వేల ఉల్లంఘనలు, రూ.3.22 లక్షల జరిమానాలు
- ఉల్లంఘనుల్లో అధికశాతం విద్యావంతులే



**సాక్షి, హైదరాబాద్:** 'వేగం కంటే గమ్యం ముఖ్యం'రోడ్డు భద్రతలో ప్రధాన నినాదం ఇది. దీనికి భిన్నంగా యువత దూసుకుపోతోంది. వేగమే ముఖ్యమనుకొని నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ప్రాణాల రక్షణకు ప్రాధాన్యమివ్వడంలేదు. వేల రూపాయల జరిమానాలు చెల్లిస్తున్నారే తప్ప.. నిబంధనలను పాటించడం లేదు. 33 జిల్లాల్లో రోజూ నమోదవుతున్న గణాంకాలు పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతున్నాయి. ఓవర్ స్పీడ్, రాంగ్ పార్కింగ్, సీటు బెల్టు ధరించకపోవడం, డ్రైవింగ్‌లో మొబైల్ మాట్లాడటం, గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకోవడం తదితర కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు 12,46,420 కేసులు నమోదయ్యాయి. రోజుకు సగటున 6,924 కేసులకుపైగా నమోదవుతున్నాయి. ఈ ఆరునెలల్లో మొత్తం రూ.58.86 కోట్ల జరిమానా చెల్లించారు. అంటే రోజుకు రూ.3.22 లక్షలు కడుతున్నారన్నమాట. అయినా పరిస్థితిలో మార్పు రాకపోగా పోనుపోను ఇవి అధికమవుతుండటం గమనార్హం. ఇలా రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తున్నవారిలో అధిక శాతం విద్యావంతులు, యువత, ఉద్యోగులు ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. చలానాలు కట్టే వాహనాల్లో ఎక్కువగా కార్లు, బైకులు ఉంటున్నాయని పోలీసులు తెలిపారు.

### డ్రైవింగ్ టెస్ట్ పెట్టి లాభమేంటి?

ఏ వాహనమైనా రోడ్డు మీదకు రావాలంటే డ్రైవింగ్ పరీక్షలు పాస్ కావాల్సిందే. లెర్నింగ్ లైసెన్స్ (ఎల్ఎల్ఆర్) కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడే అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తారు. అందులో రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు చిహ్నాలు, పాటించాల్సిన నిబంధనలను కచ్చితంగా గుర్తుపట్టి సమాధానాలు రాయాల్సి ఉంటుంది. అడ్డదారిలో డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందే వారిలో ఉల్లంఘనులు అధికం. ఎల్ఎల్ఆర్ టెస్టును మరింత పకడ్బందీగా అమలు చేస్తేనే ఇలాంటి ఉల్లంఘనలు, ప్రమాదాలు తగ్గుతాయని రవాణా రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### 12 పెనాల్టీ పాయింట్ల సిస్టమ్ అటకెక్కినట్లేనా?

హైదరాబాద్ నగర పరిధిలో రెండేళ్ల క్రితం మొదలుపెట్టిన ట్రాఫిక్ ఉల్లంఘన 12 పెనాల్టీ పాయింట్ల సిస్టమ్ మంచి ఫలితాలనే ఇచ్చింది. తరచూ ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారి డ్రైవింగ్ లైసెన్సుతోపాటు వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్(ఆర్‌సీ)ని కూడా రద్దు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. రెండేళ్లలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడి 12 పాయింట్లకు చేరుకుంటే.. వారి వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను రద్దు చేయాలని అధికారులు భావించారు. దీని అమలులో పలు సాంకేతిక, చట్టపరమైన సమస్యలు తలెత్తడంతో దీన్ని అధికారులు తాత్కాలికంగా పక్కనబెట్టారు. ఈ విధానాన్ని తిరిగి ప్రారంభిస్తే.. ఉల్లంఘనలు తగ్గుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

| ఉల్లంఘన రకం.. | నమోదైన కేసులు | | వసూలు చేసిన జరిమానాలు(రూ.లలో) | |
|---|---|---|---|---|
| | జూలై 3 | జనవరి నుంచి జూలై 3 వరకు | జూలై 3 | జనవరి నుంచి జూలై 3 వరకు |
| ఓవర్ స్పీడ్ | 2,877 | 5,75,642 | 22,45,355 | 46,05,33,606 |
| ఓవర్ లోడింగ్ | 750 | 1,22,831 | 1,33,590 | 2,16,23,154 |
| రాంగ్ పార్కింగ్ | 2,796 | 4,58,627 | 4,99,655 | 7,49,98,510 |
| గూడ్స్ వెహికిల్ | 226 | 19,930 | 96,500 | 69,57,055 |
| మొబైల్ మాట్లాడటం | 159 | 27,306 | 1,01,745 | 1,70,45,987 |
| సీటుబెల్టు లేనివి | 354 | 42,084 | 67,600 | 74,89,210 |
| మొత్తం | 7,162 | 12,46,420 | 31,44,445 | 58,86,47,522 |



## ఓయూ దూరవిద్యలో ప్రవేశాల నోటిఫికేషన్

**హైదరాబాద్:** ఉస్మానియా వర్సిటీలోని ప్రొఫెసర్ జి. రామిరెడ్డి దూరవిద్య కేంద్రంలో 2019–20 విద్యా సంవత్సరానికి సోమవారం (15వ తేదీ) నుంచి అక్టోబర్ 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. ప్రస్తుతం కొనసాగుతున్న బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఏ, ఎంకాం, ఎంబీఏ, ఎమ్మెస్సీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలతోపాటు మరో మూడు కొత్త కోర్సులను ఈ సంవత్సరం ప్రవేశపెట్టారు. ఎంఏ ప్రభుత్వ పాలన శాస్త్రం, బీకాం కంప్యూటర్ అప్లికేషన్, పీజీ డిప్లొమా ఇన్ డేటా సైన్స్ కోర్సులు ఈ విద్యా సంవత్సరం నుంచి కొనసాగనున్నాయి. ఆన్‌లైన్ దరఖాస్తులను www.oucde.net వెబ్‌సైట్లో చేసుకోవాలి. డిగ్రీ, డిప్లొమా కోర్సులకు ఇంటర్, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని అధికారులు తెలిపారు. పూర్తి వివరాలకు 9492108385 నంబర్‌ను సంప్రదించాలి.




## సినిమా ప్రచారం కోసం
# నటుడి చావు పోస్టర్

- వారం రోజులకు నిజంగానే మరణం
- తమిళనాడులో ఘటన

**సాక్షి ప్రతినిధి, చెన్నై:** సినిమా ప్రచారం కోసం వీధుల్లో వేసిన చావు పోస్టర్ నిజమై పోస్టర్‌లో ఉన్న వర్ధమాన నటుడు నిజంగానే మరణించిన చిత్రమైన ఘటన తమిళనాడులో చోటు చేసుకుంది. తూత్తుకూడి జిల్లా కాయల్‌పట్టినంకు చెందిన ఆర్ఎస్ గోపాల్ (52) అనే వ్యక్తి వంటపని, శుభ, అశుభ కార్యక్రమాలకు షామియానా, సామాన్లు సరఫరా చేసే వృత్తులు నిర్వహిస్తుంటాడు. 'గరిట నుంచి గజరాజు వరకు అన్నీ దొరకును' అనే చిత్రమైన నినాదంతో బోర్డు ఏర్పాటు చేయడం, మనిషి రూపురేఖలు కూడా బాగుండడంతో సినిమా అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి.


తన చావు పోస్టర్‌ను చించివేస్తున్న గోపాల్ (ఫైల్)

ఇటీవల అతడు ఒక సినిమాలో విలన్‌గా నటించగా, ఆ సినిమాలో అతను చనిపోవడం, 'కన్నీటి అంజలి' అంటూ వీధుల్లో పోస్టర్లు వెలియడం లాంటి దృశ్యాలను చిత్రీకరించారు. ఈ దృశ్యాలను గోపాల్ వాట్సాప్ ద్వారా సరదాగా బంధుమిత్రులకు పంపాడు. ఆవేదన చెందిన వారంతా అంత్యక్రియల్లో పాల్గొనేందుకు పూలమాలలు తీసుకుని అతని ఇంటికి చేరుకోగా గోపాల్ హాయిగా కుర్చీ వేసుకుని నవ్వుతూ కనిపించాడు. అవన్నీ తన కొత్త సినిమా కోసం చిత్రించిన దృశ్యాలని వారికి వివరించి, తన ఇంటి గోడకు అతికించి ఉన్న 'కన్నీటి అంజలి' పోస్టర్లను వారి ముందే చించుతూ ఫోజిచ్చి పంపి వేశాడు. వారం రోజుల క్రితం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇదిలా ఉండగా, గోపాల్ మరణించినట్లు శనివారం మరలా ఊరంతా పోస్టర్లు వెలియడంతో ఇది కూడా సినిమా ప్రచారమేనని అందరూ భావించారు. కొందరు అనుమానంతో వారింటికి ఫోన్ చేయగా అనారోగ్య కారణాల వల్ల గోపాల్ మృతి చెందినట్లు బంధువులు చెప్పడంతో ఆశ్చర్య పోయారు. తన చావు పోస్టర్లను తానే ప్రచారం చేసుకున్న వారం రోజులకు గోపాల్ నిజంగానే మరణించిన ఆశ్చర్యకరమైన ఘటన తమిళనాడులో చర్చనీయాంశమైంది.

## గౌడ హాస్టల్ అధ్యక్షుడిగా పల్లె లక్ష్మణ్ గౌడ్ ఎన్నిక

**హైదరాబాద్:** గౌడ హాస్టల్ అధ్యక్షుడిగా పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్ మరోసారి ఎన్నికయ్యారు. మూడు పర్యాయాలుగా సేవలందిస్తూ వస్తున్న లక్ష్మణ్ తిరిగి నాలుగోసారి అధ్యక్షుడిగా గెలుపొందారు. ఆదివారం దోమలగూడలోని ఏవీ కాలేజీలో రసవత్తరంగా జరిగిన గౌడ వసతి గృహం ఎన్నికల్లో మొత్తం 2,161 ఓట్లు పోలయ్యాయి. ఇందులో లక్ష్మణ్‌కు 1,001 ఓట్లు రాగా, పోటీ పడ్డ బాలరాజు గౌడ్‌కు 549, పరుశురామ్ గౌడ్‌కు 541 ఓట్లు పోలయ్యాయి. లక్ష్మణ్‌తో పాటు ఆయన ప్యానల్ కూడా విజయం సాధించడం విశేషం.




## 'జీవో 10 ప్రకారం టీఆర్టీ కౌన్సెలింగ్ నిర్వహించాలి'

**సాక్షి, హైదరాబాద్:** ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ)ల్లో జీవో 10 ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించి, నియామక ఉత్తర్వులివ్వాలని సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో 10 మార్గదర్శకాలను పాఠశాల విద్యాశాఖ ఉల్లంఘిస్తూ కౌన్సెలింగ్ నిర్వహిస్తోందని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలకు అన్యాయం జరుగుతోందన్నారు. పాఠశాల విద్యాశాఖ అమలు చేస్తున్నవిధానం సరైంది కాదని, దీనిని ఉపాధ్యాయ సంఘాలు, అభ్యర్థులు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. గతంలో జరిగిన డీఎస్సీలకు భిన్నంగా ఈ నియామకాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు.

## ఆర్టీసీకి రూ. 3 వేల కోట్లు కేటాయించాలి

**ఆర్టీసీ మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు**

**సాక్షి, హైదరాబాద్:** ప్రస్తుతం తెలంగాణ ఆర్టీసీ పరిస్థితి బాగోలేనందున ప్రభుత్వం రూ. 3 వేల కోట్లను కేటాయించాలని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్, కార్మిక సంఘం సీనియర్ నేత నాగేశ్వరరావు ఓ ప్రకటనలో కోరారు. ఇటీవల ఏపీ ప్రభుత్వం ఆర్టీసీ అవసరాలు తీర్చేందుకు బడ్జెట్‌లో రూ. 1572 కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. ఏపీతో పోలిస్తే ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ, ఆర్టీసీకి నిధులు కేటాయిస్తే పరిస్థితి బాగుపడుతుందని తెలిపారు.

## ఆట్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

**సాక్షి, హైదరాబాద్:** ఆస్ట్రేలియన్ తెలంగాణ స్టేట్ అసోసియేషన్ (ఆట్స్) అధ్యక్షుడిగా బద్దం రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం సిడ్నీలో సమావేశమై కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం ఉపాధ్యక్షురాలిగా శ్రీదేవి తుమ్మనపల్లి, కార్యదర్శిగా పావని రాగిపాని ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రవికాంత్ ఓ ప్రకటనలో తెలిపారు.




Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792